

'పారదర్శకతతో పథకాలు
అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా
సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 332

గురువారం 22-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


కథలు మార్చగలవు -IIలో


ఊరు మెచ్చిన ఊరగాయ -IIలో

సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
గురువారం ॥ 22-2-2024



కథలు మార్చగలవు

రచయిత్రి, ఫొటోగ్రాఫర్ అయిన కరిష్మా మెహతా హ్యూమన్స్ ఆఫ్ బాంబే వెబ్‌సైట్ వ్యవస్థాపకురాలు, నిర్వాహకురాలు. హృదయాలను కదిలించే ప్రత్యేకమైన కథా విధానం ద్వారా ప్రజాదరణ పొందిన రచయిత్రి. ముంబై వాసి కరిష్మా మెహతా కాలక్షేపంగా కాకుండా సామాజిక బాధ్యతనూ తన కథనాల ద్వారా పంచుకుంటూ నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆమె ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై డిజిటల్ రంగంలో తనను తాను ఆవిష్కరించుకోవడం, లక్షలమందికి చేరువైన తీరుతో సహా తన కథనంతటినీ పంచుకున్నారు.

దాదాపు పదేళ్ల క్రితం ప్రారంభించిన ఫేస్ బుక్ పేజీ 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' కరిష్మా మెహతాకి ఎంతో పేరు తెచ్చిపెట్టింది. ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించినప్పుడు ఆమె వయసు కేవలం 21 ఏళ్లు. ఇప్పుడు విస్తృతమైన ప్లాట్‌ఫారమ్‌గా పరిణామం చెందింది. సామాన్యుల నుంచి ఉన్నతస్థాయి వ్యక్తుల వరకు ముంబై నివాసితుల కథనాలను వెలుగులోకి తెచ్చింది. అందుకోసం ఆమె పడిన కష్టం సామాన్యమైనది కాదు. సంపన్న వర్గంలో పుట్టినా తనకున్న ఆసక్తితో సామాన్యులలో తిరిగి, ఫొటోలతో వారి కథనాలను ప్రజలకు అందిస్తూ వచ్చింది. మొదట్లో ఇద్దరు టెక్నికల్ వ్యక్తులతో కలిసి ప్రారంభించిన ఈ పని మెహతాను నేడు మిలియన్ల మందికి చేరువ చేసింది. దేశంలోని ఇతర ప్రాంతాలలో పలువురు ఆమె వెబ్‌సైట్‌కి ఫ్రీలాన్సర్లుగా ఉండేలా చేసింది. కిందటేడాది 'హౌ ది హెల్ డిడ్ డూ ఇట్' అనే యూట్యూబ్ వెబ్ సిరీస్ ద్వారా వ్యాపారవేత్తలు, ప్రముఖులు, ఇతర నిష్ణాతులైన వ్యక్తుల ఇంటర్వ్యూల ద్వారా తనలో ఉన్న మరో ప్రతిభను పరిచయం చేసింది. రైటర్‌గా, ఫొటోగ్రాఫర్‌గా, ప్రెజెంటర్‌గా రాణిస్తున్న కరిష్మా మాట్లాడుతూ –

చేయూతగా మారడం సంతోషం

''కష్టంలో ఉన్న వ్యక్తులను గుర్తించడం, కలుసుకోవడం, మాట్లాడటం ప్రతిరోజూ జరుగుతుంటుంది. వారి కథను ఐదు వందల పదాల్లో మా పోర్టల్ ద్వారా తెలియజేయడం మాత్రమే కాదు ఏళ్లుగా జరుగుతోంది... అవసరమైన వారికి డబ్బు సేకరించి వారు తమ కష్టమైన పరిస్థితి నుండి బయట పడటానికి సహాయం చేయడం సంతోషంగా ఉంటుంది. ఒకరోజు హాస్పిటల్‌లో ఒక గర్భిణిని చూశాను. ఆమెకు అప్పటికే ఐదుగురు కూతుళ్లు ఉన్నారు. మగపిల్లవాడు కావాలనే ఆశతో పిల్లలను కంటూనే ఉంది. మద్యానికి బానిసైన భర్త ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఫలితంగా ఆమె ఆసుపత్రి పాలు, భర్త జైలు పాలూ అయ్యారు. ఆమె కథనాన్ని జనం ముందుకు తీసుకువచ్చాను. ఆమెకు, ఆమె ఐదుగురు కూతుళ్లకు సమాజం నుంచి ఆర్థిక భద్రత లభించింది. ఆసరాగా అందిన రూ. 25 లక్షల రూపాయలు వారి జీవనం సాఫీగా గడపడానికి ఉపయోగపడ్డాయి. మరొక కథ జమ్మూ కాశ్మీర్‌కు చెందిన అలీ భాయ్‌ది. చేయని నేరానికి ఏళ్లుగా జైలు జీవితం గడుపుతుండేవాడు. అతని కథ బయటకు రావడంతో ఆ జీవితం నుంచి విముక్తి లభించింది. అలాగే, యాసిడ్ బాధితులకు, సెక్స్‌వర్కర్ల పిల్లలకు, ఎముక గుజ్జు మార్పిడి అవసరమయ్యే పిల్లల కోసం క్రౌడ్ ఫండింగ్ చేసి ఐదుకోట్ల నిధులను సేకరించి, అందించాం. వెబ్‌సైట్‌కు నిధులు సమకూర్చడానికి చేసిన మొదటి ప్రయత్నంలో 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పుస్తకం పబ్లిష్ అయ్యింది. అంటే, మా కథలు ప్రజలలో పెద్ద మార్పును తీసుకువచ్చాయి. ఎన్నోచోట్ల నుంచి మాకు కథనాలు అందుతుంటాయి. వాటి ద్వారా ఎంతో మందికి స్ఫూర్తిని, సేవను అందించగలుగుతున్నాం''అని వివరిస్తారు ఆమె.

ప్రతి వ్యక్తీ ప్రత్యేకమే!

'ఏ కలా సాధించలేనంత పెద్దది కాదు' అని చెప్పే కరిష్మా జీవితంలో చేయాల్సినవి ఎన్నో ఉన్నాయని భావించే వ్యక్తి. యూనివర్శిటీ ఆఫ్ నాటింగ్‌హామ్ నుండి బిజినెస్ అండ్ ఎకనామిక్స్‌లో డిగ్రీ పట్టా పొందిన కరిష్మా ఎప్పుడూ వ్యాపార వ్యూహాలను రూపొందిస్తూ ఉండేది. కెనడాలో డిగ్రీ పూర్తయిన ఆరు నెలల తర్వాత హ్యూమన్స్ ఆఫ్ న్యూయార్క్ నుంచి స్ఫూర్తి పొంది ముంబైలోని వ్యక్తుల కథలు, వారి జీవితాలను పరిచయం చేయడానికి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను ఏర్పాటు చేసింది. ఎటువంటి గుర్తింపు లేని వ్యక్తుల గురించి కథలు చెప్పాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఈ వెబ్‌సైట్ ద్వారా ఆరువేలకు పైగా కథనాలను అందించింది. ప్రతి వ్యక్తీ ప్రత్యేకమైన వారని, స్ఫూర్తిదాయకంగా ఉంటారని చూపించింది. నాలుగు లక్షలకు పైగా ఉండే సమూహాన్ని విజయవంతంగా నడిపిస్తోంది. ఫేస్‌బుక్‌లో మిలియన్‌కు పైగా ఫాలోవర్స్ ఉంటే ఇన్‌స్టాగ్రామ్‌లో రెండింతలకు పైగా ఉన్నారు. ఫ్రీలాన్స్ రైటర్‌గా టెడెక్స్ ప్రెజెంటర్‌గానూ రాణిస్తున్న కరిష్మాకు సామాన్యుల కథనాలను పరిచయం చేయడం పట్ల ఆమెకున్న అభిరుచి, వ్యవస్థాపక స్ఫూర్తి అత్యంత ప్రభావవంతమైన వేదికగా రూపొందించడానికి ఉపయోగించుకుంది.

ఆమె ఈ ప్రయాణం అంత సాఫీగా ఏమీ జరగలేదు. ఎన్నో ఒడిదొడుకులనూ ఎదుర్కొంది. కాపీ క్యాట్ అనే పేరును సొంతం చేసుకుంది. వివాదాలను, సవాళ్లను స్వీకరించింది. అయినా, తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ సమాజంలో తన ఉనికిని, బాధ్యతనూ సమానంగా నిలబెట్టుకుంటున్నానని తన మాటలు, చేతల ద్వారా నిరూపిస్తున్న కరిష్మా అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

– నిర్మలారెడ్డి

నివాళి



పాటల పూలమాలి వెళ్లిపోయాడు

'బెహనో.. ఔర్ భాయియో'... ఈ గొంతుతో ప్రేమలో పడని రేడియో శ్రోత ఉండేవాడు కాదు. 'బినాకా గీత్‌మాల' టాప్ 13లో ఏ పాట నిలుస్తుందో చూద్దామని వారమంతా ఎదురుచూపులు. నవ్వుతూ నవ్విస్తూ గుంజిపారేసే ఆకర్షణీయమైన గొంతుతో దశాబ్దాల పాటు పాటలను పంచిన రేడియో ప్రెజెంటర్ అమిన్ సయానీ తన 91వ ఏట బుధవారం వీడ్కోలు తీసుకున్నాడు. ఇకపై భారతీయ సాంస్కృతిక ఆనవాలై అతను వెలగనున్నాడు.

పాటలు విరబూస్తాయి. అదిగో అల్లంత దూరాన ఒక చామంతి పూస్తుంది. ముళ్లను వెనక్కు నెడుతూ ఒక రోజా మెడ నిక్కి చూస్తుంది. గుబురు చాటున మల్లెమొగ్గ ఒకటి సిగ్గుతో మొహం దాచుకుంటుంది. గరిక పచ్చతావులో గడ్డిపూవు వర్ణనకు అందని రంగుతో కాంతి లీనుతుంది. వాటి మానాన అవి ఉన్నప్పుడు మన చూపు పడకపోవచ్చు. పడినా వాటి సౌందర్యమేమిటో తెలియకపోవచ్చు.

అప్పుడొక పూలమాలి వస్తాడు. ఒక పువ్వు సువాసన ఎంత ప్రత్యేకమైనదో చెబుతాడు. మరో పూలరెక్క వయ్యారాన్ని చూపి విస్మయపడతాడు. ఒక పువ్వును నాసిక దగ్గర చేర్చడమే భాగ్యమంటాడు. ఒక పువ్వునలా కొమ్మకు వదిలిపెట్టమని మారాము చేస్తాడు. అప్పుడా పూల మీద మనకు ప్రేమ కలుగుతుంది. మనమూ వాటికి మాలిగా మారాలనుకుంటాము. గుండెకు దగ్గరగా చేర్చుకుంటాము. హృదయంతో వాటి పోషణకు పూనుకుంటాము.

అమిన్ సయానీ చేసింది అదే.

రేడియో సిలోన్‌లో హిందీ సినిమా పాటలను శ్రోతలకు చేర్చడం. వాటిపై ప్రేమను పంచడం. వాటిని పాడుకుంటూ, కూనిరాగాలు తీస్తూ, ఆ మనోహర మాయలో చిక్కుకుంటూ జనం తమ బతుకు బాదరబందీని కాసేపు మరచిపోయేలా చేయడం. 1952 డిసెంబర్‌లో మొదటి షోగా మొదలైన 'బినాకా గీత్‌మాల' బినాకా టూత్‌పేస్ట్ వారి స్పాన్సర్డ్ ప్రోగ్రామ్. ప్రతి బుధవారం సాయంత్రం రేడియో సిలోన్‌లో ప్రసారమయ్యేది. టాప్ 13తో మొదలయ్యి టాప్ 1 వరకూ కౌంట్‌డౌన్‌గా పాటలు ప్రసారమయ్యే ఆ షో చివరలో తర్వాతి వారం కోసం 'లిస్ట్' అయిన పాటలను చెప్పి వాటిని శ్రోతలు ఏ వరుసలో మెచ్చుతారో రాసి పంపమనేవారు. టాప్ వన్‌గా నిలిచే పాటను ఎక్కువమంది దేనిని ఎంపిక చేస్తారో దానికి ఆ ర్యాంక్ ఇచ్చేవారు. టాప్ 1ను సూచించిన వారి పేర్ల నుంచి జాక్‌పాట్ తీసి ఒక శ్రోతకు 100 రూపాయల బహుమతి ఇచ్చేవారు. అమిన్ సయాని మొదటి షో చేసేసరికి ఎంత హిట్ అయ్యిందంటే మరుసటి వారానికి 9 వేల ఉత్తరాలు స్పందనగా అందాయి. సంవత్సరం గడిచే సరికి వారం వారం వచ్చే ఉత్తరాల సంఖ్య 65 వేలకు చేరుకుంది. పోస్టాఫీసు వాళ్లు, రేడియో స్టేషన్ వారూ పిచ్చెత్తి పోయేవారు. తర్వాత ఈ రెస్పాన్స్ తంతును ఆపేసి సయానీ ఎంపిక మీద, రికార్డుల అమ్మకాలను బట్టి టాప్ 1ను డిసైడ్ చేసేవారు.



ఏ జిందగీ ఉసీకి హై...

అమిన్ సయానీ చేసిన బినాకా గీత్‌మాలాలో ఏ వారం ఏ సింగర్ పాడిన పాట టాప్ సాంగ్‌గా నిలుస్తుందో తెలుసుకోవడం శ్రోతలకే కాదు సినీ రంగ దిగ్గజాలకు కూడా పెద్ద ఆసక్తిగా ఉండేది. బినాకా చార్ట్‌లో చోటు చేసుకోవడం గౌరవంగా భావించేవారు. ఇక కొన్ని పాటలైతే వారాల తరబడి టాప్ 1గా నిలిచి ఆ గాయకులకు, సంగీత దర్శకులకు క్రేజ్‌ను సంపాదించి పెట్టేవి. సంవత్సరం చివరలో అమిన్ సయానీ 'సాంగ్ ఆఫ్ ద ఇయర్' అంటూ ఒక పాటను ప్రకటించేవాడు. ఆ రోజుల్లో 'ఏ జిందగీ ఉసీకి హై' (అనార్కలీ– 1953), 'జాయెతో జాయె కహా' (టాక్సీ డ్రైవర్ – 1954), 'మేరా జూతా హై జపానీ' (ఆవారా – 1955), 'ఏ దిల్ ముష్కిల్ జీనా యహా' (సి.ఐ.డి – 1956)... ఇలా పాటలు శ్రోతల మెచ్చుకోలుతో వెలిగేవి. బినాకా గీత్‌మాలాలో ఎక్కువసార్లు టాప్ పొజిషన్‌లో నిల్చున్న గాయని లతా. ఆ తర్వాత రఫీ.

ఆ మృదుత్వం.. ఆ దగ్గరితనం

అమిన్ సయానీ గొంతు, వాడే సులభమైన భాష, ఉచ్చారణ, మధ్య మధ్య జోకులు, కొన్ని ఆసక్తికరమైన కథనాలు ఇవన్నీ కలిసి షోను విపరీతంగా హిట్ చేశాయి. అమిన్ రేడియో అనౌన్సర్లకు మార్గదర్శి అయ్యాడు. 'గోల్డెన్ వాయిస్ ఆఫ్ ఆల్ ఇండియా రేడియో' అనిపించుకున్నాడు. జీవితాంతం ఫ్రీలాన్సర్‌గానే అమిన్ రేడియో సిలోన్‌లో, వివిధ్ భారతిలో షోస్ చేశాడు. అలాగే ఎన్నో అడ్వర్‌టైజ్‌మెంట్లలో ఆయన గొంతు వినిపించేది. సినిమా వాళ్ల అవార్డు ఫంక్షన్లలో, మ్యూజిక్ ప్రోగ్రాముల్లో అమినే యాంకర్. అంటే ఇవాళ దేశంలో ఉన్న పాపులర్ అనౌన్సర్లకు, యాంకర్లకు సయానీ సిలబస్ సెట్ చేసి వదిలాడు. 'సినిమా పాటలే మన దేశంలో సగటు ప్రజలందరినీ కలిపి ఉంచాయి' అంటాడు అమిన్ సయానీ.

బొంబాయిలో పుట్టి పెరిగి ముంబైలోనే తుదిశ్వాస వదిలిన అమిన్ సయాని ఆల్ ఇండియా రేడియో ఉజ్వల రోజులను, గోల్డెన్ ఎరా ఆఫ్ హిందీ మ్యూజిక్‌ను ప్రస్తావించినప్పుడల్లా తన ప్రియమైన గొంతుతో పునరుత్థానం చెందుతూనే ఉంటాడు.

ఇకపై కూడా అందమైన పూలు ఎన్నో పూయవచ్చు. కాని వాటిని ఊరికూరికే చూస్తూ పదేపదే సంబరపడిపోయే ఒక మాలి మరి ఉండడు.

అదంతా గతం. సుందరమైన గతం. ఎంతో శ్రావ్యంగా పదిలపరుచుకునే గతం. అది సినీ సంగీతాన్ని ఇష్టపడే వారి సొంతమైన జ్ఞాపకం.

గెలుపు దారి

ఊరు మెచ్చిన ఊరగాయ

పేరు తెచ్చింది డబ్బులు తెస్తోంది!

మధ్యప్రదేశ్‌కు చెందిన సరోజ్ ప్రజాపతికి వీరాభిమానులు ఉన్నారు. అలా అని ఆమె సెలబ్రిటీ కాదు. 'ఆమె పచ్చడి చేస్తే పండగే' అన్నట్లుగా ఉండేది. తనలోని టాలెంట్‌ను 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్'లోకి కన్వర్ట్ చేసి, 19 సంవత్సరాల కుమారుడితో కలిసి 'మామ్ మ్యాజిక్ పికెల్ ఇండియా'ను స్టార్ట్ చేసింది. నెలకు రెండు లక్షల రూపాయల వరకు సంపాదిస్తోంది. 30 మంది మహిళలకు ఉపాధిని ఇస్తోంది.



సరోజ్ ప్రజాపతి

మధ్యప్రదేశ్‌లోని షాదోర అనే గ్రామంలో తన ఇంటిలో కాలక్షేపం కోసం టీవీ చానల్స్ మారుస్తోంది సరోజ్. ఈ క్రమంలో ఆమె దృష్టి ఒక బిజినెస్ ప్రోగ్రాంపై పడింది. పచ్చళ్ల వ్యాపారంలో విజయం సాధించిన బిహార్ లోని ఇద్దరు మహిళలకు సంబంధించిన ప్రోగ్రాం అది. ఈ ప్రోగ్రాం ఆసక్తిగా చూస్తున్నప్పుడు 'నేను మాత్రం వ్యాపారం ఎందుకు చేయకూడదు!' అనుకుంది తనలో తాను.

ఇద్దరు పిల్లలకు తల్లి అయిన సరోజ్‌కు 'శభాష్' అని అందరూ అభినందించే పని ఏదైనా చేయాలనే కోరిక ఎప్పటి నుంచో ఉండేది. కాని దారి ఏమిటో తెలిసేది కాదు. 'దారి ఏమిటో తెలియాలి అంటే ముందు నీలో ఉన్న శక్తి ఏమిటో నీకు తెలియాలి' అంటారు పెద్దలు. టీవీ ప్రోగ్రాం తనలోని శక్తి, నైపుణ్యాన్ని గుర్తు తెచ్చింది.



తన సిబ్బందితో సరోజ్ (ఎడమ నుంచి మూడో వ్యక్తి)

నా కుటుంబం నా బలం

కుటుంబ సహాయసహకారాలు తోడైతే అవలీలగా విజయం సాధించవచ్చు అని చెప్పడానికి నేనే ఉదాహరణ. ఊరగాయల వ్యాపారం స్టార్ట్ చేస్తే బాగుంటుంది అన్నప్పుడు మా ఆయన, అబ్బాయి ప్రోత్సాహకంగా మాట్లాడారు. 'నువ్వు రుచి మీద దృష్టి పెట్టు చాలు. మిగిలినవి మేము చూసుకుంటాం' అని ధైర్యాన్ని ఇచ్చి ముందుకు నడిపించారు. ఒక టీవీ ప్రోగ్రాంలో విజేతల మాటలు విని ఆ స్ఫూర్తితో నేను కూడా వ్యాపారంలోకి దిగాను. దీనికి కారణం అప్పటికప్పుడు వచ్చిన ఉత్సాహం కాదు. నాకంటూ ఒక పేరు తెచ్చుకోవాలి అనే పట్టుదల. నా వల్ల ఇతర మహిళలు కూడా ఉపాధి పొందడం సంతోషంగా ఉంది.

– సరోజ్ ప్రజాపతి

కుమారుడు అమిత్ ప్రజాపతితో తనకు వచ్చిన ఆలోచనను చెప్పింది సరోజ్.

పందొమ్మిది సంవత్సరాల అమిత్ 'బ్రాండ్ బిల్డింగ్' అనే డిజిటల్ మార్కెటింగ్ ఏజెన్సీ నడుపుతున్నాడు. 'మనకెందుకమ్మా వ్యాపారం. పెద్ద రిస్క్' అనే మాట అమిత్ నోట వినిపించి ఉంటే కథ కంచికి వెళ్లి ఉండేది.

గత సంవత్సరం 'మామ్స్ మ్యాజిక్ పికిల్ ఇండియా' పేరుతో ఊరగాయల వ్యాపారం మొదలుపెట్టింది సరోజ్. 'మామ్స్ మ్యాజిక్ పికిల్ ఇండియా బ్రాండ్' గురించి సోషల్ మీడియాలో ప్రచారం మొదలుపెట్టాడు అమిత్.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ డిమాండ్‌ల నేపథ్యంలో తమ ఇల్లు చాలదని దగ్గరలోని పెద్ద స్థలంలో ఊరగాయలు తయారు చేయడం ప్రారంభించారు.

'అమ్మ దగ్గర సంప్రదాయ వంటకాలతో పాటు ఊరగాయలు తయారు చేయడం నేర్చుకున్నాను. అది నన్ను వ్యాపారవేత్తను చేస్తుందని ఊహించలేదు. ఫస్ట్ ఆర్డర్ వచ్చినప్పుడు ఎంతో సంతోషంగా అనిపించింది మామిడి కాయలు, కూరగాయలను స్థానికంగా కొనుగోలు చేస్తాను. ఊరగాయల తయారీలో రసాయనాలను ఉపయోగించం.' అంటుంది సరోజ్. 'మామిడి సీజన్‌లో మా ఇంటికి వచ్చే బంధువులు, స్నేహితులు వెళుతున్నప్పుడు ఊరగాయ జాడీని తీసుకువెళతారు. ఊరగాయ రుచి చూసిన ప్రతి ఒక్కరూ అద్భుతం అంటారు.

ఇది గుర్తు తెచ్చుకొని మామ్ పికెల్స్ అనేది పర్ఫెక్ట్ బిజినెస్ ఛాన్స్ అనుకున్నాను. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లలో మా బిజినెస్‌కు సంబంధించిన పేజీలను క్రియేట్ చేశాను. మంచి స్పందన వచ్చింది. జాడీలను కొని లేబుల్స్ ప్రింట్ చేయించాను. మధ్యప్రదేశ్ నుంచే కాదు దేశం నలుమూలల నుంచి ఆర్డర్లు రావడం మొదలైంది' అంటాడు అమిత్.

పదిహేను సంవత్సరాల వయసులో తొలిసారిగా పచ్చి మామిడి కాయ పచ్చడి తయారు చేసి ఇంటిల్లిపాది 'అద్భుతం' అనేలా చేసింది సరోజ్.

ఆనాటి 'అద్భుతం' ఇప్పటికీ అద్భుతాలు చేయిస్తూనే ఉంది. కేవలం మామిడికాయ ఊరగాయలతో మొదలైన వ్యాపారం అనతికాలంలోనే పచ్చిమిర్చి, నిమ్మకాయ, మిక్స్‌డ్ వెజిటబుల్... మొదలైన వాటిలోకి విస్తరించింది. అమ్మ చేతి నైపుణ్యానికి కుమారుడి డిజిటల్ మార్కెటింగ్ స్కిల్స్ తోడు కావడంతో త్వరలోనే వ్యాపారం మంచి ఊపందుకుంది.

బ్యూటిప్స్



- రోజూ పెదవులకు కాస్తంత మీగడ రాసి సున్నితంగా మర్దన చేస్తే పెదవులు పగలకుండా గులాబీ రేకుల్లా మెరుస్తాయి.
- ముఖాన్ని రోజుకు రెండు మూడుసార్లు గోరువెచ్చటి నీటితో కడుక్కుని పొడి టవల్‌తో చక్కగా తుడిచేస్తే మొటిమల వంటివి రావు.
- లేతకొబ్బరిని మెత్తగా మెదిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తుంటే ముఖం చక్కగా అందంగా కనబడుతుంది.
- రకరకాల షాంపూల బదులు కుంకుడు కాయ రసం లేదా సీకాయ పొడితో తలస్నానం చేయడం వల్ల చుండ్రు, కేశ సంబంధమైన సమస్యలు రాకుండా జుట్టు ఆరోగ్యంగా నిగనిగలాడుతుంది.
- తల స్నానం పూర్తయిన తర్వాత, చివరి మగ్గు నీటిలో కొంచెం నిమ్మరసం కలిపి తలమీద పోసుకుంటే జుట్టు, చర్మ సమస్యలు రావు.

వేగాన్ లెదర్ అంటే?

ఇలా చెప్పకుందాం!



సురేష్, మైథిలి



పుస్తకాల అట్టలు



ఎకో ఫ్రెండ్లీ పెన్ స్టాండ్



పోక చెట్టు బెరడుతో...


ఒక చదరపు మీటరు లెదర్ తయారయ్యే ప్రక్రియలో విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్ ఎంతో ఊహించగలరా? అక్షరాలా 17 కిలోలు. లెదర్ బ్యాగ్‌లు, షూస్, బెల్టులు, పర్సులు, వాచ్‌ల మీద మనకున్న మక్కువ తక్కువేమీ కాదు. కానీ పర్యావరణానికి ఇంత చేటు చేస్తుందని తెలిసిన తర్వాత వాటి వాడకాన్ని ప్రోత్సహించలేం, మమకారాన్ని చంపుకోలేం. అన్నింటికీ పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నాం కదా! దీనికి కూడా ఓ మార్గం కనిపించకపోతుందా! సరిగ్గా ఇలాగే ఆలోచించిన మైథిలి పోక చెట్టు బెరడుతో ఓ ప్రత్యామ్నాయాన్ని మన ముందుకు తెచ్చారు. అదే వేగాన్ లెదర్. వేగాన్ లెదర్‌ని ఎకో ఫ్రెండ్లీ సస్టెయినబుల్ ఆల్టర్నేటివ్‌గా పరిచయం చేస్తున్నారు మైథిలి.

తిరిగి ఇచ్చేద్దాం!

మైథిలిది కర్నాటకలోని శృంగేరి. ఆమె భర్త సురేశ్‌తో కలిసి 'భూమి ఆగ్రో వెంచర్స్' పేరుతో వేగాన్ లెదర్ తయారీ పరిశ్రమను స్థాపించారు. ఈ ప్రయత్నం కేవలం పర్యావరణహితం కోసం, మనుషులను పర్యావరణహిత జీవనశైలి దిశగా నడిపించడమేనన్నారామె. కంప్యూటర్స్‌తో మొదలుపెట్టిన కెరీర్ వేగాన్ లెదర్ పరిశ్రమ వైపు మలుపు తీసుకోవడాన్ని వివరించారామె. మాది వ్యవసాయ కుటుంబం. కర్నాటకలో లక్షలాది ఎకరాల్లో పోక చెట్లను పెంచుతారు. మేము చదువు పూర్తయిన తర్వాత శివమొగ్గలో కంప్యూటర్ సేల్స్, సర్వీసెస్ వ్యాపారం మొదలుపెట్టాం. పాతికేళ్లపాటు విజయవంతంగా నిర్వహించాం. ఇక మా వంతుగా సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన సమయం వచ్చిందనే అభిప్రాయానికి వచ్చాం. అలాంటి సమయంలో ఓ సారి మా సొంతూరికి వచ్చినప్పుడు పోకచెట్టు బెరళ్లను చూసినప్పుడు ఈ ఆలోచన వచ్చింది.

కప్పులే కాదు చెప్పులు కూడా!

పర్యావరణ ప్రేమికులు కొందరు పోకచెట్టు బెరడుతో ఫంక్షన్‌లలో భోజనం వడ్డించే ప్లేట్‌లు, పాయసం వడ్డించే కప్పుల వంటి వాటిని చేస్తున్నారు. పేపర్ ప్లేట్‌కు బదులు అరెక్కా (పోకచెట్టు) ప్లేట్ వాడడం వల్ల పేపర్ తయారీ సమయంలో జరిగే నీటికాలుష్యాన్ని నివారించిన వారమవుతాం. అయితే పోకచెట్టును ఇంకా విస్తృతంగా వినియోగంలోకి తీసుకు రాగలిగితే పర్యావరణానికి హానికారకంగా మారుతున్న అనేక పరిశ్రమలకు ఇది చక్కటి ప్రత్యామ్నాయం అవుతుందని ఆలోచించాం. అప్పుడు మాకు మొదటగా తోళ్ల పరిశ్రమ గుర్తువచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన త్జెర్డ్ వీన్‌హోవెన్ కూడా తోళ్లకు ప్రత్యామ్నాయం కోసం మొక్కలపై ప్రయోగాలు చేస్తున్నట్లు తెలిసింది. మా పోకచెట్టు బెరడు ఆలోచన వీన్‌హోవెన్‌కు కూడా నచ్చింది. ప్రయోగాలు చేయగా చేయగా మా ప్రయత్నం విజయవంతం అయింది. ఇది జంతువులకు ప్రాణహానిని నివారించే లెదర్ కాబట్టి వేగాన్ లెదర్, పామ్ లెదర్ అంటున్నాం. రసాయన రహిత, భూమిలో కలిసిపోయే మెటీరియల్ ఇది. తేలికగా ఉంటుంది కూడా. ఇప్పుడు పెద్ద ఎత్తున వేగాన్ లెదర్‌ను ఎగుమతి చేస్తున్నాం. వీటితో పెన్‌హోల్డర్‌లు, చెప్పులు, పుస్తకాల అట్టలు, వ్యానిటీ బ్యాగ్ తదితరాలు తయారవుతున్నాయి. స్వయం సహాయక బృందాల మహిళలు ఇందులో చక్కటి సేవందిస్తున్నారు. గత ఏడాది మే–జూన్ నెలల్లో జీ 20 సదస్సుల సందర్భంగా స్టాల్ నిర్వహించాం. యానిమల్ లెదర్ తయారీలో కార్బన్ డయాక్సైడ్‌తోపాటు నీటి కాలుష్యం కూడా ఎక్కువే. యానిమల్ లెదర్ కోసం పాతిక వేల లీటర్ల నీరు అవసరమయ్యే చోట పామ్ లెదర్ తయారీకి నీటి వాడకం ఆరు వందల లీటర్లకు మించదు. పైగా పామ్ లెదర్ తయారీలో వాడిన నీటిని తిరిగి పంటలకు వినియోగించుకోవచ్చు కూడా. మేము సమాజానికి తిరిగి ఇవ్వాలనే ప్రయత్నంతో చేసిన ఆలోచన నుంచి పర్యావరణానికి మా వంతుగా సేవలందించే అవకాశం వచ్చింది. సంతోషాన్ని వర్ణించడానికి మాటలు చాలవు'' అన్నారు మైథిలి.


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 332

గురువారం 22-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆసీస్‌ను గెలిపించిన డేవిడ్

ఆఖరి బంతికి ఫోర్ కొట్టిన ఆసీస్ బ్యాటర్. తొలి టి20లో న్యూజిలాండ్ ఓటమి -12లో



విదేశీ రోడ్లపై మన స్కూటర్లు రయ్

భారత్‌లో తయారైన స్కూటర్లు విదేశీ గడ్డపై పరుగులు తీస్తున్నాయి. -13లో



భక్తులతో నిండిపోయిన జంపన్న వాగు పరిసరాలు

వన దేవత వచ్చె.. జనం మురిసె

- మేడారం గద్దెపైకి సారలమ్మ.. పగిడిద్దరాజు, గోవిందరాజు సైతం
- ఎదురేగి భక్తుల దండాలు.. దారిపొడవునా భక్తి పారవశ్యం
- ఘనంగా మేడారం జాతర ప్రారంభం
- నేడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క ఆగమనం
- మేడారం జాతర సందర్భంగా ప్రధాని మోదీ శుభాకాంక్షలు

11 లో



బుధవారం అర్ధరాత్రి 12.12 గంటలకు గద్దెపైకి చేరిన సారలమ్మ



బాబుకు రెస్ట్!

35 ఏళ్లుగా పోటీ చేస్తున్నారు... రెస్ట్ అవసరమన్న భార్య

ఈసారి కుప్పంలో పోటీ చేయాలనుకుంటున్నానన్న భువనేశ్వరి

- ఈ మాటల వెనక కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం చంద్రబాబుదే
- 'సిద్ధం' సభలకు వెల్లువలా వస్తున్న జనాన్ని చూసి వెన్నులో వణుకు
- అధికారం అటుంచి... కుప్పంలో ఓడితే పార్టీయే ఉండదని బెంబేలు
- దీంతో కుదిరితే వేరేచోట నుంచి.. లేకుంటే నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా!
- కుప్పంలో పడిపోయిన 'నారా' వారి గ్రాఫ్..

- వివరాలు 10లో

యుద్ధం అయిపోలేదు

తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలిస్తేనే మనం గెలిచినట్టు: కోస్గి బహిరంగ సభలో సీఎం రేవంత్ వ్యాఖ్య

- అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పై బీఆర్ఎస్, బీజేపీల కుట్ర
- అయినా ప్రజలు అప్రమత్తతతో కాంగ్రెస్‌ను గెలిపించారు
- ఉమ్మడి రాష్ట్రం నాటికంటే కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు ఎక్కువ నష్టం
- వారంలోగా రూ.500కు సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్..
- త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ
- కొడంగల్ సెగ్మెంట్ పరిధిలో రూ.4,369.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభాలు



కోస్గి సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్: ''రాష్ట్ర నలుమూలలా ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నా. ఇంకా మన యుద్ధం అయిపోలేదు. ఇది విరామం మాత్రమే. కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని కార్యకర్తలు విశ్రాంతి తీసుకుందామనుకోవద్దు. 17 ఎంపీ సీట్లలో 14 సీట్లు గెలిచినప్పుడే పార్లమెంట్‌లో పట్టు సాధిస్తాం. అప్పుడే రాష్ట్రంలో కాంగ్రెస్ యుద్ధం గెలిచినట్లు. అప్పుడే తెలంగాణ కాంగ్రెస్‌కు గొప్పదనం. కొడంగల్‌కు గౌరవం దక్కుతాయి..''అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కొడంగల్ నియోజకవర్గ పరిధిలో రూ.4,369.14 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు కోస్గి పట్టణం వేదికగా శంకుస్థాపనలు,

మిగతా 3వ పేజీలో ▶

ఆ రెండింటి డీఎన్ఏ ఒక్కటే

- మా పార్టీపై కావాలనే బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల దుష్ప్రచారం
- ఆరు గ్యారంటీలు ఆరు గారెలయ్యాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నారాయణపేట: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని, అందుకు కుటుంబ రాజకీయాలే నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నారాయణపేటలో విలేకరులతో మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కుమ్మక్కై బీజేపీపై దుష్ప్రచారం చేశాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ సోషల్ మీడియాలో అదే ప్రచారం సాగిస్తున్నాయని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు బీజేపీవైపే ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి ఓట్ల శాతం పెరగటంతో పాటు 8 స్థానాల్లో తమ అభ్యర్థులు విజయం సాధించారని అన్నారు. ఈ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం లేకపోతే.. కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు తప్పుచేశారంటూ కేసీఆర్ కుటుంబం ఇంకా అహంకారపు మాటలు మాట్లాడుతోందని విమర్శించారు. మజ్లిస్ సహకారంతో హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందగా.. గ్రామీణ ప్రాంతాల్లో

మిగతా 3వ పేజీలో ▶

ముమ్మాటికీ ఆర్థిక నేరస్తుడే

- 'మార్గదర్శి' పేరిట రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం
- ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ
- అవి అక్రమ డిపాజిట్లేనని సుప్రీంకోర్టులో ఆర్‌బీఐ వెల్లడి
- 2006 నాటికే రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు
- రామోజీ అక్రమాలకు చెక్ పెట్టిన నాటి వైఎస్సార్ ప్రభుత్వం
- నగదు రూపంలో డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమన్న ఐటీ శాఖ
- ఆర్‌బీఐ స్టేట్‌మెంట్ నేపథ్యంలో రామోజీకి శిక్షపై సర్వత్రా చర్చ

- వివరాలు 10లో

దద్దరిల్లిన సరిహద్దులు..



- చర్చలు విఫలం.. మళ్లీ రోడ్డెక్కిన రైతులు
- శంభు, ఖనౌరీ బోర్డర్ పాయింట్ల వద్ద ఉద్రిక్తత.. ట్రాక్టర్ ట్రాలీలు, జేసీబీలతో భారీగా తరలివచ్చిన రైతులు
- బాష్పవాయు గోళాలు ప్రయోగించిన పోలీసులు

6 లో

ఎమ్మెల్సీ కవితకు సీబీఐ నోటీసులు



- ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సీబీఐ నోటీసులు జారీ చేసింది. 26న ఢిల్లీకి రావాలని సూచించింది. - 2లో

సింగరేణిలో 485 పోస్టుల భర్తీ



- సింగరేణిలో ప్రత్యక్ష నియామక పద్ధతిలో 317 పోస్టులు, అంతర్గత నియామకాల ద్వారా 168 పోస్టుల భర్తీకి ప్రకటనలు జారీచేయాలని డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు.

- వివరాలు 2లో

న్యాయ కోవిదుడు నారీమన్ కన్నుమూత



- న్యాయ నిపుణుడుగా పేరుగాంచిన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలీ శామ్ నారీమన్ (95) మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు.

- వివరాలు 6లో

క్లుప్తంగా...

మేడారం జాతర నిధుల విడుదలకు కేంద్రం ఆమోదం

సాక్షి, హైదరాబాద్: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ 'సమ్మక్క– సారలమ్మ'జాతర నిర్వహణకోసం రూ.3.14 కోట్ల నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ నుంచి రూ.2.30 కోట్లు, పర్యాటక శాఖ నుంచి రూ. 0.84 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. మేడారం జాతర నిర్వహణకు, భక్తుల రాకపోకలకు వీలుగా ప్రత్యేక రైళ్ల ఏర్పాటుకోసం కేంద్రం అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. కాగా, కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మేడారం చుట్టుపక్కల ఉన్న ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత వాటర్‌ఫాల్స్ వంటి ప్రాంతాలలో పర్యాటకాన్ని ప్రోత్సహించడం కోసం 'గిరిజన సర్క్యూట్'పేరిట రూ.80 కోట్లతో ఆయా ప్రాంతాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.

తెలంగాణ బిడ్డలకు వారే స్ఫూర్తి ప్రదాతలు

సమ్మక్క, సారక్కలు ప్రజల గుండెల్లో సదా జీవించే ఉంటారు: కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: మేడారం జాతరను పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకుంటూ, గుండెల నిండా భక్తితో అమ్మవార్లను దర్శించుకొని, క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని ఆమె ప్రజలను కోరారు. ఈ జాతర ఆదివాసీ ఆత్మగౌరవానికి, తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. నియంతృత్వానికి వ్యతిరేకంగా సమ్మక్క, సారక్కలు వీరోచిత పోరాటంతో తెలంగాణ ప్రజల గుండెల్లో సదా జీవించే ఉంటారని, ఆత్మగౌరవమే ఆభరణంగా బతుకుతున్న తెలంగాణ బిడ్డలకు ఆ వనదేవతలే స్ఫూర్తి ప్రదాతలు అని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మక్క, సారక్కల స్ఫూర్తితో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ సంకల్ప బలంతో పోరాటం చేసి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడారం జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రి చెప్పారు.

24న 'ధరణి' కమిటీ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈనెల 24న జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. జిల్లాల వారీగా అపరిష్కృతంగా ఉన్న ఫిర్యాదులు, అందుకు కారణాలు, పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, నిషేధిత జాబితాలోని ఆస్తులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, తాత్కాలిక ల్యాండ్ ట్రిబ్యునల్స్ ద్వారా పరిష్కరించిన కేసులు–అనుభవాలు, సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి, ఆర్‌ఎస్‌ఆర్, సెత్వార్ రికార్డుల్లో పొంతన లేని ఎంట్రీలు, భూరిజిస్ట్రేషన్లలో సమస్యలు, ఇనామ్, జాగీర్, కాందిశీకుల ఆస్తులకు సంబంధించిన సమస్యలు, షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని భూసమస్యలు, రెవెన్యూ–అటవీ శాఖల మధ్య వివాదాలు, వక్ఫ్, దేవాదాయ భూములు, సుపరిపాలన కోసం రెవెన్యూ వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

శ్రీరాముడు అందరి దేవుడు: మధుయాష్కీగౌడ్



సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో బాలరాముడి విగ్రహాన్ని బుధవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముడు అందరి దేవుడు అని, రాముడు ఏ కొంతమందికి పరిమితం కాదని పేర్కొన్నారు. బాలరాముడిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.



సీట్ల కోసం ఇంకేం తినాల్సివస్తదోనని భయంగా ఉంది సార్!!

సాగని లిథియం అన్వేషణ

- లాటిన్ అమెరికా దేశాలతో గతంలో కేంద్రం ఒప్పందం
- సంయుక్త భాగస్వామ్యానికి ఆసక్తి చూపిన రాష్ట్ర సర్కార్
- టీఎస్‌ఎండీసీ ఆధ్వర్యంలో అంబ్రెల్లా కార్పొరేషన్ ఏర్పాటు
- రెండేళ్లవుతున్నా కానరాని పురోగతి
- ఈవీ, ఎనర్జీ రంగాల అభివృద్ధికి లిథియం అత్యంత కీలకం

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్ రంగాల్లో అత్యంత కీలకమైన 'లిథియం'అన్వేషణ, దిగుమతి తదితరాల కోసం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ టీఎస్‌ఎండీసీ చేస్తున్న ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. స్థానికంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో సంయుక్త భాగస్వామ్యాలు కుదుర్చుకుని కార్యాచరణ ప్రారంభించేలా టీఎస్‌ఎండీసీని 'అంబ్రెల్లా కార్పొరేషన్'గా రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసి రెండేళ్లు కావస్తున్నా పురోగతి కనిపించడం లేదు. 2030 నాటికి ఈవీ, ఈఎస్‌ఎస్ రంగాల ద్వారా రూ.33 వేల కోట్ల పెట్టుబడులను రాబట్టడంతో పాటు 1.20 లక్షల ఉద్యోగాల కల్పనను రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2030 నాటికి దేశంలో 150 గిగావాట్ల లిథియం బ్యాటరీల తయారీని లక్ష్యంగా ఎంచుకోగా, ఇందులో 30 గిగావాట్ల ఉత్పత్తి తెలంగాణ నుంచే కావడం గమనార్హం. కాగా ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో లిథియం (బ్యాటరీలు, గ్లాస్, అల్యూమినియం ఉత్పత్తుల తయారీకి వినియోగించే విలువైన ఖనిజం) అత్యంత కీలకమైనదిగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. బహిరంగ మార్కెట్‌లో కిలో లిథియం ధర రూ.40 లక్షలకు పైనే ఉన్నట్లు అంచనా. అయితే భారత్ అవసరాలకు అనుగుణంగా దేశీయంగా లిథియం లభ్యత లేకపోవడంతో నిల్వలు ఎక్కువగా ఉన్న ఆస్ట్రేలియాతో పాటు లాటిన్ అమెరికా దేశాల నుంచి దీనిని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అత్యధికంగా ఆస్ట్రేలియాతో పాటు లాటిన్ అమెరికా దేశాలైన బొలీవియా, చిలీ, అర్జెంటీనా దేశాల్లో లిథియం నిల్వలు విరివిగా ఉన్నాయి. ప్రపంచంలోని లిథియం నిల్వల్లో 56 శాతం బొలీవియా, చిలీ, అర్జెంటీనా దేశాల్లోనే ఉన్నాయి. జమ్మూకశ్మీర్‌లో 5.9 మిలియన్ టన్నుల లిథియం నిల్వలు ఉన్నట్లు గత ఏడాది జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించినా వెలికితీత ఇప్పట్లో సాధ్యమయ్యే అవకాశం లేదు.



ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్

ప్రపంచ వ్యాప్తంగా లిథియం నిక్షేపాలకు అత్యంత డిమాండ్ నెలకొంది. ఎలక్ట్రిక్ వాహనాలు, వైద్య ఉపకరణాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో ఇటీవలి కాలంలో లిథియం అయాన్ బ్యాటరీలే కీలకంగా ఉన్నాయి. సంప్రదాయ బ్యాటరీలతో పోలిస్తే లిథియం అయాన్ బ్యాటరీలు అధిక సాంద్రత, ఎక్కువ కాలం మన్నే, వేగంగా చార్జింగ్ అయ్యే గుణం కలిగి ఉండటంతో పాటు తేలికగా ఉంటాయి. కాగా ప్రపంచ వ్యాప్తంగా హరిత టెక్నాలజీలకు డిమాండ్ పెరుగుతుండటంతో లిథియంకు డిమాండ్ పెరుగుతోంది.

రంగంలోకి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ

భారతదేశం వెలుపల ఉన్న లిథియం తరహా వ్యూహాత్మక ఖనిజాలను గుర్తించడం, అన్వేషించడం, వెలికితీయడం, శుద్ధీకరణ, దిగుమతి చేసుకోవడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2019లో మూడు ప్రభుత్వ రంగ సంస్థలు.. నాల్కో, హెచ్‌సీఎల్, మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కబిల్)ను ఏర్పాటు చేసింది. లిథియం నిల్వలకు సంబంధించి 2019లోనే బొలీవియా ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఇదే క్రమంలో కబిల్‌తో పాటు ఖనిజాన్వేషణ, వెలికితీత తదితర రంగాల్లో అనుభవం కలిగిన ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం ద్వారా రాష్ట్ర అవసరాలకు అవసరమైన లిథియంను పొందే ప్రయత్నాలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2022 మేలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ టీఎస్‌ఎండీసీని 'అంబ్రెల్లా కార్పొరేషన్'గా రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. తద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో లాటిన్ అమెరికా దేశాల్లో లిథియం వెలికితీత, శుద్ధీకరణతో రాష్ట్ర అవసరాలను తీర్చుకోవడంతో పాటు వాణిజ్యపరంగా భారీగా లబ్ధి పొందే వీలుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఇలా రెండేళ్ల క్రితం మొదలైన ఈ ప్రయత్నం ముందుకు సాగడం లేదు. ఈవీ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న దృష్ట్యా లిథియం కోసం సాగిస్తున్న ప్రయత్నాలు ముమ్మరం చేయాలనే డిమాండ్ ఈవీ రంగం నుంచి వినిపిస్తోంది.

డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా

కరెంట్ కోతలంటూ తప్పుడు ప్రచారంచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయండి

- ఓవర్ లోడ్, మెయింటెనెన్స్ కోసమే అక్కడక్కడ అంతరాయాలు
- ట్రాన్స్‌కో ఎస్‌ఈలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినా నిరంతర సరఫరాను కొనసాగించే సామర్థ్యం ప్రభుత్వానికి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. విద్యుత్ కోతలంటూ సోషల్ మీడియాలో ఎవరైనా కావాలని తప్పుడు ప్రచారం చేస్తే వారిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యుత్ విషయంలో గత పాలకులు చేసింది తక్కువ, ప్రచారం చేసుకున్నది ఎక్కువని విమర్శించారు. వచ్చే వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాపై బుధవారం ఆయన సచివాలయం నుంచి క్షేత్రస్థాయిలోని ట్రాన్స్‌కో సూపరింటెండింగ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల తమ ప్రాంతంలో కరెంట్ కోతలు విధిస్తున్నారని కొందరు 'ఎక్స్'లో పోస్టులు పెట్టగా, తాము పరిశీలిస్తే తప్పుడు ప్రచారమని తేలిందని ఈ సమావేశంలో అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాంటి వారిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించారు. పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేసే సామర్థ్యం ఉన్నప్పటికీ..మెయింటెనెన్స్, ఓవర్ లోడ్ వంటి సమస్యలతో కొన్ని చోట్ల సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయని తన దృష్టికి వచ్చిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిని సత్వరంగా పరిష్కరిస్తే ఫిర్యాదులు ఉండవన్నారు. వాణిజ్య ప్రాంతాల్లో మెయింటెనెన్స్ కోసం రాత్రివేళలో లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) తీసుకోవాలని సూచించారు. మెయింటెనెన్స్ కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్పిస్తే ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులకు ముందే తెలియజేయాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో స్థానిక విద్యుత్ అధికారులు మాట్లాడి డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సర ఫరా చేసే సామర్థ్యం ఉన్న విషయాన్ని వివరించాలని తెలిపారు. వేసవిలో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేసేందుకు గత 4 నెలలుగా విద్యుత్ శాఖ ఏర్పాట్లు చేస్తోందన్నారు.

24 గంటలు అందుబాటులో ఉంటాం..

జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ ఎటువంటి ఇబ్బందులున్నా సంస్థ సీఎండీ ఎస్‌ఏఎం రిజ్వీకి, ఆ తర్వాత తనకు తెలియజేయాలని భట్టివిక్రమార్క సూచించారు. తాము 24 గంటలు అందుబాటులో ఉంటామన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించే కాల్ సెంటర్‌ను బలోపేతం చేయాలని, ప్రతి కాల్‌ను రికార్డు చేయాలని కోరారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల ఇన్‌చార్జి సీఎండీ ఎస్‌ఏఎం రిజ్వీ, డిస్కంల సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, కె.వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ పాలకవర్గం రద్దుకు రంగం సిద్ధం

వ్యవసాయ శాఖకు సీఎం కార్యాలయం నుంచి సంకేతాలు

సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్ పాలకవర్గం రద్దుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. అందుకు సంబంధించి రంగం సిద్ధం చేసినట్లు వ్యవసాయశాఖ వర్గాలు చెప్పాయి. పాలకవర్గం రద్దు చేస్తే చైర్మన్ సహా ఇతర డైరెక్టర్లను తొలగిస్తారు. పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లవుతున్నా ఇప్పటివరకు ఒక్కసారి కూడా జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించకపోవడాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం సీరియస్‌గా తీసుకుంది. దీంతో పాలకవర్గం రద్దు దిశగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు సీఎం కార్యాలయం నుంచి తమకు సంకేతాలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. జనరల్‌బాడీ సమావేశం అనుమతి లేకుండానే మార్క్‌ఫెడ్ బోర్డులో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారని, తద్వారా అక్రమాలకు తెరలేపారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్ట్ పేరుతో ఒక స్థానిక ప్రైవేట్ కంపెనీకి టెండర్లు లేకుండానే అనుమతి ఇవ్వడం వివాదాస్పదమైంది.

నిలువెల్లా నిర్లక్ష్యం: మార్క్‌ఫెడ్ పాలకమండలిని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) సభ్యులు ఎన్నుకుంటారు. రాష్ట్రంలో ఉన్న ప్యాక్స్ చైర్మన్లు ఏడుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. వీరిలో ఇద్దరిని చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నుకుంటారు. 2020 మార్చి 11న చివరిసారి పాలకవర్గం కొలువుదీరింది. పాలకవర్గ జనరల్‌బాడీ దాదాపు 550 మంది ప్యాక్స్ చైర్మన్లతో ఉంటుంది. నిబంధనల ప్రకారం ఏడాదిలో రెండుసార్లు జనరల్‌బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో నిబంధనల ప్రకారం ఏడాది పూర్తయిన మరునాడే ఆ పాలకవర్గం రద్దు కావాలి. కానీ అలా జరగలేదు. జనరల్‌బాడీ సమావేశం నిర్వహించపోవడంపై మార్క్‌ఫెడ్ చైర్మన్ సహా ఇతర కీలకమైన అధికారులను బాధ్యులను చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒకవేళ మార్క్‌ఫెడ్ పాలకవర్గాన్ని రద్దు చేస్తే ప్రభుత్వం కొత్త చైర్మన్‌ను నియమించే అవకాశముంది. ఇదిలావుండగా, ప్రస్తుత చైర్మన్ మార గంగారెడ్డి బీఆర్‌ఎస్ నాయకుడు అయినందున.. ఆయనపై కొందరు సభ్యుల్లో అసంతృప్తి నెలకొందని అంటున్నారు.

ప్రపంచస్థాయి ప్రమాణాలతో పారిశ్రామిక పార్కు

మంత్రి శ్రీధర్‌బాబుతో జపనీస్ ప్రతినిధుల బృందం భేటీ

సాక్షి, హైదరాబాద్: ప్రపంచస్థాయి దిగ్గజ తయారీ సంస్థల నుంచి తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించేందుకు జపాన్‌కు చెందిన వివిధ రంగాల సంస్థలతో కూడిన మరుబెని కార్పొరేషన్ ప్రతినిధుల బృందం బుధవారం పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఈ పారిశ్రామిక పార్కులో ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక వసతులు కల్పిస్తామని మ రుబెని కార్పొరేషన్ ప్రతినిధులు మంత్రికి వెల్లడించారు. తెలంగాణలో పారిశ్రామిక, ఎంఎస్‌ఎంఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనుసరించే వాణిజ్య అనుకూల విధానాలను జపనీస్ బృందానికి మంత్రి వివరించారు.



మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయిన మరుబెని కార్పొరేషన్ ప్రతినిధుల బృందం

ఆర్ఆర్ఆర్ కోసం రూ.5 వేల కోట్ల రుణం

- నిధుల సమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వ కసరత్తు
- ఉత్తర భాగం భూసేకరణ వ్యయంలో రాష్ట్రవాటా రూ.2,600 కోట్లు
- దక్షిణ భాగానికీ సుమారు ఇంతే మొత్తం అవసరమనే అంచనా
- బడ్జెట్‌లో ఆర్ఆర్ఆర్ కోసం కేటాయించినది రూ.1,525 కోట్లే..

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూసేకరణ వ్యయంలో రాష్ట్ర వాటాను చెల్లించేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం రుణం సేకరించాలని భావిస్తోంది. తద్వారా పనులు వేగంగా సాగేలా చూడాలని నిర్ణయించింది. నిజానికి ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంట్, భూసేకరణ సర్వే ఇప్పటికే పూర్తయ్యాయి. కానీ నిర్మాణానికి టెండర్లు పిలవాల్సిన తరుణంలో పనులు పెండింగ్‌లో పడ్డాయి. తాజాగా కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది. రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రెండు, మూడు సార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయి చర్చించారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఉప ముఖ్యమంత్రి భట్టి, కోమటిరెడ్డిలతో కలసి వెళ్లి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు.

భూసేకరణ వ్యయంలో వాటాగా..

ప్రస్తుతం ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియలో అవార్డులు పాస్ చేయాల్సి ఉంది. భూసేకరణ పరిహారం చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు ఇవ్వాల్సి ఉంది. మరోవైపు ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అలైన్‌మెంట్ సిద్ధంకాగా.. భూసేకరణ సర్వే చేపట్టాల్సి ఉంది. అక్కడ కూడా రాష్ట్రవాటా చెల్లించాలి. మొత్తంగా రెండు భాగాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.5 వేల కోట్లను వాటాగా భరించాల్సి ఉండనుంది. కానీ కాంగ్రెస్ సర్కారు ఇటీవల అసెంబ్లీలో పెట్టిన బడ్జెట్‌లో దీనికి రూ.1,525 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులు కూడా సొంత ఆదాయం నుంచి సమకూర్చే పరిస్థితి లేదని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే రూ.5 వేలకోట్ల రుణం తీసుకునేందుకు కసరత్తు జరుగుతోందని అంటున్నాయి.

ఆదాయం పెరుగుతుందని చూపటం ద్వారా..

ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మించినప్పుడు భూముల ధరలు బాగా పెరిగాయి. రిజిస్ట్రేషన్ ఫీజులూ పెరిగి సర్కారుకు గణనీయంగా ఆదాయం సమకూరింది. తర్వాత టోల్ చార్జీల రూపంలో మరికొంత ఆదాయం అందింది. ఇప్పుడు ఆర్ఆర్ఆర్ విషయంలోనూ భూముల ధరలు పెరిగి రిజిస్ట్రేషన్ల ఆదాయం సమకూరుతుందని, ప్రభుత్వ భూముల ధరలు, లీజుల మొత్తం పెరుగుతుందని అధికారులు చెప్తున్నారు. ఈ ఆదాయాన్ని చూపి రుణాన్ని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరిస్తున్నారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ.2,600 కోట్లు చెల్లించాల్సి ఉంది. దక్షిణ భాగానికి సంబంధించి ఆరు నెలల్లో భూపరిహారం చెల్లింపు ప్రక్రియ మొదలవుతుందని అంచనా. దీనితో రెండింటికీ సరిపడేలా ఒకేసారి రూ.5 వేల కోట్ల రుణాన్ని సమకూర్చుకుని సిద్ధంగా ఉంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

కేంద్రంలో కొత్త సర్కారు వచ్చాక.. హైవే నంబర్..

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని కేంద్ర ప్రభుత్వం భారత్‌మాల పరియోజన పథకం మొదటి జాబితాలో చేర్చింది. దక్షిణ భాగాన్ని రెండో జాబితాలో చేరుస్తారని భావించినా కుదరలేదు. ఇప్పటికే చాలా ప్రాజెక్టులు ఉండటంతో రెండో జాబితాను ఫైనల్ చేసేసింది. పార్లమెంటు ఎన్నికలు పూర్తయి కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాకే.. దక్షిణ భాగానికి నేషనల్ హైవే నంబర్ కేటాయింపు, ఇతర అంశాలపై స్పష్టత రానుంది.

సమ్మక్క–సారక్కలను స్మరించుకున్న మోదీ

మేడారం జాతర సందర్భంగా ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు



సాక్షి, న్యూఢిల్లీ: ఆదివాసుల అతి పెద్ద పండుగలలో ఒకటైన మేడారం సమ్మక్క–సారక్క జాతర ఆరంభమైన సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏకత్వ భావన, పరాక్రమ భావన మూర్తీభవించిన సమ్మక్క, సారక్కలను ప్రధాని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎక్స్ మాధ్యమంలో ఆయన సందేశాన్ని అందించారు. 'గిరిజనులు జరుపుకొనే అతి పెద్ద పండుగలలో ఒకటైన, మన సాంస్కృతిక వారసత్వానికి చిరకాలం స్ఫూర్తిగా నిలిచేటటువంటి, చైతన్య శక్తికి అద్దంపట్టేటి సమ్మక్క–సారక్క జాతర ప్రారంభమైన సందర్భంగా ఇవే శుభాకాంక్షలు. ఈ జాతర భక్తి, సంప్రదాయం, సముదాయిక భావనల మహా సమ్మేళనం అని చెప్పాలి. సమ్మక్క– సారక్కలకు ప్రణామాలు. ఏకత్వానికి, పరాక్రమానికి ప్రతీకలుగా నిలిచినటువంటి వన దేవతలను మనం ఈ సందర్భంలో మరోమారు గుర్తు తెచ్చుకొందాం'అని ప్రధాని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు సీబీఐ నోటీసులు

లిక్కర్ స్కాం కేసులో విచారణ కోసం 26న ఢిల్లీకి రావాలని పిలుపు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సీబీఐ నోటీసులు జారీ చేసింది. విచారణ నిమిత్తం ఈ నెల 26న ఢిల్లీలోని కార్యాలయానికి రావాలని సూచించింది. ఈ మేరకు బుధవారం రాత్రి సీబీఐ నుంచి కవిత సమన్లు అందుకున్నారు. సీబీఐ గతంలో ఇదే కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వచ్చి స్టేట్‌మెంట్ తీసుకున్న విషయం తెలిసిందే. మరోవైపు ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా పలుమార్లు కవితను ప్రశ్నించింది. చివరగా గత ఏడాది జనవరి 16న విచారణకు రావాల్సిందిగా కవితకు ఈడీ నోటీసులు జారీచేసింది. అయితే ఈడీ విచారణకు సంబంధించి సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున విచారణకు హాజరుకాలేనంటూ ఆమె లేఖ రాశారు. ఆ తర్వాత ఈడీ నుంచి కవితకు ఏ విధమైన సమాధానం రాలేదు. సుప్రీంలో పిటిషన్‌పై ఈ నెల 28న విచారణ జరగనుంది. ఇలాంటి సమయంలో కవితకు సీబీఐ సమన్లు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

30 లక్షల మందికి రెండు రాష్ట్రాల్లో ఓట్లు



వివిధ రాజకీయ పార్టీ నేతలతో భేటీ అయిన సీఈఓ వికాస్‌రాజ్ తదితరులు

- అలాంటి వారి ఓట్లను తొలగించాలన్న కాంగ్రెస్, బీజేపీ
- లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లపై రాజకీయ పార్టీలతో సీఈఓ భేటీ

సాక్షి, హైదరాబాద్: కొందరికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఓట్లు ఉన్నాయని, అలాంటి వారి ఓట్లు తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్, బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు చోట్లా కలిపి 30 లక్షల ఓట్లు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక రాష్ట్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న వారికి మరో రాష్ట్రంలో ఓటేసేందుకు అవకాశం కల్పించరాదని సూచించారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ బుధవారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితాలోని డూప్లికేట్ ఓట్లను తొలగించాలని కోరారు. అభ్యర్థుల నేరచరిత్రపై మీడియాలో ప్రకటనల జారీకి చేస్తున్న ఖర్చుతో ఎన్నికల వ్యయ పరిమితి మించిపోతోందని, ఈ విషయంలో నిబంధనలు సడలించాలని ఆయన సూచించగా, కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేయాలని సీఈఓ కార్యాలయ అధికారులు బదులిచ్చారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఓటర్ల జాబితాలో పెద్ద సంఖ్యలో బోగస్, డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, చాలా ఓట్లకు ఫొటోలు లేవని బీజేపీ ఎన్నికల సంఘం వ్యవహారాల కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి, కన్వీనర్ ఆంథోనిరెడ్డిలు ఆరోపించారు. నగరంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య తగ్గించాలని సూచించారు. బోగస్ ఓట్ల జాబితాను గతంలో అందజేసినా, రిటర్నింగ్ అధికారులు తొలగించలేదన్నారు. ఒకే ఇంటి నంబరుతో భారీగా ఓట్లు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో భారీగా బోగస్ ఓట్లు చేర్చారని, దానిపై సమావేశం నిర్వహించాలన్నారు. 18 లక్షలకు పైగా డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోనే 2.7లక్షల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు జిల్లాలో ఒకేసారి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. అబ్సెంటీ, షిఫ్టెడ్, డెడ్ ఓటర్ల జాబితా అందజేయాలని ఎంఐఎం నేతలు కోరగా, తమకు ఆ అధికారం లేదని సీఈఓ వికాస్‌రాజ్ బదులిచ్చారు. జాబితా కోసం ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని సూచించారు.

485 పోస్టులు భర్తీ చేస్తాం

- సింగరేణి సమీక్షలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- నేడు నోటిఫికేషన్ జారీ చేస్తామన్న ఇన్‌చార్జ్ సీఎండీ




సాక్షి, హైదరాబాద్/సింగరేణి/గోదావరిఖని: సింగరేణిలో ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో 317 పోస్టులు, అంతర్గత నియామకాల ద్వారా 168 పోస్టుల భర్తీకి ప్రకటనలు జారీ చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. గురువారం ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని, సంస్థ ఇన్‌చార్జ్ సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడించారు. సింగరేణి సంస్థపై బుధవారం భట్టి విక్రమార్క రాష్ట్ర సచివాలయంలో సమీక్షించారు. సంస్థలో డిపెండెంట్ ఉద్యోగ నియామకాలు వేగిరం చేయాలని, కనీసం వెయ్యి మంది ఉద్యోగుల వారసులకు ఈ ఏడాది ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సింగరేణి ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని, అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల సింగరేణి ఉద్యోగమేళాలో ఇచ్చిన హామీ మేరకు డిపెండెంట్ ఉద్యోగాల గరిష్ట వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీమియం లేకుండానే రూ.కోటి ప్రమాద బీమాను 43 వేల మంది సింగరేణి కార్మికులకు వర్తింపజేసేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో అవగాహన ఒప్పంద పురోగతిపై ఆరా తీశారు. కొత్తగూడెంలో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను ఈ నెల 26న ప్రారంభిస్తామన్నారు. సింగరేణి ఉద్యోగులు, అధికారుల సౌకర్యార్థం హైదరాబాద్‌లో నిర్మించతలపెట్టిన అతిథి గృహం భూమిపూజ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గోదావరిఖని, మంచిర్యాలలో సురక్షిత నీటిసరఫరాకు నిర్మించిన ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్లను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాలపై రోజువారీ సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.

గేమ్ చేంజర్‌గా హైదరాబాద్

ఆర్ఆర్ఆర్ నిర్మించి నగర రూపురేఖలు మారుస్తాం

- రాష్ట్ర రహదారులను హైవేలుగా మార్చాలని కోరాం
- బైపాస్ నిర్మాణంతో నల్లగొండ అద్భుత అభివృద్ధి
- రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)ను నిర్మించి హైదరాబాద్‌ను సూపర్ గేమ్ చేంజర్‌గా మారుస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌కు గేమ్ చేంజర్‌గా ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)ను తీసుకొచ్చారని.. దాంతోనే హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ, ఫార్మా ఇండస్ట్రీలు అభివృద్ధి చెందాయని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు ఆర్ఆర్ఆర్‌తో మరింత ప్రగతి సాధిస్తామని చెప్పారు. బుధవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి ఇటీవల తన ఢిల్లీ పర్యటన వివరాలను వెల్లడించారు. నల్లగొండ బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.700 కోట్ల రూపాయలు మంజూరు చేసిన కేంద్ర రోడ్డు రవాణా, రహదారులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బైపాస్ నిర్మాణంతో నల్లగొండ పట్టణం అద్భుతంగా అభివృద్ధి సాధిస్తుందని, ఇక నల్లగొండ ప్రజలకు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

జాతీయ రహదారులుగా మార్చాలని కోరాం

16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలనే వినతిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని కోమటిరెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రగతిని మార్చే ఈ 16 జాతీయ రహదారుల గురించి దాదాపు గంటన్నరపాటు చర్చించి రాష్ట్ర అవసరాలను వివరించామన్నారు. దీనిపై గడ్కరీ స్పందించి తక్షణం అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇవే కాకుండా సీఆర్‌ఐఎఫ్ కింద మరో రూ.855 కోట్లు మంజూరయ్యేలా ప్రయత్నిస్తున్నామని కోమటిరెడ్డి తెలిపారు. రూ.లక్షల కోట్ల బడ్జెట్ ఉన్నప్పటికీ గత కేసీఆర్ ప్రభుత్వం కేంద్రంతో పేచీలు పెట్టుకొని జాతీయ రహదారులు రాకుండా చేసిందని ఆరోపించారు.

కిషన్‌రెడ్డి ఒక్క రూపాయి తేలేదు

రాష్ట్ర అభివృద్ధికి ఒక్క రూపాయి తీసుకురాని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఎలా విమర్శలు చేస్తారని మంత్రి నిలదీశారు. భువనగిరి గుట్టకు రూ 200 కోట్లు కేటాయించకోలేని కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాకులుచెవాకులు పేలడం ఏమిటని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందన్న కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై కోమటిరెడ్డి ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీని టచ్ చేస్తే బీజేపీని రాష్ట్రంలో నామరూపాలు లేకుండా చేస్తామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వాన్ని ఒక కేంద్రమంత్రి స్థాయిలో ఉండి కూలగొడతామని మాట్లాడటం దారుణమన్నారు. బయట కుస్తీ పడుతూ..లోపల భేటీలు పెట్టుకొనే బీఆర్‌ఎస్–బీజేపీ బంధం కేసీఆర్ ఢిల్లీ పర్యటనతో బట్టబయలవుతుందని వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

రాజ్యసభ ఎంపీగా రేణుకా చౌదరి

రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం కోటాలో కాంగ్రెస్ తరపున రాజ్యసభకు మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ ఆవరణలో రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా బుధవారం ఆమె ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. రాష్ట్రం నుంచి ముగ్గురు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిలో అనిల్‌కుమార్ యాదవ్ (కాంగ్రెస్), వద్దిరాజు రవిచంద్ర (బీఆర్ఎస్) మంగళవారమే రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. అయితే రేణుకాచౌదరి మాత్రం వ్యక్తిగత కారణాలతో బుధవారం ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎంపీ అనిల్ యాదవ్



ముషీరాబాద్ (హైదరాబాద్): తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. తెలంగాణ నుంచి పార్లమెంటు (రాజ్యసభ) సభ్యుడిగా ఎన్నికై ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం ఆయన కుటుంబ సమేతంగా కలిశారు. చిన్న వయసులో పెద్దల సభకు వెళ్లే అవకాశం కల్పించినందుకు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరడమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని హామీఇచ్చారు.

నేటి నుంచి సీపీఎం విస్తృత స్థాయి సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: రెండు రోజుల పాటు జరిగే సీపీఎం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాలు నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు జెండా ఆవిష్కరణతో ప్రారంభసభ మొదలవుతుంది. ఈ సమావేశాలలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఇతర రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని ఆ పార్టీ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. గత అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ అనుసరించిన వ్యూహం, ఎన్నికల్లో ఓటమి, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన కార్యచరణ ప్రణాళికపై ఈ సమావేశాల్లో కీలకంగా చర్చించనున్నారు. కాగా ఇటీవల అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న తమ్మినేని వీరభద్రం ఈ సమావేశాలకు హాజరవుతున్నప్పటికీ ఆయన స్థానంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య ఆధ్వర్యంలోనే ఈ సమావేశాలు నిర్వహించనున్నారు.

బీజేపీ-బీఆర్ఎస్ కలసి పోటీ అంటే క్రిమినల్ కేసులు

బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ, బీఆర్ఎస్ కలసి పోటీ చేస్తాయని కాంగ్రెస్ నేతలు మితి మీరి మాట్లాడుతున్నారని, ఈ తప్పుడు ప్రచారం మానుకోకపోతే వారు క్రిమినల్ చర్యలు ఎదుర్కోక తప్పదని బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే గత బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేవలం కొత్త అప్పుల ద్వారానే నిధులు సమకూర్చుకోవాలని భావిస్తోందని అన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పడమే కాకుండా.. ఖజానా ఖాళీ అయినందున ప్రభుత్వానికి కొత్తగా అప్పులు పుట్టే పరిస్థితి లేదని తెలిపారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రానికి భారమయ్యే సలహాదారులు, రాజకీయ నియామకాలు అవసరమా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని స్పష్టంచేశారు.

ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీపై తప్పుడు ఆరోపణలు చేసిన బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సుదీర్ఘ రాజకీయాల్లో మచ్చ లేని నాయకురాలిపై అలా మాట్లాడటం తగదని బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరైనా తమ పార్టీ నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోమని దయాకర్‌గౌడ్ హెచ్చరించారు.



బుధవారం కోస్గి పట్టణ శివార్లలోని కొడంగల్ రహదారిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ బహిరంగసభకు హాజరైన జనం

యుద్ధం అయిపోలేదు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభోత్సవాలు చేశారు. మహిళా సంఘాలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం కోస్గి పట్టణ శివార్లలోని కొడంగల్ రహదారిలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో రేవంత్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలసి కుట్ర చేశాయి. బీఆర్ఎస్ గెలుపు కోసం బీజేపీ ఓడినా ఫర్వాలేదని చూశాయి. కానీ ప్రజలు అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్‌ను గెలిపించడంతో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది. ఇప్పుడు ఒకరు పొత్తు అంటారు.. ఇంకొకరు చెప్పుతో కొడతా అంటారు. వాళ్ల మాటలు నమ్మొద్దు. వాళ్లు కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని కుట్రపన్నుతున్నారు.

కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

గతంలో కరీంనగర్‌లో ఓడిపోతాననే కేసీఆర్ మహబూబ్‌నగర్ జిల్లాకు వలస వచ్చారు. పాలమూరు నుంచి ఎంపీగా గెలిపించినందుకే తెలంగాణ సాధించి సీఎం అయ్యే అవకాశం దక్కిందని కేసీఆర్ అన్నారు. మరి పదేళ్లు సీఎంగా ఉండి పాలమూరుకు ఏం చేశారు? పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు కాంట్రాక్టర్లకు కట్టబెట్టి కమీషన్లు తీసుకున్నారే తప్ప ఏం ఒరగబెట్టారు? ఇక్కడి ప్రజలకు క్షమాపణలు చెప్పాకే కేసీఆర్ పాలమూరులో ఓట్లు అడగాలి.

తెలంగాణను దోచుకున్నారు

చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్టు చిన్నారెడ్డి ప్రారంభించిన ఉద్యమంలో కేసీఆర్ దూరి తెలంగాణను దోచుకున్నారు. ఇప్పుడు ప్రజలు ఛీకొట్టి ఇంట్లో కూర్చోబెడితే.. అల్లుడు నల్లగొండ నుంచి, కొడుకు మహబూబ్‌నగర్ నుంచి పాదయాత్ర చేపడతారట. మళ్లీ పాలమూరు జిల్లాకు ఎందుకు వస్తారు? నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, దేవాదుల, కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, ప్రాణహిత పూర్తిచేయలేదేం?

బీఆర్ఎస్-బీజేపీలది చీకటి ఒప్పందం

బీజేపీ, బీఆర్ఎస్‌లది చీకటి ఒప్పందం. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు గడ్డ వేదికగా 'పాలమూరు-రంగారెడ్డి' ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని మోదీ చెప్పారు. ఇప్పుడు కిషన్‌రెడ్డి, డీకే అరుణ, జితేందర్‌రెడ్డిలను అడుగుతున్నా.. జాతీయ హోదా ఎందుకివ్వలేదు? వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్‌ను కాంగ్రెస్ హయాంలో మంజూరు చేస్తే.. గత పదేళ్లలో తట్టెడు మట్టి తీయలేదు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి, మరో ముగ్గురు బీజేపీ ఎంపీలు ఉన్నారు కదా.. రాష్ట్రానికి నలుగురు కలిసి నాలుగు రూపాయలైనా తెచ్చారా?'' అని రేవంత్ మండిపడ్డారు. కొడంగల్ ప్రజలు ఆశీర్వదించడంతోనే తాను సీఎంగా నిలబడి మాట్లాడుతున్నానని చెప్పారు. సమావేశంలో చివరిలో ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డిని ఆశీర్వదించాలని.. కొడంగల్ నుంచి 50వేలకుపైగా మెజార్టీ అందించాలని రేవంత్ పిలుపునిచ్చారు. దీంతో పరోక్షంగా మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి వంశీ పేరును ప్రకటించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మహిళా సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, కోమటిరెడ్డి, ఉత్తమ్, దామోదర, జూపల్లి

ఏపీ సీఎం నీళ్లు తీసుకెళ్తుంటే సహకరించారు..

నాడు ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర సీఎంలకు తెలంగాణ అంటే భయం ఉండేది. నిధులు, జల దోపిడీకి పాల్పడాలంటే.. తెలంగాణ నాయకులు ప్రశ్నిస్తారనే భయం ఉండేది. కానీ తెలంగాణ సీఎంగా కేసీఆర్ బరితెగించారు. ఏపీ సీఎం పోతిరెడ్డిపాడు, రాయలసీమ లిఫ్టు, మల్యాల ద్వారా రోజుకు 12 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించుకుపోతుంటే సహకరించారు. పైగా ఏపీ సీఎంను ప్రగతిభవన్‌కు పిలిపించి పంచభక్ష్య పరమాన్నాలు తినిపించారు. 203 జీఓ ద్వారా రాయలసీమను రత్నాలసీమ చేస్తాననీ చెప్పారు. కానీ పాలమూరు ప్రజల కోసం ఇక్కడి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి?

వారంలో మరో రెండు గ్యారంటీలు అమల్లోకి..

అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంపును అమల్లోకి తెచ్చాం. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేడీ కలసి రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.1,200కు పెంచారు. మేం వారం రోజుల్లో రూ.500కే సిలిండర్ అందజేయనున్నాం. అలాగే 200 యూనిట్లలోపు వినియోగించే పేదలకు ఉచిత విద్యుత్‌ను అమల్లోకి తెస్తాం. పెండింగ్‌లో ఉన్న రైతుబంధు డబ్బులను వచ్చే నెల 15లోగా వేస్తాం. త్వరలోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం.

రెండేళ్లలో నారాయణపేట లిఫ్టు పూర్తి: ఉత్తమ్

- బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎంతో గోస పడిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. 1.30 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చేలా రూ.2,945 కోట్లతో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును చేపట్టామని చెప్పారు. రెండేళ్లలోనే దీనిని పూర్తిచేస్తామన్నారు.
- పదేళ్ల కేసీఆర్ పాలనలో పాలమూరు, నల్లగొండ అత్యంత వివక్షకు గురయ్యాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు.
- కేసీఆర్ కుటుంబపాలనలో తెలంగాణ అప్పుల రాష్ట్రంగా మారిందని ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఈ సభలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దామోదర రాజనర్సింహ, సీనియర్ నేత మల్లు రవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, మనోహర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధిగా ఉండాలనుకుంటున్నా

- తుది నిర్ణయం మాత్రం ప్రధాని మోదీదే
- ఎన్నికల్లో పోటీపై నర్మగర్భంగా మాట్లాడిన తమిళిసై



పుదుచ్చేరి: ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసే ఆలోచన ఉందని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పరోక్షంగా చెప్పారు. పుదుచ్చేరి గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం పుదుచ్చేరిలో తన అధికారిక నివాసం(రాజ్ నివాస్)లో మీడియాతో ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆమె పుదుచ్చేరి నుంచి ఎంపీగా బరిలో దిగుతారనే ఊహాగానాల నడుమ అదే అంశాన్ని ఆమె ప్రస్తావించడం గమనార్హం. ''నేనొక సాధారణ వ్యక్తిని. ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి ఏం ఆదేశిస్తారో అది మాత్రమే నేను ఒక సాధారణ కార్యకర్తలా చేస్తా. లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి నుంచి పోటీచేయబోతున్నానని నేను ఎక్కడా అనలేదు. నా జీవితంలో ఇది కావాలని ఏనాడూ అడగలేదు. అగ్రనాయకత్వం నుంచి వచ్చే ఆదేశాలను శిరసావహిస్తా. ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా. ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేయాలనేది నా ఆకాంక్ష. అయితే అది నెరవేరుతుందా లేదా అనేది ప్రధాని మోదీ తుది నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది''అని ఆమె అన్నారు. ''కోవిడ్ విపత్తుకాలంలో పుదుచ్చేరిలో కరోనా వ్యాక్సిన్లు సకాలంలో అందించడంలో సఫలమయ్యా. కరోనా వైరస్ వ్యాప్తి కట్టడితో పుదుచ్చేరిని అందరికీ ఆదర్శంగా నిలిపా. అరబిందో, సుబ్రమణ్యభారతి వంటి వారికి పుదుచ్చేరితో ఎంతో అనుబంధం ఉంది. నాకూ అలాంటి అనుబంధమే ఉంది. కానీ ఇన్నేళ్లు ఇక్కడ ఉన్నా కొందరు ఇంకా నన్ను 'బయటివ్యక్తి'అనడం నాకెంతో బాధగా ఉంటుంది''అని అన్నారు. ''మూడేళ్లకాలంలో పుదుచ్చేరిలో వేర్వేరు రంగాల్లో, ముఖ్యంగా వైద్యరంగంలో ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా పూర్తిచేశా. ఇక్కడి ఎన్నుకున్న ప్రభుత్వ సహాయసహకారాలతో ఉత్తమంగా పాలించే అవకాశం కల్పించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు''అని ఆమె అన్నారు.

...డీఎన్ఏ ఒక్కటే

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారని కిషన్‌రెడ్డి అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలో అయోధ్య రామమందిర నిర్మాణం చేపడితే, మజ్లిస్ పార్టీ వ్యతిరేకించిందన్నారు. రామమందిరం ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పార్టీకి ఆహ్వానం పంపించినా రాలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

మరోసారి మోదీనే ప్రధాని..

ఒక్క రూపాయి అవినీతి లేకుండా ధర్మబద్ధంగా పరిపాలన అందిస్తున్న నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరో తెలియదని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో 40 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత మొదలైందన్నారు. ఆరు గ్యారంటీలు ఆరు గారెలుగా మారిపోయాయన్నారు. కాగా, బీఆర్ఎస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏ రకమైన ఎజెండా లేదని.. ఆ పార్టీ ఒక్క సీటు గెలిచినా ప్రజలకు మేలు జరగదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

మోదీ రాజ్యం కావాలా.. | రజాకార్ల రాజ్యం రావాలా

- 17 ఎంపీ సీట్లు ఇస్తే.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు
- హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్‌కూ బీఆర్ఎస్ గతే
- జాతీయ నాయకుడిగా కలలుగన్న కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం
- ఆదిలాబాద్ విజయ సంకల్ప యాత్రలో ఎంపీ బండి సంజయ్





అంబేడ్కర్ చౌక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం. మాట్లాడుతున్న బండి

కైలాస్‌నగర్/నిర్మల్: ఎంతో మంది కరసేవకుల బలిదానాల, త్యాగాల స్ఫూర్తిగా రామాలయాన్ని నిర్మించిన అవతార పురుషుడు ప్రధాని నరేంద్ర మోదీ అని, అలాంటి మోదీ రాజ్యం కావాలా.. రాక్షసుల్లా వస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ రజాకార్ల పాలన కావాలా అనే విషయాన్ని ప్రజలు నిర్ణయించుకోవాలని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయసంకల్ప యాత్రలో భాగంగా బుధవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బండి మాట్లాడారు. అయోధ్యలో బాబ్రీ మసీద్ ఉండాలనే వారిని బట్టలూడదీసి కొట్టాలని, రాముడి పుట్టుకను ప్రశ్నిస్తున్న పార్టీలను రాజకీయ సమాధి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన ఉద్యమించి తాము పోరాడితే కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. జాతీయ స్థాయి నాయకుడిగా దేశంలో చక్రం తిప్పుతానని భావించిన కేసీఆర్, తెలంగాణ ప్రజల తీర్పుతో బొక్కబోర్లా పడి ఫామ్‌హౌస్‌కు పరిమితం అయ్యారని ఎద్దేవా చేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు కేసీఆర్ ఢిల్లీ వెళ్తున్నారనే ప్రచారం జరుగుతుందని, గల్లీలోనే ఓడిపోయిన ఆ పార్టీతో తమకు పొత్తు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో హిందువులు సంఘటితమై 17 ఎంపీ సీట్లను గెలిపిస్తే కేంద్రం నుంచి అత్యధిక నిధులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని బండి హామీ ఇచ్చారు.

రాంజీగోండు స్ఫూర్తి కేంద్రానికి భూమిపూజ

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు గడువు సమీపిస్తున్నందున ఆలోపే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కూ పడుతుందని బండి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎల్లపల్లి మార్గంలో ఉన్న అమరుల స్థూపానికి ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌లతో కలిసి ఆయన నివాళులర్పించారు. మహేశ్వర్‌రెడ్డితో కలిసి రాంజీగోండు స్ఫూర్తికేంద్రం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఒక వర్గం ఓట్ల కోసం ఆదివాసీల చరిత్రను తెరమరుగు చేసే కుట్ర చేస్తారా? అని ప్రశ్నించారు. ఎక్కడైతే వెయ్యిఉరుల మర్రి ఉండేదో అక్కడే స్ఫూర్తి కేంద్రాన్ని ఏడాదిలోగా పూర్తిచేస్తామని చెప్పారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్న కాంగ్రెస్ నేతల గడువులో 70 రోజులు ముగిశాయన్నారు. ఎప్పుడైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముందని, ఆలోపే ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు

- మా దృష్టి ఇప్పుడు అభివృద్ధిపైనే
- ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడాలి: రేవంత్‌రెడ్డి
- రూ.2 వేల కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా ఐటీఐలు



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికలు ముగిసి.. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తాము రాజకీయాలు చేయడం లేదని, తమ దృష్టి అంతా అభివృద్ధి పైనే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సీఐఐ- తెలంగాణ, టీడీఎఫ్- యూఎస్‌ఏల ఆధ్వర్యంలో విద్య, నైపుణ్య అభివృద్ధి, వాణిజ్య అవకాశాలు అనే అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, తరువాత రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం గురించే ఆలోచిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రూ. 2,000 కోట్లతో 64 ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అలాగే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ఇస్తామని వెల్లడించారు. ఈ ప్రభుత్వం అందరిదని, ప్రజలు కోరుకుంటేనే అధికారంలోకి వచ్చామని అన్నారు. ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. రాజకీయాలు ఎలా ఉన్నా వైఎస్, చంద్రబాబు, కేసీఆర్ హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని చెప్పారు. అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం గత పాలకులు తీసుకున్న మంచి నిర్ణయాలను కొనసాగిస్తామని చెప్పారు. గతంలో అవుటర్ రింగ్ రోడ్ అవసరం లేదని కొందరు అన్నారని, ఇప్పుడది హైదరాబాద్ కు లైఫ్‌లైన్ గా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి.వెంకటేశం, సీఐఐ ప్రతినిధులు వగీశ్ దీక్షిత్, జి.గోపాల్‌రెడ్డి, సి. శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసాలు @ 30 మున్సిపాలిటీలు

- 15 చోట్ల పాత చైర్‌పర్సన్లను తొలగిస్తూ నోటిఫికేషన్ల జారీ
- 9 మున్సిపాలిటీలకు కొత్త చైర్‌పర్సన్ల ఎన్నిక పూర్తి
- మరో 6 చోట్ల ఈనెల 28న ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ పాలక మండళ్లలో మొదలైన అవిశ్వాసాల పర్వం కొనసాగుతోంది. ఇప్పటివరకు 34 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో చైర్మన్ / చైర్‌పర్సన్ / వైస్ చైర్మన్ లేదా మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానాలను ప్రతిపాదిస్తూ నోటీసులు జారీ చేయగా, 30 చోట్ల ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. అవిశ్వాస పరీక్షల్లో ఓడిపోయిన వారిలో 15 మందిని పదవుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది. మిగతా 15 చోట్ల నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉంది.

9 మున్సిపాలిటీల్లో కొత్త చైర్‌పర్సన్లు

అవిశ్వాస తీర్మానాలు నెగ్గి పదవుల నుంచి దిగిపోయిన చైర్మన్లు, వైస్ చైర్మన్ల స్థానంలో కొత్త వారిని ఎన్నుకొనే ప్రక్రియ కూడా 9 మున్సిపాలిటీల్లో పూర్తయింది. మహబూబ్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ, భూపాలపల్లి, నస్పూర్, మంచిర్యాల, నల్గొండ, వేములవాడ, నర్సాపూర్ మున్సిపాలిటీల్లో కొత్త వారు కొలువు దీరారు. జగిత్యాల, భువనగిరి, ఖానాపూర్, హుజూర్‌నగర్, సుల్తానాబాద్, నారాయణఖేడ్ మునిసిపాలిటీల్లో ఈనెల 28న ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, కొత్త చైర్మన్/వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. నాగారం, మణికొండ, తూంకుంట, తూప్రాన్ మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలకు నోటీసులు జారీ చేసినప్పటికీ, సమావేశం తేదీలను నిర్ణయించలేదు. కాగా బండ్లగూడ జాగీర్, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్లలో మేయర్‌లపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

మరికొన్ని పట్టణాల్లో అవిశ్వాస నోటీసులు

రాష్ట్రంలోని 142 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి ఇప్పటి వరకు 34 చోట్ల అవిశ్వాస నోటీసులు జారీ అయినప్పటికీ, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పురపాలక వర్గాలు చెపుతున్నాయి. ప్రతి జిల్లాలోనూ మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే ఈ ప్రక్రియ సాగుతోంది. మొత్తంగా కాంగ్రెస్ గెలిచిన నియోజకవర్గాలలోని పట్టణాల పరిధిలో మెజారిటీ మునిసిపాలిటీలను లోక్‌సభ ఎన్నికల లోపు హస్తగతం చేసుకొనే ఆలోచనలో అధికార పార్టీ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఈనెల 29 వరకు 'మాదిగల జోడో యాత్ర'

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దామోదర

సాక్షి, హైదరాబాద్: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి ఈనెల 29 వరకు 'మాదిగల జోడో యాత్ర'నిర్వహిస్తున్నామని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి తెలిపారు. 'మాదిగల జోడో యాత్ర'మాదిగల పంతం – బీజేపీ అంతం పేరుతో నిర్వహిస్తు న్న జోడోయాత్ర వాల్ పోస్టర్‌ను బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. పిడమర్తి రవి, వివిధ దళిత సంఘాలు, దండోరా, ప్రజా సంఘాలు, మాదిగ రాజకీయ వేదిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

ఎవరితోనూ పొత్తు లేదు

- కాంగ్రెస్ కూటమి అతుకుల బొంత
- అధిష్టానం ఆదేశిస్తే మల్కాజిగిరి నుంచి పోటీచేస్తా... బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల



యాదగిరిగుట్ట: బీఆర్ఎస్‌కు తెలంగాణలోనే అధికారం లేదని, ఇక పార్లమెంట్‌లో ఆ పార్టీ నాయకులు ఏం చేస్తారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్‌కు ఎంపీలతో సంబంధం లేదని, వాళ్లను గెలిపించినా ఐదేళ్ల పాటు ఉత్సవ విగ్రహాలుగా ఉంటారే తప్ప.. రూపాయి తెచ్చేది లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి అని మొదలు పెట్టి, అనేక పార్టీలను బతిమాలి ఒక వేదికపైకి తెచ్చిందని, అది ఒక అతుకుల బొంత అని ఎద్దేవా చేశారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే నరేంద్ర మోదీ మరోసారి ప్రధానిగా రావాలని, అందు కోసం బస్సు యాత్ర చేపడు తున్నామని అన్నారు. బీజేపీకి ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకునే ఖర్మ పట్టలేదని, తమ పార్టీ సొంతంగానే పోటీ చేస్తుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అధిష్టానం ఆదేశిస్తే మల్కాజిగిరి నుంచి ఎంపీగా పోటీచేస్తానని ఈటల చెప్పారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అప్పుడు కాంగ్రెస్ పార్టీ అన్నదని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చిందని విమర్శించారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, విజయ సంకల్ప యాత్ర ఇన్‌చార్జి భరత్‌గౌడ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ సిద్ధాంతాలు లేని పార్టీలు

- కేసీఆర్‌ను దగ్గరకు రానీయం
- మోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడం ఖాయం
- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్
- పరిగిలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర



విజయ సంకల్పసభలో మాట్లాడుతున్న లక్ష్మణ్

పరిగి: పాపాల భైరవుడు కేసీఆర్‌ను దగ్గరకు రానిచ్చే ప్రసక్తే లేదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా పరిగికి చేరుకున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తీరుపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ సిద్ధాంతాలు లేని పార్టీలని మండిపడ్డారు. ప్రజలు, దేశహితం కోసం పుట్టిందే బీజేపీ అని పేర్కొన్నారు. మోదీ గెలుపు కోసమే పార్టీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం మోదీతోనే సాధ్యమైందన్నారు. నరేంద్ర మోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. బీజేపీలో సాధారణ కార్యకర్త కూడా ప్రధాని అయ్యే అవకాశం ఉందన్నారు. ఇందుకు మోదీయే ఉదాహరణ అని తెలిపారు. ఇతర పార్టీల్లో కుటుంబ పాలనే కొనసాగుతోందని అన్నారు. మోదీ దెబ్బకు అవినీతి పార్టీలన్నీ ఏకమవుతున్నాయని, అయితే ప్రజలు వాటిని ఆదరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో కేంద్రం నుంచి తెలంగాణకు రూ.10 లక్షల కోట్లు వచ్చాయని తెలిపారు. మోదీ ప్రభుత్వం వేసిన జాతీయ రహదారులపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉన్నది ఒకటే మంచి. జ్ఞానం.
ఉన్నది ఒకటే చెడు. అజ్ఞానం.
- సోక్రటీస్

సాక్షి
గురువారం, 22 ఫిబ్రవరి 2024

‘సర్వోన్నత’ న్యాయం!

వ్యవస్థలు నిర్మాణం కావటానికి సమయం పట్టినట్టే అవి భ్రష్టుపట్టడానికి కూడా ఎంతో కొంత వ్యవధి పడుతుంది. అప్రమత్తంగా వుండి సకాలంలో దాన్ని గమనించుకుంటే వాటిని రక్షించుకోవటం సులభమవుతుంది. గత నెల 30న జరిగిన చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక విషయంలో సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం తీసుకున్న అసాధారణ నిర్ణయం ఆ కారణం రీత్యా హర్షించదగింది. ఆ ఎన్నికల్లో ఓటమి పాలైన ఆప్ అభ్యర్థి కులదీప్ కుమార్‌ను మేయర్‌గా ప్రకటిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పు వక్రమార్గాల్లో విజయం సాధించటానికి అలవాటుపడిన రాజకీయ నేతలకూ, వారికి దాసోహమయ్యే అధికారులకూ చెంపపెట్టు. రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన అనిల్ మాసీ కనీసం సీసీ కెమెరాలున్నాయన్న వెరపు కూడా లేకుండా ఆప్ అభ్యర్థికి పడిన ఎనిమిది బ్యాలెట్ పత్రాలపై స్వహస్తాలతో గీతలు పెట్టి అవి చెల్లని ఓట్లుగా లెక్కేసి బీజేపీ అభ్యర్థిని విజేతగా ప్రకటించారు. ఆయన వ్యవహారశైలి పూర్తిగా చట్టవిరుద్ధమని ధర్మాసనం తేల్చిచెప్పటంతోపాటు అఫిడవిట్‌లో సైతం ఆ అధికారి బొంకటం నేరంగా పరిగణించి ఆయనపై సీఆర్‌పీసీ సెక్షన్ 340 కింద విచారణ జరపాలని నిర్ణయించటం మంచి పరిణామం.

నిజానికి ఏ ఇతర నగరాలతో పోల్చినా చండీగఢ్ మేయర్ పదవి ఏమంత ప్రాధాన్యత వున్నది కాదు. కేంద్ర పాలిత ప్రాంతంగా వున్న ఆ నగరానికి మేయర్ అయినవారు కార్పొరేషన్ సమావేశాలు నిర్వహించటం, ఎజెండాను రూపొందించటం మాత్రమే చేయగలరు. పైగా ఆ పదవీకాలం ఏడాది మాత్రమే. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో బీజేపీ నాయకత్వం ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్ వరకూ ఎవరి దారి వారిదే అని ప్రకటించిన ఆప్... అందరినీ ఆశ్చర్యపరుస్తూ మేయర్ ఎన్నికలో మాత్రం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ 13 వార్డుల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ ఏడింటిని గెలుచుకుంది. బీజేపీకి 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. చండీగఢ్ లోక్‌సభ ఎంపీగా గెలిచిన బీజేపీ నేత కిరణ్ ఖేర్, ఒకే ఒక్క సభ్యుడున్న శిరోమణి అకాలీదళ్ కౌన్సిలర్‌ను కూడా కలుపుకొంటే బీజేపీ బలం 16. కనుక 36 మంది సభ్యులున్న కార్పొరేషన్‌లో 20 మంది సభ్యులున్న ఆప్–కాంగ్రెస్ కూటమి గెలుపు ఖాయం. కానీ ఏం చేసైనా నెగ్గి తీరాలనుకున్న బీజేపీ వ్యూహానికి అనిల్ మాసీ వంతపాడారు. ఆది నుంచీ మేయర్ ఎన్నికను ఆయన ప్రహసన ప్రాయంగా మార్చారు. షెడ్యూల్ ప్రకారం వాస్తవానికి గత నెల 18న మేయర్ ఎన్నిక జరగాలి. కానీ ఆప్, కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశం కోసం వెళ్లాక మాసీ అస్వస్థులయ్యారంటూ దాన్ని కాస్తా వాయిదా వేశారు. కేంద్రపాలిత పాలనావ్యవస్థ ఈ ఎన్నికను ఫిబ్రవరి 6న జరపాలని నిర్ణయించింది. దీన్ని సవాలు చేస్తూ ఆప్ అభ్యర్థి కులదీప్ కుమార్ పంజాబ్ హరియాణా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయటంతో న్యాయస్థానం దీన్ని జనవరి 30న జరపాలని ఆదేశించింది. ఈ క్రమం అంతా పరిశీలిస్తే, 30న జరిగిన తతంగం గమనిస్తే నాయకులు, అధికారులు ఎంత నిస్సిగ్గుగా కుమ్మక్కయ్యారో అందరికీ స్పష్టంగా అర్థమవుతుంది. ఈనెల 5న ఈ కేసు విచారణకొచ్చినప్పుడు మాసీ వ్యవహరించిన తీరును జస్టిస్ చంద్రచూడ్ తీవ్రంగా తప్పుబట్టారు. ‘ఇది ప్రజాస్వామ్యాన్ని వంచించటం, హత్య చేయటం తప్ప మరేమీ కాద’ని ఆయన అన్నారు. నిజానికి ప్రజలకు బాధ్యత వహించాల్సిన స్థానంలో, వారి విశ్వాసాన్ని పొందాల్సిన స్థానంలో వున్న రాజకీయ పార్టీలకు ఈ స్పృహ వుండాలి. రేపన్న రోజు అధికారంలోకొచ్చే మరో పార్టీ కూడా ఇదే తీరులో గెలుపును తస్కరించే ప్రమాదం వున్నదని గుర్తించాలి. అన్నిటికన్నా ముఖ్యంగా ప్రజల దృష్టిలో ఈ ఎన్నికల తతంగం మొత్తం గుప్పెడుమంది బలవంతులు చేసే వంచనాత్మక విన్యాసమన్న అభిప్రాయం స్థిరపడితే తమ మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్న ఎరుక వుండాలి. కానీ సమస్యాత్మకంగా వున్న బడి పిల్లలకు ఉపాధ్యాయులు చీవాట్లు పెట్టే రీతిలో సర్వోన్నత న్యాయస్థానం కలగజేసుకుని చెప్పవలసిరావటం అధికారుల, నేతల పరువు ప్రతిష్ఠలకే తలవంపు. దాన్ని కనీసం గుర్తించలేని స్థితిలోనే మన నాయకగణం వున్నదని ఆదివారం నాటి పరిణామాలు చెబుతున్నాయి. మేయర్ ఎన్నికను సుప్రీంకోర్టు రద్దు చేసి, మళ్లీ ఎన్నికకు ఆదేశిస్తుందన్న అంచనాతో బీజేపీ నాయకులు ఫిరాయింపులకు తెరలేపి, ముగ్గురు ఆప్ సభ్యులను బుట్టలో వేసుకున్నారు. దాంతో ఆప్–కాంగ్రెస్ కూటమి బలం 17కి పడిపోగా, బీజేపీ బలం 19కి పెరిగింది.

ఒకపక్క చండీగఢ్ మేయర్ ఎన్నిక వ్యవహారం సుప్రీంకోర్టు పరిశీలనలో వుండి, దేశమంతా దానిపై దృష్టిపెట్టిన తరుణంలో ఈ తరహా జుగుప్సాకర చేష్టలకు పాల్పడటం భావ్యంకాదన్న ఇంగితజ్ఞానం లోపించటం నిజంగా బాధాకరం. మేయర్‌గా పార్టీ అభ్యర్థి నెగ్గటంపైనే తమ భవిష్యత్తంతా ఆధారపడి వుందనుకోవటం దివాలాకోరుతనం. మాసీ మాయోపాయంవల్ల మేయర్ అయిన మనోజ్ సోంకార్ రాజీనామా చేశారు గనుక తిరిగి ఎన్నికకు ఆదేశించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనను తోసిపుచ్చి 142వ అధికరణ కింద సంక్రమించిన అధికారాన్ని వినియోగించి ఆప్ అభ్యర్థిని విజేతగా నిర్ణయించటాన్ని చూసైనా అటు నాయకులూ, ఇటు అధికారగణమూ కళ్లు తెరవాలి. అక్రమాలతో, అన్యాయాలతో గెలవాలని చూడటం ప్రజాస్వామ్యానికి తీవ్ర అపచారం చేయటమేనని అందరూ గుర్తించాలి. అసాధారణమైన ఈ తీర్పు మన వ్యవస్థలకు భయభక్తులు నేర్పాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.త్రయోదశి ప.1.45 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పుష్యమి సా.5.14 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.10.17 నుండి 11.05 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృత ఘడియలు:** ఉ.10.22 నుండి 12.04 వరకు.

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం: 5.59
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

అధికార పార్టీని ఆపడం సాధ్యమేనా?

విశ్లేషణ



రాధికా రామశేషన్

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 స్థానాలనూ, తన నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 400 స్థానాలనూ గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం ప్రాంతీయ పార్టీలనూ, గుర్తింపు రాజకీయాల మూలాలున్న పార్టీలనూ కూడా ఆకర్షించి తమతో కలుపుకోవడానికి ప్రయత్నిస్తోంది. దీనివల్ల సీట్ల పంపకంపై సర్వత్రా వాగ్వివాదాలు తలెత్తవచ్చు. అయితే బీజేపీ వ్యూహకర్తలకు అలాంటి చిక్కులను అధిగమించే నేర్పు ఉంది. మరోవైపు శక్తిమంతమైన బీజేపీని ఎదుర్కోవాల్సిన ఇండియా కూటమిని ఎవరు నడిపిస్తారు అనే ప్రశ్న ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. పైగా అవి ఒక ఉమ్మడి ఆదేశం మీద పనిచేయడంలో విఫలమవుతున్నాయి. కాంగ్రెస్ తన గొప్పతనపు భ్రమలను విడిచిపెట్టేవరకు, ఇండియా కూటమిపై పెద్ద ఆశలు లేవు.

లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ చదరంగంలో పావులు కదులుతున్న వేళ... తర్కాలు, ఔచిత్యాలు తలకిందులవుతున్నాయి. పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన మేరకు బీజేపీ 370 లోక్‌సభ స్థానాలను (ఎన్డీయే కూటమికి 400) లక్ష్యంగా పెట్టుకుంది. ‘ఇండియా’ కూటమి సంకీర్ణానికి భారీగా బలాన్నిచ్చే ప్రతిపక్ష పార్టీలను తుడిచిపెట్టడానికి గర్వాతిశయంతో కూడిన అధికార పార్టీ నిశ్చయంగా ప్రయత్నిస్తుంది. దీనికి వ్యతిరేకంగా తన శ్రేణులను బలోపేతం చేయడానికి ఇండియా కూటమికి ఎన్ని మిత్రపక్షాలైనా అవసరమే. విపత్తులను (ఉదాహరణకు, తమిళనాడు వరదలు) ఎదుర్కోవడానికి కేంద్రం నుండి తగినంత సహాయం అందించని ఆర్థిక అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, ‘కేంద్రం వర్సెస్ రాష్ట్రాలు’ అనే చర్చను ఇండియా కూటమి లేవనెత్తుతోంది. అలాగే అక్రమాల పేరుతో ఎంపిక చేసిన మంత్రులపై కేంద్రం అణచివేత చర్యలకు పాల్పడటాన్ని కూడా విమర్శిస్తోంది.

మంది ఎక్కువైతే వచ్చే చిక్కులు

మరోవైపు బీజేపీ శక్తిమంతమైన నాయకత్వం కలిగివుంది. తన తోటి నేతలను అవలీలగా అధిగమించగలిగే ప్రజాకర్షక ప్రధాన మంత్రి, చట్టబద్ధమైన సంస్థలపై పట్టు, బలీయమైన పార్టీ యంత్రాంగం వంటి అంశాలతో ఆ పార్టీ క్షీణిస్తున్న ప్రతిపక్షాల కూటమితో పోలిస్తే ఎంతో బలంగా ఉంది. ప్రాంతీయ పార్టీలకు వంశపారంపర్య లేదా గుర్తింపు రాజకీయాలలో మూలాలున్నప్పటికీ, ఎన్డీయేలోకి సాధ్యమైనన్ని ప్రాంతీయ శక్తులను ఆకర్షించి, కలుపుకోవడానికి బీజేపీ చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో అత్యున్నత అభాస ఉంది. ఇది పార్టీపరంగా చూస్తే బీజేపీకి ఎంతమాత్రం పొసగనిది. గత ఐదేళ్లలో, అవిభక్త శివసేన, జనతాదళ్ (యునైటెడ్), శిరోమణి అకాలీదళ్ వంటి ఒకప్పటి విలువైన భాగస్వాములను బీజేపీ కోల్పోయింది. అయితే, చిన్న పార్టీలను చేర్చుకోవడంతో ఎన్డీయే పరిధి ఇప్పుడు విస్తృతమైంది. బీజేపీ తన అపారమైన యుక్తుల ద్వారా, మహారాష్ట్రలో అసలు నాయకుడు ఉద్ధవ్ ఠాకరే నుంచి శివసేనను విభజించింది. శరద్ పవార్ నుంచి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలోని మెజారిటీ విభాగాన్ని స్వాధీనం చేసుకుంది. శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్ నేతృత్వంలోని వర్గం ఇప్పుడు ఎన్డీయే ఆస్తి. శరద్ పవార్, ఉద్ధవ్ ఠాకరేలపై బీజేపీ మోపిన ఆరోపణలకు అజిత్ పవార్, శివసేనను చీల్చిన ఏక్‌నాథ్ శిందే ఆమోదయోగ్యతను కల్పించారు. ‘లౌకిక’ సంకీర్ణ ప్రభుత్వ పతనానికి దారితీసిన నాటకీయ తిరుగుబాటులో జేడీ(యూ)ను బీజేపీ తిరిగి పొందింది. విశ్వసనీయత కోల్పోయిన నితీష్ కుమార్ నాయకత్వంలో తిరిగి బిహార్‌లో అధికారంలోకి వచ్చింది. పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీని ఎదుర్కోవడానికి శిరోమణి అకాలీదళ్‌తో చర్చలను పునఃప్రారంభించింది.



ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ)ని బుజ్జగించడం బీజేపీ సంకీర్ణ కూటమికి సంబంధించి అత్యంత ఆసక్తికరమైన అంశం. ఇది రాష్ట్రంలోని పశ్చిమ ప్రాంతంలో తన ప్రయోజనాలను పటిష్ఠం చేయడానికేనని స్పష్టం. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఈ ప్రాంతం బీజేపీని ఎన్నడూ నిరాశపరచలేదు. గత జూన్‌లో బీజేపీని సవాలు చేయడానికి ఉమ్మడి ఫ్రంట్ ద్వారా తీవ్రంగా ప్రయత్నించిన ప్రతిపక్షాన్ని ఖాళీ చేయించాలనే ఆలోచనలో ఇది భాగం. అయితే ఇండియా కూటమిని ఎవరు నడిపిస్తారు? కాంగ్రెసా లేదా ప్రాంతీయ నాయకుడా అనే ప్రశ్న ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. గత డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ఓడించి, హిందీ మాట్లాడే ప్రధాన భూభాగంపై తన ఆధిపత్యాన్ని బీజేపీ తిరిగి నెలకొల్పిన తర్వాత, ఇండియా కూటమి నాయకత్వ శూన్యత గణనీయంగా ఎత్తి చూపబడింది. ఓటములతో కంగుతిన్న కాంగ్రెస్, ఇప్పుడు తమిళనాడు, కేరళలో ఉన్న బలమైన మిత్రపక్షాల అండదండలతో దక్షిణాది వైపు చూస్తోంది.

దక్షిణాదిలో సాపేక్షంగా స్వల్పంగానే ఉనికిలో ఉన్నప్పటికీ వెరవకుండా, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత, దాదాపుగా దేవెగౌడ వంశానికి చెందిన ఒక ప్రైవేట్ ఎస్టేట్ అయిన జనతాదళ్ (సెక్యులర్)తో కలిసి బీజేపీ ముందుకు సాగుతోంది. ఇక తెలంగాణలో మాత్రం భారత రాష్ట్ర సమితితో పొత్తుపై బీజేపీ అధినాయకత్వం సందిగ్ధంలో ఉంది.

ఇలాంటి పరిస్థితుల్లో– బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని మిత్రపక్షాల బలాధిక్యతతో బీజేపీ పుష్కలంగా నాయకులు ఉండటం అనే సమస్యను ఎదుర్కొంటోంది. మరోవైపున జేడీ(యూ), ముఖ్యమైన కాంగ్రెస్ నాయకులు, తాజాగా మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ నిష్క్రమణ తర్వాత ఇండియా కూటమి నాయకుల కరువు నెదుర్కొంటోంది. ఎన్డీయేలో సీట్ల పంపకంపై సర్వత్రా వాగ్వివాదాలు తలెత్తవచ్చు. అయితే బీజేపీ వ్యూహకర్తలకు అలాంటి చిక్కులను అధిగమించే నేర్పు ఉంది.

ఇండియా కూటమికి కాలం ఎందుకు అననుకూలంగా మారింది? కాంగ్రెస్ లేదా ప్రాంతీయ పార్టీలు తమ సమీకరణాలను సరిగ్గా నిర్వచించుకోలేక పోవడం వల్ల, కూటమి సంకట పరిస్థితి ఆరంభంలోనే నిర్ణయమైపోయినట్టు అనిపించింది. జేడీ(యూ), తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ తమను తాము కాంగ్రెస్ పార్టీతో సమానంగా భావించాయి. అయితే మాటల్లో చెప్పకుండానే కాంగ్రెస్ అధిష్ఠానం తానే నాయకత్వం చేపట్టాలనుకుంది. మరోవైపు ప్రాంతీయ పార్టీలు ఒక ఉమ్మడి ఆదేశంపై పనిచేయలేకపోయాయి. నితీష్ కుమార్‌ను కూటమికి కన్వీనర్‌గా నియమించాలనే ప్రతిపాదనను తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వ్యతిరేకించాయి. ఈ పదవి ఆయనను భారతదేశ ప్రధానమంత్రి అభ్యర్థిగా బరిలో ఉంచడానికి ఒక నిచ్చెన మెట్టు అని ఈ పార్టీల నాయకులు అనుమానించారు. తన వంతుగా రాహుల్ గాంధీ, తాను ప్రధాని పదవికి పోటీలో ఉన్నాననే ఊహాగానాలను ఎన్నడూ కొట్టివేయలేదు.

సంకీర్ణం ఒక క్రీడ కాదు

కాంగ్రెస్ ఆకాంక్షలు దాని క్షేత్ర బలానికి చాలా అసమానంగా ఉన్నాయి. గత ఏడాది డిసెంబరులో వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, మూడు హిందీ ప్రధాన రాష్ట్రాలలో దాని తిరోగమనం... కాంగ్రెస్‌కు సమర్థవంతంగా తలుపులు మూసివేశాయి. కాంగ్రెస్ మూడింట రెండు రాష్ట్రాలను కైవసం చేసుకున్నట్లయితే, అది న్యాయబద్ధంగా ఇండియా కూటమికి నాయకత్వం వహించగలిగేది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో అధికారాన్ని కోల్పోవడానికీ, మధ్యప్రదేశ్‌ను తిరిగి కైవసం చేసుకోవడంలో విఫలం కావడానికీ తెలంగాణలో గెలవడం అనేది పరిహారం కాదు.

సంకీర్ణ నిర్మాణం కాంగ్రెస్‌కు ఎప్పుడూ లేదు. లోక్‌సభలో మెజారిటీ సాధించలేక పోయినప్పుడు, అది బీజేపీయేతర సంకీర్ణాలకు అయిష్టంగానే మద్దతిచ్చింది. అది ఒక క్రీడగా భావించి వాటిని విచిత్రంగా పడగొట్టడానికి మాత్రమే మద్దతిచ్చింది. రాహుల్ గాంధీ ఈ సంప్రదాయానికి తగ్గట్టుగా ఉన్నారు. ఇండియా కూటమిలో నితీష్ అశాంతితో ఉన్నారనీ, ఆర్‌ఎల్‌డీ నూతన అవకాశాలను కోరుకున్నదనీ జనానికి తెలుసు. వారు ఎందుకు అసంతృప్తిగా ఉన్నారో, వారికి ఏం కావాలో తెలుసుకునేందుకు రాహుల్ ప్రయత్నించలేదు. మిలింద్ దేవరా వంటి సన్నిహిత సహచరుడితోపాటు తన పార్టీ ఇతర సహచరుల నిష్క్రమణ పట్ల కూడా ఆయన ఉదాసీనంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తన గొప్పతనం మీద భ్రమలను వీడేంతవరకూ, ఇండియా కూటమిపై పెద్దగా ఆశలు లేవు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అనుకున్నట్టుగానే...



పాకిస్తాన్ సైన్యం ఒక బలహీన సంకీర్ణ ప్రభుత్వాన్ని కోరుకుంటోంది... చూస్తుంటే సరిగ్గా అదే జరుగుతోంది.

– మదీహా అఫ్జల్, స్కాలర్

అలా పోస్తేనే...



నాకు టెక్నాలజీ అంటే ఎంతో ఆసక్తి. కానీ జిలేబీలను త్రీడీ ప్రింటర్ నాజిల్‌తో చేయడం చూశాక, మిశ్రమ భావాలు కలిగాయి. జిలేబీలంటే నాకు ఎంతో ఇష్టం. అలా చేత్తో వాటిని నూనెలో పోయడం కూడా ఒక కళారూపం. చూస్తుంటే నేను అనుకున్నదానికన్నా కూడా నేను పాతకాలపు మనిషిని...

– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త

ఎలా ప్రతిఫలిస్తుంది?



అయోధ్య ప్రాణప్రతిష్ఠ తాలూకు సాంస్కృతిక పవర్‌ను తక్కువ అంచనావేయొద్దు. నేను వింటున్నదాన్ని బట్టి చాలామంది జనాలు ఆ తతంగాలు, ప్రధానమంత్రి ఉపవాస దీక్ష, ఇతర దేవాలయాలను దర్శించుకోవడం లాంటివాటికి నిజంగానే ప్రభావితమయ్యారు.

– వసుంధర సిర్నాటే, కాలమిస్ట్

ఇదొక హింస



సాత్విక ‘అహింస’ రాజకీయాలు: 1. ప్రతిఘటించే వరకూ జనాల్ని దూషించాలి. 2. తర్వాత వారిని ‘న్యాయ’ బుల్‌డోజర్‌తో శిక్షించాలి. 3. అటుపై ఇంటికెళ్లి ‘స్వచ్ఛమైన’ శాకాహార భోజనాన్ని నెయ్యి వేసుకొని ఆరగించాలి.

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

బాల్యపు గొంతు



అమీన్ సయానీ సాబ్! మీ ఆత్మకు శాంతి కలగాలి. మా చిన్నతనం మొత్తం మీ గొంతును ఆనందించాం. ప్రతివారం మీ షో కోసం ఎదురుచూశాం. ఇంకో దిశలో మీ ప్రయాణం సురక్షితంగా సాగాలి. మీ కోసం ప్రార్థిస్తాం. (అమీన్ సయానీ రేడియో అనౌన్సర్: ‘బినాకా గీత్ మాలా’తో ఖ్యాతికెక్కారు.)

– ఆదిల్ హుస్సేన్, నటుడు

న్యాయ కోవిదుడు



దేశ అంతరాత్మకు కావలి కాసిన లెజెండ్ ఫాలీ ఎస్. నారిమన్ ఇక మనతో లేరు. 1975లో అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు ఆయన దేశ అడిషినల్ సొలిసిటర్ జనరల్‌గా రాజీనామా చేశారు. ఆఖరికి సుప్రీంకోర్టును విమర్శించడానికి కూడా ఆయన వెనుకాడలేదు. న్యాయ కుటుంబానికి ఇది చాలా పెద్ద నష్టం. ఆయన ఆత్మకు దేవుడు శాంతి కలిగించుగాక!

– ఫైజాన్ ముస్తఫా, లీగల్ స్కాలర్

పనికి రావా?



పిల్లలు బంగ్లా వర్ణమాల నేర్చుకోవడానికి ఇస్లామిక్ బంగ్లాదేశ్ ఒక పాఠ్యపుస్తకం ముద్రించింది. అందులో సంగీతం మంచిది కాదు, కళ మంచిది కాదు, వినోదం మంచిది కాదు అని ఉంది. అంటే మంచి విషయాలేవీ ‘హలాల్’ (అంగీకారమైనవి) కావు. ఇలాంటివి చిన్నారుల మెదళ్లలో నూరిపోస్తున్నారు. ఇస్లామిక్ ఆటవికతను తిరస్కరించాల్సిన సమయం ఇది.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

ఇన్ బాక్స్

వ్యాపారీకరణ నిజమేనా?

దాదాపు కోటి మందికి పైగా హాజరయ్యే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర వ్యాపారీకరణకు గురయ్యిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2010 సంవత్సరం కన్నా ముందు కూడా 50 లక్షల లోపు భక్తులు మేడారం జాతరకు హాజరయ్యేవారు. 2020 నుండి ఈ భక్తుల సంఖ్య కోటికి చేరింది. దీనికి కారణాలు: సమ్మక్క, సారలమ్మలపై భక్తులకు ఉన్న అపార నమ్మకం, విశ్వాసం, కోరిన కోర్కెలను తీర్చే తల్లులుగా ఈ వన దేవతల గురించి విశేష ప్రచారం జరగడం. ఈ జాతర దట్టమైన అడవిలో ఉన్న కుగ్రామంలో జరగడం కూడా నగర ప్రజలను ఆకర్షించింది.

అయితే, ఈ మేడారం జాతర ప్రక్రియలో గిరిజన సంస్కృతీ, ఆచార, సంప్రదాయాలలో ఇప్పటి వరకు ఏమాత్రం మార్పు రాలేదు. కాకపోతే, పెరుగుతున్న భక్తుల సంఖ్యను సొమ్ము చేసుకునేందుకు దేవాదాయ శాఖ తీసుకున్న చర్యలు వ్యాపారీకరణ నిజమేననుకొనేలా చేస్తున్నాయి. ఏమాత్రం రూపం లేని గద్దెల వద్ద అమ్మవార్ల ప్రతిమలను పెట్టడం, గద్దెల ప్రాంగణం చుట్టూ హిందూ దేవాలయాల మాదిరిగా నిర్మాణాలను చేయడం, సమ్మక్క సారలమ్మ ప్రసాదాలను ప్రవేశ పెట్టడం, పోస్టు ద్వారా కూడా అమ్మవార్ల ప్రసాదం పంపిణీ చేయడం, సామాన్య భక్తులకు ఏమాత్రం అనుకూలంగా లేకుండా వీఐపీలకు దర్శనంలో ప్రాధాన్యత ఉండేలా చూడటం వంటి ప్రభుత్వ చర్యలు విమర్శలకు గురవుతున్నాయి.

అయితే ఇప్పటికీ సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులను వనం నుండి గద్దెల వరకు తేవడం, తిరిగి వనప్రవేశం చేయించడం, పూజాదికాలు ఆదివాసీ సంప్రదాయం ప్రకారమే జరగడం ముదావహం. గిరిజన సంస్కృతికి ఆదివాసీలు దూరమవుతున్నారనీ, ఆదివాసీలను హైందవీకరిస్తున్నారనీ, జాతరను వ్యాపారీకరిస్తున్నారనీ విమర్శలు వస్తున్నప్పటికీ; సామాన్య గిరిజన, జానపదులు మాత్రం ఇవేమీ లెక్క చేయకపోవడం విశేషం.

– కన్నెకంటి వెంకట రమణ, హైదరాబాద్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

పాఠశాల విద్యపై విఫల ప్రయోగం

అభిప్రాయం



డాక్టర్ ఏరుకొండ నరసింహుడు

నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) వల్ల విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగం లేదని దేశంలోని 27 రాష్ట్రాలతో పాటు దీనిని 2009లో ప్రారంభించిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సీసీఈ వైఫల్యాలను ముందే పసిగట్టి 2017 నాటికే రద్దు చేశాయి. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దీనిని ప్రారంభించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ దీనిని రద్దు చేసింది. కానీ తెలంగాణ రాష్ట్రం మాత్రం దీనిని కొనసాగిస్తుండటం గమనార్హం. ఇందువల్ల క్రమంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో పాటు విద్యాప్రమాణాలూ పడిపోయి పతనం అంచుకు చేరుకున్నాయి.

సీసీఈ ప్రకారం సిలబస్ విపరీతంగా పెరిగిపోయింది. అక్షరాల నుండి పదాలు, వాక్యాలు నేర్చుకొనే విధానానికి స్వస్తి చెప్పి, వాక్యాలనుండి పదాలు, అక్షరాలు నేర్చుకోవాలని కొత్తగా సూత్రీకరించడంతో మొత్తం బెడిసికొట్టి పేద విద్యార్థులకు చదువు రాకుండా పోయింది. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులతో పాటు 1. కళలు, సాంస్కృతిక విద్య, 2. ఆరోగ్య, వ్యాయామ విద్య, 3. పని, కంప్యూటర్ విద్య, 4. విలువల విద్య, జీవన నైపుణ్యాలు లాంటి సహ పాఠ్యాంశాలను ప్రారంభించి విద్యార్థిపై భారం పెంచి, బోధకులను నియమించకపోవడంతో 11 ఏళ్లుగా ఏ పాఠశాలలోనూ వీటిని బోధించకుండానే మార్కులు వేస్తున్నారు. ఉపాధ్యాయుడు ఒక గైడ్‌గా, ఏమీ బోధించకుండా ఉండాలట! విద్యార్థే అంతా అర్థం చేసుకోవడం, నేర్చుకోవడం ఎలా సాధ్యం?

పరీక్షల్లో సంస్కరణల పేరిట పరీక్షల సంఖ్యను తగ్గించలేదు సరికదా పెంచారు. ఎప్పుడంటే అప్పుడు విద్యార్థికి చెప్పకుండా పరీక్ష పెట్టవచ్చు అనడం ఉపాధ్యాయుడిని, విద్యార్థిని గందరగోళానికి గురిచేయడమే. ప్రశ్నాపత్రం మొత్తం మార్చి పాఠ్యాంశం బయటి నుండి ప్రశ్నలు ఇచ్చి చిన్న పిల్లలను రాయమంటే ఎలా రాస్తారు? పాఠశాలల్లో, ఇంటి దగ్గర కూడా విద్యార్థి ప్రైవేట్ జీవితాన్ని ఈ విధానం దోచేసింది.



ప్రైవేటు పాఠశాలలు చదవడం, రాయడానికి ప్రాధాన్యత ఇస్తే ప్రభుత్వ పాఠశాలల్లో సీసీఈ, పరీక్షల విధానం ద్వారా మోక్షం వెదుకుతున్నారు. ప్రతి సంవత్సరానికి 4 ఫార్మెటీవ్, 2 సమ్మెటీవ్ పరీక్షలూ, 4 ఎఫ్ఏ లనుండి 20 ఇంటర్నల్ మార్కులు పెట్టారు. ఈ 20 మార్కుల కోసం ప్రతి ఎఫ్ఏలో విద్యార్థి పరిశీలనాంశాలు, ప్రాజెక్ట్ వర్క్, నోట్స్, ఒక స్లిప్ టెస్ట్ లాంటి నాలుగు అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. 10వ తరగతి విద్యార్థులకు ఈ 20 మార్కులు వేయడానికి ప్రైవేటు పాఠశాలలకు సీసీఈ ఒక ఆదాయ వనరు.

సీసీఈలో గ్రేడింగ్ పద్ధతి చాలా విచిత్రంగా ఉంటుంది. ఈ విధానంలో ఎక్కడ కూడా ఒక సబ్జెక్ట్‌లో మార్కులు ఎన్ని వచ్చాయో ఎవ్వరికీ తెలియనివ్వరు. అన్ని సబ్జెక్ట్‌లలో 92 పైబడి మార్కులు వచ్చి ఒక దానిలో 92కు లోపల వస్తే విద్యార్థి సీజీపీఏ (క్యుమ్యులేటివ్ గ్రేడ్ పాయింట్స్ ఆవరేజ్) 10/10 వచ్చే అవకాశంలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై చేస్తున్న ప్రయోగాలను ఆపి, సీసీఈని రద్దు పరిచి సెమిస్టర్ విధానం లేదా పాత విధానం ప్రవేశపెట్టాలి.

పాపం చిన్న పిల్లలకు వాళ్ళపై జరుగుతున్న ప్రయోగాలు తెలియవు. వాళ్ళ అభిప్రాయాలు అడిగేవాళ్ళులేరు, వాళ్ళకు తెలియజెప్పేవాళ్ళులేరు. విద్యావంతులారా, ఉపాధ్యాయులారా, విద్యార్థి సంఘాల మిత్రులారా ఇప్పటికైనా ఈ గొంతులేని పాఠశాల విద్యార్థుల పక్షాన మాట్లాడండి. లేక పోతే చరిత్ర మనల్ని క్షమించకపోవచ్చు!

వ్యాసకర్త తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి । 97010 07666

స్వచ్ఛ సమాజం కోసం...

తన జీవితాంతం పరిశుభ్రత కోసం కృషి చేసిన సంత్ గాడ్గే బాబా గొప్ప సంఘసంస్కర్త, భిక్షువు కూడా. జంతువులకు రక్షణ, నిరుద్యోగులకు ఉపాధి, నిస్సహాయులకు ఆలంబన, పేద యువతీ యువకులకు వివాహం జరపడం వంటి సేవా కార్యక్రమాలు జీవితమంతా నిర్వహించారు. తన భక్తులను పాఠశాలలు, ధర్మశాలలు, శరణాలయాలు, గోశాలలు, ఆస్పత్రులు, విద్యార్థినుల వసతి గృహాలు నిర్మించేలా ప్రోత్సహించారు. సంచార సన్యాసిగా ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామంలోని మురికిని, చెత్తను చీపురుతో శుభ్రపరిచేవారు. ఆయన పరిశుభ్రతకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా పేరు పొందారు. గ్రామాలలో అపరిశుభ్రతను రూపుమాపేందుకు ‘చీపురు దండు’ను నెలకొల్పారు.



సంత్ గాడ్గే బాబా

భారతదేశ వ్యాప్తంగా వివిధ రాజకీయ పక్షాలూ, సేవాసంస్థలూ ఆయనను స్ఫూర్తిగా స్వీకరిస్తున్నాయి. ఆయన అసలుపేరు దేవీదాస్ దేబూజీ. మహారాష్ట్రలో షేన్గావ్ గ్రామంలోని రజక కుటుంబంలో 1876 ఫిబ్రవరి 23న జన్మించారు. చిన్నతనం నుంచీ భజనమండళ్లలో కీర్తనలు, పాటలు పాడుతూ చుట్టుపక్కల గ్రామాలలో ప్రఖ్యాతిపొందారు. దేబూజీ తన 29వ ఏట కుటుంబాన్ని అర్ధరాత్రివేళ విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఆ సమయంలో ఆయనకు తల్లి, తాత, భార్య, పిల్లలు ఉన్నారు. వందకు పైగా పాఠశాలలను ఆయన నెలకొల్పారు. ఇళ్ళులేని, ఆధారంలేని వృద్ధులను ఆదరించేందుకు వృద్ధాశ్రమాలు నిర్మించారు. సమాజం నుంచే కాకుండా అత్యంత సన్నిహితుల నుంచి కూడా దూరమై వివక్షను అనుభవిస్తున్న కుష్ఠురోగులకు సేవచేసేందుకు గాడ్గే బాబా వారికి సేవాశాలలు నిర్మించి సేవ చేశారు. 1956 డిసెంబరు 20న అమరావతి వెళుతుండగా పేఢీ నదీతీరాన వలగావ్ దగ్గర తనువు చాలించారు.

– సంపత్ గడ్డం (రేపు సంత్ గాడ్గే బాబా జయంతి)

క్లుప్తంగా...

హాస్టళ్లలో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించాలి

సీఎంకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థుల వరుస ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం సీఎంకు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వందలాది మంది విద్యార్థులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారని, తెలంగాణ ఏర్పాటైన తర్వాత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆత్మహత్యలు ఆగడం లేదని లేఖలో పేర్కొన్నారు. 2019లో ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జరిగిన అవకతవకల వల్ల రాష్ట్రంలో 23 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ప్రవీణ్‌కుమార్ గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ గురుకులాలు, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య, వైద్యం, వసతి, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలదేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థుల ప్రతిభను మార్కులు, ర్యాంకింగ్ ఆధారంగా కొలమానం పెట్టి విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ప్రవీణ్ ఆందోళన వ్యక్తంచేశారు. బాసరలో ఇప్పటివరకు 15 మంది విద్యార్థులు మరణించినట్లు రికార్డులు చెబుతున్నాయని పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులను తీసుకురండి

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి అక్కడ ఏజెంట్ చేతిలో మోసపోయి ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన 12 మంది భారతీయులను వెనక్కి తీసుకురావాలని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది హైదరాబాద్‌లోని నాంపల్లి బజార్‌ఘాట్ ప్రాంతానికి చెందిన మహ మూద్ అస్ఫాన్‌తో పాటు కర్ణాటక, గుజరాత్, యూపీ, జమ్మూ కశ్మీర్ నుంచి వెళ్లిన యువకులు ఏజెంట్ మోసం చేయడంతో ఉక్రెయిన్‌లో చిక్కుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ పని కోసం గల్ఫ్ దేశానికి వెళ్లినప్పటికీ.. ఎక్కువ జీతం వస్తుందని ఆశ చూపిన స్థానిక ఏజెంట్ వారిని అక్కడి నుంచి రష్యాలో సెక్యూరిటీ లేబర్‌గా పని చేసేందుకు పంపారని తెలిపారు. అక్కడికి వెళ్లిన వారిని రష్యా ఆర్మీలో పని చేయించుకుంటున్నారని ఒవైసీ చెప్పారు. దీంతో వారు తిరిగి దేశానికి రావడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. రష్యన్ ఆర్మీతో కలిసి ఉక్రెయిన్‌లోకి వెళ్లిన అనంతరం వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని ఒవైసీ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయని వివరించారు. వారిని ఇండియాకు తీసుకొచ్చేందుకు ప్రధాని, విదేశాంగ మంత్రులతో మాట్లాడతానని చెప్పారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా కిశోర్ యాదవ్

సాక్షి, హైదరాబాద్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన తానింకి కిశోర్ యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం బీసీ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామకపత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా కిశోర్ యాదవ్ మాట్లాడుతూ...బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు దక్కే వరకు బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

తప్పించుకున్న మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. బీజాపూర్–దంతెవాడ జిల్లాల సరిహద్దు పెడియా హిట్వార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఇందులో భాగంగా పెడియా అటవీ ప్రాంతంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో పోలీసులు కూడా ఎదురుకాల్పులకు దిగారు. హోరాహోరీగా సాగిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు గాయపడగా.. అక్కడి నుంచి మావోయిస్టులు తప్పించుకుని వెళ్లిపోయారని తెలిసింది. దీంతో మావోయిస్టుల శిబిరాన్ని ధ్వంసం చేసిన పోలీసులు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

'బేడ బుడగ జంగాలకు నామినేటెడ్ పదవులివ్వాలి'

సాక్షి, హైదరాబాద్: బేడ బుడగ జంగాలకు నామినేటెడ్ పదవులు కల్పించాలని ఆలిండియా బేడ బుడగ జంగాల వెల్ఫేర్ ఫెడరేషన్ నేత కడమంచి ముత్తయ్య కోరారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.



వైభవంగా సూర్యప్రభ వాహన సేవ

చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో సమతాకుంభ్ ఉత్సవాలు

శంషాబాద్ రూరల్: సమతాకుంభ్–2024 ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ రామచంద్రుడి సూర్యప్రభ వాహనసేవ వైభవంగా సాగింది. సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఉదయం అష్టాక్షరి మంత్ర జపంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో యాగశాలలో సేవాకాలం, శాత్తుముర్రై, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో అగ్నిప్రతిష్ఠ చేశారు. దివ్య సాకేతం నుంచి సమతామూర్తి కేంద్రం వరకు జరిగిన వాహన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం చినజీయర్‌స్వామి భక్తులకు అనుగ్రహణ భాషణం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సంగీత విభావరి, నృత్య ప్రదర్శనతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైహోం గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు దంపతులు పాల్గొన్నారు.



నారసింహుడి ఎదుర్కోలు ఉత్సవం

యాదగిరిగుట్ట: పూర్వగిరి (పాతగుట్ట) శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సింహ వాహనసేవ, రాత్రి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉదయం హవన పూజలు, మూలమంత్ర, మూర్తిమంత్ర అనుష్ఠానములు, పారాయణీకులతో వేద పారాయణములు జరిపించిన అనంతరం శ్రీస్వామి, అమ్మవార్లను సింహవాహనం సేవపై తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి వారిని అశ్వవాహనంపై మేళతాళాలతో ఊరేగించి ఆలయ ముఖ మండపంలో ఎదుర్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. శ్రీస్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం గురువారం జరిపించాలని ఆచార్యులు నిర్ణయించారు.

నకిలీ పత్రాలు.. ఫోర్జరీ సంతకాలు

టీవీ 5 సాంబశివరావు పెట్రోల్ బంక్ సీజ్

- భూ యజమాని ఫిర్యాదుతో హెచ్‌పీసీఎల్ చర్యలు
- ప్లాట్‌కు కంచె..పెట్రోల్ పంపులు మూత
- గతంలోనే మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన యజమాని
- సాంబశివరావు నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో ప్లాట్ అగ్రిమెంట్ చేసుకున్నాడని వెల్లడి
- స్థలం హెచ్‌పీసీఎల్‌కు లీజు.. మాదాపూర్‌లో పెట్రోల్ బంక్ ఏర్పాటు
- సాంబశివరావుపై ఇప్పటికే చీటింగ్ కేసు నమోదు



పెట్రోల్ బంక్‌లో కొంత భాగం సీజ్ చేసిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) సాంబశివరావు

గచ్చిబౌలి (హైదరాబాద్): ఫోర్జరీ డాక్యుమెంట్లతో హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)కు బురిడీ కొట్టించాలనుకున్న టీవీ–5 సాంబశివరావుకు బుర్ర తిరిగిపోయే ఎదురుదెబ్బ తగలింది. పచ్చ మీడియాలో ఒకటైన టీవీ–5లో సాంబశివరావు కీలకంగా వ్యవహరిస్తుంటాడన్న సంగతి తెలిసిందే. కాగా భూ యజమానికి తెలియకుండా నకిలీ పత్రాలతో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఆయన నడిపిస్తున్న పెట్రోల్ బంక్‌ను హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు బుధవారం సీజ్ చేశారు. ఫోర్జరీ సంతకాలతో ప్లాట్‌ను అగ్రిమెంట్ చేసుకొని, దాన్ని హెచ్‌పీసీఎల్‌కు లీజుకు ఇచ్చాడని ప్లాట్ యజమాని సరనాల శ్రీధర్‌రావు హెచ్‌పీసీఎల్‌కు చేసిన ఫిర్యాదులో తెలిపారు. దీంతో కంపెనీ అధికారులు రంగంలోకి దిగారు. ఫోర్జరీ చేసిన స్థలానికి బుధవారం కంచె వేయడంతో పాటు పెట్రోల్ బంక్‌ను పాక్షికంగా సీజ్ చేశారు. ఆ స్థలంలో ఉన్న పెట్రోల్ పంపులను మూసి వేశారు.

ఆయిల్ సంస్థలతో మంచి సంబంధాలున్నాయని నమ్మించి..

సాంబశివరావుపై ఇటీవల మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సరనాల శ్రీధర్ భార్యకు శేరిలింగంపల్లిలోని మాదాపూర్ గ్రామం, సర్వే నంబరు–64, హుడా టెక్నో ఎన్‌క్లేవ్, సెక్టార్–3లోని ప్లాట్ నంబరు–26లో 600 చదరపు మీటర్ల (717.60 చదరపు గజాలు) స్థలం ఉంది. 2018లో సాంబశివరావు వీరిని కలిసి, తనకు ఆయిల్ సంస్థలతో మంచి సత్సంబంధాలు ఉన్నాయని హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ డీలర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించాడు. ప్లాట్‌కు సంబంధించి అగ్రిమెంట్ చేసుకున్నట్టుగా నకిలీపత్రాలు సృష్టించి ఫోర్జరీ సంతకాలతో భూ యజమానులకు తెలియకుండా పెట్రోల్ బంక్ డీలర్‌షిప్‌ను డాక్టర్ కొల్లి సౌమ్య పేరు మీదకు సాంబశివరావు బదలాయించాడు.

జర్నలిస్టులు, పోలీసుల పేరుతో భయపెట్టి..

తన స్థలంలో అక్రమంగా పెట్రోల్ బంక్‌ను నడుపుతున్నట్లు తెలుసుకున్న శ్రీధర్‌రావు షాక్‌కు గురయ్యారు. 2021లో దీనిపై సాంబశివరావును నిలదీశారు. దీంతో సాంబశివరావు ఎదురుదాడికి దిగాడు. హెచ్‌పీసీఎల్‌తో డీలర్‌షిప్ అగ్రిమెంట్‌కు ఒప్పుకోవాలంటూ ఒత్తిడి చేశాడు. రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, పోలీసు అధికారులతో తనకున్న పరిచయాలను ప్రస్తావిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో భయభ్రాంతులకు గురైన శ్రీధర్‌రావు ఆ డీలర్‌షిప్‌ను తమ పేరు మీదకు బదలాయించాలని కోరారు.

లక్షల్లో వసూలు చేసి డీలర్‌షిప్ బదలాయించకుండా..

అయితే కొంత నగదు చెల్లిస్తేనే డీలర్‌షిప్‌ను బదలాయిస్తానని సాంబశివరావు చెప్పాడు. వేరే దారిలేక 2021, మార్చిలో రూ.లక్షల్లో నగదు బదలాయించామని శ్రీధర్‌రావు పోలీసులకు చేసిన ఫిర్యాదులో తెలిపారు. అయినప్పటికీ డీలర్‌షిప్‌ను బదలాయించకపోవడంతో ఈ ఏడాది జనవరి 31న శ్రీధర్‌రావు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌పీసీఎల్ ప్రతినిధులకు సైతం శ్రీధర్‌రావు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హెచ్‌పీసీఎల్ అధికారులు సాంబశివరావు నడుపుతున్న పెట్రోల్ బంక్‌ను సీజ్ చేశారు. చీటింగ్ కేసును నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనిల్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు

- నీటి పారుదల శాఖలో బాధ్యతల విభజన



అనిల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదలశాఖ ఈఎన్సీ(జనరల్)గా ఈఎన్సీ(అడ్మిన్) జి.అనిల్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు లేదా రెగ్యులర్ ఈఎన్సీ(జనరల్) నియామకం జరిగే వరకు ఆయనే అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారని స్పష్టం చేసింది. గతంలో నీటిపారుదల శాఖ ఈఎన్సీ(జనరల్) అన్ని ఇంజనీరింగ్ విభాగాలను పర్యవేక్షించేవారు. తాజాగా ఈఎన్సీ(జనరల్) పోస్టును రాష్ట్ర ప్రభుత్వం విభజించింది. పోస్టు పరిధి నుంచి కొన్ని విభాగాలను తొలగించి ఈఎన్సీ(ఓఅండ్ఎం) బి.నాగేంద్రరావుకు, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కాడా), మైనర్ ఇరిగేషన్ విభాగాల సీఈ కేఎస్ఎస్ చంద్రశేఖర్‌కు అప్పగించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈఎన్సీ(జనరల్)గా సుదీర్ఘకాలం పనిచేసిన సి.మురళీధర్‌తో ఈ నెల 7న రాష్ట్ర ప్రభుత్వం రాజీనామా చేయించడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది.

ఎవరి పరిధిలో ఏం ఉంటాయంటే...

ఈఎన్సీ(జనరల్/అడ్మిన్) – జి.అనిల్‌కుమార్ :

• రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ /ఐబీఎం కమిటీ / రాష్ట్రస్థాయి సాంకేతిక సలహా కమిటీ / స్కివం / ఓఅండ్ఎం కమిటీల చైర్మన్ • బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్/ స్టీల్ ఎంపానల్‌మెంట్ కమిటీ / నెలవారీగా స్టీల్, సిమెంట్ రేట్లు సమీక్షించే సబ్ కమిటీ / అర్బిట్రేషన్ కమిటీల సభ్యుడు • కాళేశ్వరం కార్పొరేషన్, టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ, మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ల డైరెక్టర్ • కమిషనర్ ఆఫ్ టెండర్స్ • తుంగభద్ర బోర్డు, కృష్ణా, గోదావరి బోర్డుల సభ్యులు • అకౌంటెండ్ జనరల్, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ పేరాలు • బడ్జెట్ రూపకల్పన • రాష్ట్ర ప్రభుత్వంతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు • వరదల పర్యవేక్షణ, అన్ని ప్రాజెక్టుల వద్ద వరదల నియంత్రణ, రిజర్వాయర్లకు వచ్చే ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోల సమాచార సేకరణ • అన్ని సాగునీటి ప్రాజెక్టుల పర్యవేక్షణ • పీఎంఎస్ పోర్టల్‌లో ఇన్వెంటరీని క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలి. • ఇతర అధికారులకు కేటాయించని సబ్జెక్టులు • అన్ని ఫైళ్లు డిప్యూటీ ఈఎన్సీ(జనరల్) ద్వారా పంపించాలి.

ఈఎన్సీ (ఓఅండ్ఎం) – బి.నాగేందర్ రావు :

• అంతర్రాష్ట్ర జల వ్యవహారాలు...దీనిపై కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు • నీటి కేటాయింపులు, ఇతర అంతర్రాష్ట్ర వ్యవహారాల విషయంలో కేంద్రం, ఇతర రాష్ట్రాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు • హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్ కార్యకలాపాలు

సీఈ–కాడా/ మైనర్ ఇరిగేషన్– కేఎస్ఎస్ చంద్రశేఖర్ :

• రెగ్యులర్ ఈఎన్సీ(జనరల్) నియామకం జరిగే వరకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వంతో ఉత్తరప్రత్యుత్తరాలు జరపాలి. • కేంద్ర ప్రాయోజిత పథకాలు, కాడా కార్యకలాపాలు పర్యవేక్షించాలి. • టీఎస్ఐడీసీ, చిన్న ఎత్తిపోతల పథ కాలు, చిన్న నీటిపారుదల పథకాలను పర్యవేక్షించాలి.

నేడు ఎస్ఎల్‌బీసీ సొరంగంపై సీఎం సమీక్ష

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగ నిర్మాణ పనులపై మంత్రి ఉత్తమ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో సమీక్షించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు సకాలంలో చెల్లించని కారణంగా నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్ పనులను మధ్యలోనే నిలిపేసింది. సమీక్షకు ఆ సంస్థ ప్రతినిధులను సైతం రప్పిస్తున్నారు.

నాడు సర్పంచ్‌లు.. నేడు 'ఉపాధి' కూలీలు



ఉపాధి కూలీ పనులు చేస్తున్న కుశ్నపల్లి మాజీ సర్పంచ్‌లు లిక్కి శంకరయ్య, దుర్గం సుగుణయ్య

ఒక్కసారి ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే చాలు తరాలు కూర్చుండి తినేలా సంపాదిస్తారని అందరూ అంటుంటారు. ఇది కొందరి విషయంలో వాస్తవమే. అయితే పైసా వెనకేసుకోకుండా ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేసిన, చేస్తున్న వారూ ఉన్నారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి పంచాయతీకి చెందిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లు రెండో కోవకే చెందిన వారు. లిక్కి శంకరయ్య, దుర్గం సుగుణయ్య గతంలో సర్పంచ్‌లుగా పని చేశారు. శంకరయ్య 1988లో మొదటిసారి ఎన్నిక కాగా, తన నిజాయితీ చూసి 1995లో ప్రజలు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు సార్లు సర్పంచ్‌గా చేసినా నయాపైసా కూడా కూడబెట్టుకోని ఆయన నేడు ఉపాధిహామీ పథకం కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. అదే పంచాయతీ ఎస్సీ జనరల్ రిజర్వేషన్ కావడంతో 2002లో సర్పంచ్‌గా ఎన్నికైన దుర్గం సుగుణయ్య కూడా ఆస్తులేమీ కూడగట్టుకోలేదు. ఈయనా ప్రస్తుతం ఉపాధిహామీ పథకం పనులకే వెళ్తున్నారు. గ్రామస్తుల సమస్యలను నెరవేర్చి సర్పంచ్‌లుగా నిజాయితీగా పని చేశామన్న తృప్తి కంటే సొమ్ముల్లో ఏముంటుందంటున్న మాజీ సర్పంచ్‌లు నేటి రాజకీయనేతలందరికీ ఆదర్శమే.

– నెన్నెల

పెళ్లింట విషాదం

రోడ్డు ప్రమాదంలో నవ వరుడు మృతి.. అపస్మారక స్థితిలోకి నవవధువు

- కంటైనర్‌ను ఓవర్‌టేక్ చేస్తూ చెట్టును ఢీకొన్న కారు
- వధువు తండ్రి, కారు డ్రైవర్ కూడా దుర్మరణం
- మృతుల్లో నంద్యాల జిల్లా ప్యాపిలి ఎస్ఐ
- మహబూబ్‌నగర్ జిల్లా అన్నాసాగర్ వద్ద ఘటన



చెట్టును ఢీకొన్న కారు



పవన్‌సాయి (ఫైల్)

భూత్పూర్: పెళ్లి జరిగి వారం రోజులు గడవక ముందే, పసుపు పారాణి ఆరకముందే ఆ ఇంట చావు డప్పు మోగింది. వివాహ రిసెప్షన్ అనంతరం వధువు ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ వరుడుతో సహా ముగ్గురు చనిపోగా, షాక్‌కు గురైన వధువు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్ వద్ద హైవేపై చోటుచేసుకున్న ఈ ప్రమాద ఘటనకు సంబంధించి పోలీసుల కథనమిలా... ఏపీలోని అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన నంబూరి వెంకటరమణ, వాణి దంపతులకు అనూష ఒక్కగానొక్క కూతురు. ఈమెకు ఈ నెల 15న హైదరాబాద్‌కు చెందిన పవన్‌సాయితో అనంతపురంలో వివాహం కాగా హైదరాబాద్‌లోని పవన్‌సాయి ఇంట్లో రెండురోజుల కిందట రిసెప్షన్ నిర్వహించారు. బుధవారం హైదరాబాద్ నుంచి కారులో అనంతపురానికి తిరుగు ప్రయాణమయ్యారు. నంబూరు వెంకటరమణ(55), కూతురు అనూష, అల్లుడు పవన్‌సాయి(25), డ్రైవర్ చంద్ర (27) ప్రయాణిస్తున్న కారు అన్నాసాగర్ వద్ద ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఓవర్‌టెక్ చేసే క్రమంలో అదుపు తప్పింది. కారు రోడ్డు పక్కన ఉన్న ఇనుప రాడ్‌ను బలంగా ఢీకొని 10 ఫీట్ల వరకు గాలిలో ఎగిరి చెట్టును ఢీకొంది. దీంతో వెంకటరమణ, పవన్‌సాయి, డ్రైవర్ చంద్ర అక్కడికక్కడే మృతిచెందగా.. అనూష తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని జిల్లాకేంద్రంలోని ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. నంబూరు వెంకటరమణ నంద్యాల జిల్లా ప్యాపిలి ఎస్ఐగా పనిచేస్తున్నారు.

కళ్ల ముందే తండ్రి, భర్త మృత్యువాత..

కారు ముందు సీట్లో కూర్చున్న తండ్రి వెంకటరమణ, పక్కనే కూర్చున్న భర్త పవన్ మృతి చెందడంతో అనూష షాక్‌కు గురైంది. ప్రమాద విషయాన్ని వెనకాల కారులో వస్తున్న తల్లి వాణికి ఫోన్‌లో చెప్పి అపస్మారక స్థితికి వెళ్లిపోయింది.

అతివేగమే కారణం..

కారు డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం కారణంగా ప్రమాదం జరిగిందని, ప్రమాద సమయంలో కారు వేగం 120– 140 కిలోమీటర్లు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కారు నుజ్జునుజ్జయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

గ్రావిటీని వదిలి కొత్త ప్రాజెక్టులా?

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా సాగునీరు వచ్చే పనులను ఆపివేసి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పనులు చేపట్టిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఉదండాపూర్ నుంచి కాలువలు తవ్వితే లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందుతుందని, వాటిని పక్కన పెట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ.2,900 కోట్లతో చేపడుతున్న కొత్త ప్రాజెక్టు ద్వారా కేవలం లక్ష ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 90 శాతం పనులు పూర్తి కాగా కేవలం 7 నుంచి 10 శాతం పనులు మాత్రమే మిగిలాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనవసర భేషజాల తో కొత్త ప్రాజెక్టును చేపడుతోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న కాలయాపనతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విషయంలో మోసం జరుగుతోందని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా చిక్కమంచిలి వద్ద మరో రిజర్వాయర్ నిర్మించేందుకు సిద్ధమవుతున్న కర్ణాటక ప్రయత్నాలను అడ్డుకోవాలని నిరంజన్‌రెడ్డి సూచించారు. ఎగువన నిర్మితమయ్యే బ్యారేజీలను అడ్డుకోని పక్షంలో అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాలకు నీరు అందే పరిస్థితి ఉండదన్నారు.


ఫలించిన నిరీక్షణ

- 18 ఏళ్లకు ఇల్లు చేరిన ఇద్దరు దుబాయ్ బందీలు
- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చొరవతో విముక్తి
- వారి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న రవి, మల్లేశం

సిరిసిల్ల: 18 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. దుబాయ్ జైల్లో బందీలుగా ఉన్న ఇద్దరు విడుదలై ఇల్లు చేరారు. చాలాకాలానికి ఇల్లు చేరిన వారిని చూసి కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. 2005లో దుబాయ్ వెళ్లిన వలసజీవులు.. అక్కడ హత్య కేసులో ఇరుక్కుని 18 ఏళ్లపాటు శిక్ష అనుభవించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా సిరిసిల్ల శివారులోని పెద్దూరు ఒడ్డెరకాలనీకి చెందిన శివరాత్రి మల్లేశం(48), శివరాత్రి రవి (45) బుధవారం ఇంటికి వచ్చారు. వీరు దుబాయ్‌లో కల్లీవెల్లి వీసా(కంపెనీ వీసా కాదు)పై పనిచేశారు. 2006లో దుబాయ్‌లో నేపాల్‌కు చెందిన సెక్యూరిటీ గార్డు హత్య కేసులో నలుగురు పాకిస్తానీయులు, ఆరుగురు తెలంగాణవాసులకు అక్కడి కోర్టు శిక్ష విధించింది. జైలు శిక్ష పూర్తి చేసుకున్న నలుగురు పాకిస్తానీయులు, కరీంనగర్ జిల్లాకు చెందిన సయ్యద్ కరీం ఇప్పటికే విడుదలయ్యారు. సిరిసిల్లకు చెందిన మల్లేశం, రవి, కోనరావుపేటకు చెందిన లక్ష్మణ్, జగిత్యాల జిల్లాకు చెందిన శివరాత్రి హన్మంతు, చందుర్తి మండలం మల్యాలకు చెందిన నాంపల్లి వెంకటి జైలు శిక్షను పొడిగించడంతో బందీలుగా ఉన్నారు. వీరిలో లక్ష్మణ్, హన్మంతు ఇటీవల విడుదలకాగా.. తాజాగా మల్లేశం, రవి విడుదలయ్యారు. వెంకటి మరో నెల రోజుల్లో విడుదల కానున్నారు. మాజీ మంత్రి కేటీఆర్ వీరి విడుదల కోసం ఎంతో కృషిచేశారు. మల్లేశం, రవికి విమాన టికెట్లు, హైదరాబాద్ నుంచి పెద్దూరు చేరేందుకు వాహనాన్ని కేటీఆర్ ఏర్పాటు చేశారు. మల్లేశం, రవి కుటుంబ సభ్యులతో అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల కుటుంబ సభ్యులు కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


క్రయోజనిక్ ఇంజన్‌ను పరీక్షిస్తున్న దృశ్యం.(ఇన్‌సెట్లో) ఇంజన్

'సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్' టెస్టు సక్సెస్

గగన్‌యాన్ మిషన్‌లో మరో ఘనత సాధించిన ఇస్రో

చెన్నై: భారత్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గగన్‌యాన్ మిషన్‌లో మరో ముందడుగు పడింది. గగన్‌యాన్ ప్రయోగంలో భాగంలో మానవ సహిత అంతరిక్ష యాత్రలకు తోడ్పడే ఎల్‌వీఎం3 లాంచ్ వెహికల్ తయారీలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో ఘనత సాధించింది. ఈ లాంచ్ వెహికల్‌కు గుండెకాయ లాంటి 'సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్'ను విజయవంతంగా పరీక్షించింది. ఈ విషయాన్ని ఇస్రో బుధవారం వెల్లడించింది. తమ పరీక్షలో క్రయోజనిక్ ఇంజన్ పూర్తి సంతృప్తికరమైన పనితీరు కనబర్చిందని, అంతరిక్ష యాత్రలకు అర్హత సాధించిందని వెల్లడించింది. గగన్‌యాన్ యాత్రకు ఈ ఇంజన్ అనువైందని తేలినట్లు స్పష్టం చేసింది. పలు రకాల కఠిన పరీక్షల తర్వాత ఈ క్రయోజనిక్ ఇంజిన్ భద్రతా ప్రమాణ పత్రాన్ని పొందిందని పేర్కొంది. మానవ రహిత గగన్‌యాన్-1 యాత్రను 2024లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రయోగం సఫలమైతే మానవ సహిత యాత్ర చేపట్టనున్నారు. ముగ్గురు వ్యోమగాములను భూమి నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలోకి చేర్చి, మళ్లీ క్షేమంగా వెనక్కి తీసుకురావడం గగన్‌యాన్ మిషన్ లక్ష్యం. మొత్తం మూడు రోజుల్లో ప్రయోగం పూర్తవుతుంది. ఈ ప్రయోగంలో వ్యోమగాములను ఎల్‌వీఎం3 లాంచ్ వెహికల్‌లో అంతరిక్షంలోకి చేర్చాలని నిర్ణయించారు. ఇందులో ఘన, ద్రవ, క్రయోజనిక్ దశలు ఉంటాయి. ఈ క్రయోజనిక్ దశలో లాంచ్ వెహికల్‌ను గమ్యస్థానానికి చేర్చడంలో సీఈ20 ఇంజిన్ పాత్ర అత్యంత కీలకం. ఈ ఇంజన్‌పై ఏడో వాక్యూమ్ టెస్టును ఈ నెల 14న తమిళనాడు మహేంద్రగిరిలోని హై ఆల్టిట్యూడ్ టెస్ట్ ఫెసిలిటీలో నిర్వహించినట్లు ఇస్రో వెల్లడించింది. గగన్‌యాన్ మిషన్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని అధిగమించామని బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేసింది. సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్ యాక్సెప్టెన్స్ టెస్టులు, ఫైర్ టెస్టులు ఇప్పటికే విజయవంతంగా పూర్తయ్యాయి.



బినాకా గీత్‌మాలా
అమీన్ సయానీ ఇకలేరు

ముంబై: నాలుగు దశాబ్దాలకుపైగా కోట్లాది మంది భారతీయ రేడియో శ్రోతలను తన గాత్రంతో కట్టిపడేసిన దిగ్గజ అనౌన్సర్ అమీన్ సయానీ ఇక లేరు. 91 ఏళ్ల సయానీ ముంబైలో మంగళవారం సాయంత్రం గుండెపోటు కారణంగా తుదిశ్వాస విడిచారని ఆయన కుమారుడు రాజిల్ చెప్పారు. ''సాయంత్రం ఆరింటప్పుడు గుండెపోటు రాగానే హుటాహుటిన హెచ్ఎన్ రిలయన్స్ ఆస్పత్రికి తరలించాం. ఎంతగా ప్రయత్నించినా వైద్యులు ఆయనను కాపాడలేకపోయారు'' అని కుమారుడు రాజిల్ వెల్లడించారు.

బినాకా గీత్‌మాలాతో దేశవ్యాప్తంగా ఖ్యాతి

'నమస్తే బెహ్నో ఔర్ భాయియో, మై ఆప్కా దోస్త్ అమీన్ సయానీ బోల్ రహా హూ'' అంటూ మొదలయ్యే ఆయన గాత్రరుగికి మంత్రముగ్ధులు కానివారే లేరు. రేడియో సిలోన్‌లో 1950వ దశకం ఆయనకు స్వర్ణయుగం. 1952 డిసెంబర్‌లో మొదలైన 'బినాకా గీత్‌మాలా' కార్యక్రమాన్ని అద్భుతమైన తన గాత్రంతో కోట్లాది మంది శ్రోతలకు ఫేవరెట్ ప్రోగ్రామ్‌గా మార్చేశారు. అలనాటి మేటి హిందీ సినిమా పాటలను పరిచయం, ప్రసారంచేస్తూ సాగే ఈ కార్యక్రమం 1952 నుంచి 1988దాకా నిరాటంకంగా ప్రతి బుధవారం ప్రసారమయ్యేది. 1988లో బినాకా గీత్‌మాలాను ఆలిండియా రేడియో వారి వివిధ్ భారతిలోకి మార్చారు. 1994దాకా ఆ కార్యక్రమం అత్యంత ప్రజాదరణ పొందిన ప్రోగ్రామ్‌గా కీర్తి గడించిందంటే దానికి కారణం సయానీయే. అత్యంత ఎక్కువకాలం నడిచిన కార్యక్రమంగానూ అది రికార్డు సృష్టించింది. ప్రసారమయ్యే పాటల్లోని విశిష్టతను తనదైన విశ్లేషణతో చెబుతూ శ్రోతలను ఆకట్టుకుంటూ 'రేడియో మ్యాస్ట్రో'గా ప్రసిద్ధికెక్కారు.

50,000 ప్రోగ్రామ్‌లు, 19వేలకుపైగా జింగిల్స్

1932 డిసెంబర్ 21వ తేదీన ముంబైలో 'బహుభాషా' కుటుంబంలో జన్మించిన సయానీ 13 ఏళ్ల వయసులోనే తల్లికి 'రెహ్బర్' పక్షపత్రికలో రచనలో సాయపడేవారు. ఆలిండియా రేడియో బాంబేలో చిన్నారుల కార్యక్రమంలో పాల్గొనేవారు. కెరీర్ మొదట్లో ఇంగ్లిష్ బ్రాడ్‌కాస్టర్‌గా పనిచేశారు. స్వాతంత్య్రం సిద్ధించాక హిందీలోకి మారారు. రేడియోలో ఏకంగా 50,000 ప్రోగ్రామ్‌లు, 19వేలకుపైగా జింగిల్స్ చేశారు. తన సోదరుడు హమీద్ మరణం తర్వాత ఆయన నుంచి బాధ్యతలు తీసుకుని ఎనిమిదేళ్లపాటు బోర్న్‌వీటా క్విజ్ పోటీని విజయవంతంగా నిర్వహించారు. సంగీత శిఖరాలు లతా మంగేష్కర్, కిశోర్ కుమార్‌లతో ఈయన చేసిన ఇంటర్వ్యూలు ఆనాడు అమిత ఆదరణ పొందాయి. సయానీ మరణంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీసహా పలు రంగాల ప్రముఖులు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

● ప్రత్యేక కథనం 'ఫ్యామిలీ'లో..

రష్యాకు ఎదురుదెబ్బ

శిక్షణాప్రాంతంపై క్షిపణి దాడుల్లో 60 మంది సైనికుల దుర్మరణం

కీవ్: ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగిన రష్యాకు బుధవారం భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒక కమాండర్ రాక కోసం శిక్షణా ప్రాంతం వద్ద గుమిగూడిన సైనికులపై రెండు క్షిపణులు వచ్చి పడ్డాయి. దీంతో 60 మంది రష్యా సైనికులు మరణించారని అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. అయితే ఈ ఘటనపై రష్యా రక్షణ మంత్రి సెర్గియో షొయిగూ నోరు మెదపలేదు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీకి కొద్దిసేపటికి ముందే ఈ దాడి జరగడం గమనార్హం. ఇతర ప్రాంతాల్లో రష్యా సైన్యం విజయాలను పుతిన్‌కు వివరించిన సెర్గియో ఈ దాడి వివరాలను మాత్రం వెల్లడించలేదు. రష్యా ఆక్రమణలో ఉన్న ఉక్రెయిన్ తూర్పు ప్రాంతం డొనెట్క్స్ రీజియన్‌లో ఈ దాడి ఘటన చోటుచేసుకుంది. సెర్బియా ప్రాంతంలో ఉండే 36వ రైఫిల్ బ్రిగేడ్ ట్రుడోవ్‌స్కే గ్రామంలో ఒక మేజర్ జనరల్ రాకకోసం వేచి చూస్తుండగా ఈ దాడి జరిగింది. ఒకే చోట డజన్లకొద్దీ జవాన్లు విగతజీవులుగా పడి ఉన్న వీడియో ఒకటి అంతర్జాతీయ మీడియాలో ప్రసారమైంది. అమెరికా తయారీ హై మొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ సిస్టమ్(హిమార్స్) నుంచి దూసుకొచ్చిన మిస్సైళ్లే ఈ విధ్వంసం సృష్టించాయని రష్యా చెబుతోంది. మరోవైపు రష్యా వ్యతిరేకంగా సైనిక వార్తలు రాసే బ్లాగర్ ఆండ్రీ మొరజోవ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన టెలిగ్రామ్ చానెల్‌కు లక్ష మంది చందాదారులు ఉన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో చాలా ప్రాంతాల్లో రష్యా తోకముడిచిందంటూ, వేల మంది సైనికులు చనిపోయారని తాను రాసిన విశ్లేషణాత్మక కథనాలను వెంటనే తొలగించాలంటూ రష్యా సైన్యం నుంచి ఈయన చాన్నాళ్లుగా ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాడు. ఇంకెవరో వచ్చి చంపే బదులు తానే కాల్చుకుని చస్తానని తన బ్లాగ్‌లో రాశాడని వార్తలొచ్చాయి. ఇప్పటిదాకా యుద్ధంలో రష్యా 45వేలకుపైగా సైన్యాన్ని కోల్పోయిందని 'బీబీసీ రష్యా' తెలిపింది.


శంభు సరిహద్దు వద్ద రైతులపైకి ప్రయోగించిన భాష్పవాయు గోళం పేలిన దృశ్యాలు

దద్దరిల్లిన సరిహద్దులు

చర్చలు విఫలం.. మళ్లీ రోడ్డెక్కిన రైతులు

- శంభు, ఖనౌరీ బోర్డర్ పాయింట్ల వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- బాష్పవాయు గోళాలు ప్రయోగించిన పోలీసులు
- 'ఢిల్లీ చలో'కి రెండు రోజుల విరామం
- మరోసారి చర్చలకు ఆహ్వానం

చండీగఢ్: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, వ్యవసాయ రుణాల రద్దుతో సహా ఇతర డిమాండ్లపై రైతు సంఘాలు, కేంద్ర మంత్రుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. రెండు రోజుల విరామం తర్వాత బుధవారం నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సమస్యలు పరిష్కారం అయ్యేదాకా తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. రైతులు, పోలీసుల మధ్య ఘర్షణలతో పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు, ఖనౌరీ బోర్డర్ పాయింట్లు దద్దరిల్లిపోయాయి. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారీ సంఖ్యలో ట్రాక్టర్ ట్రాలీలు, మినీ వ్యాన్లు, జేసీబీలపై నిరసనకారులు తరలివచ్చారు. సరిహద్దుల్లో వేలాది మంది గుమికూడారు. రక్షణ వలయాన్ని ఛేదించుకొని ముందుకు దూసుకెళ్లడానికి ప్రయత్నించారు. వాహనాలతో బారికేడ్లను ధ్వంసం చేసే ప్రమాదం ఉందని పోలీసులు అనుమానించారు. నిరసనకారులను చెదరగొట్టడానికి హరియాణా పోలీసులు డ్రోన్‌తో బాష్పవాయువు గోళాలు ప్రయోగించారు. శంభు బోర్డర్ పాయింట్ వద్ద బుధవారం మూడుసార్లు బాష్పవాయువు ప్రయోగం చోటుచేసుకుంది. డ్రోన్ కెమెరాలతో పోలీసులు నిఘా పెంచారు. ఖనౌరీలోనూ రైతుల ఆందోళన కొనసాగింది. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఢిల్లీ వెళ్లడానికి తమను అనుమతించడానికి డిమాండ్ చేశారు. పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి, వారిని చెదరగొట్టారు. బాష్పవాయువు ప్రభావం నుంచి తప్పించుకోవడానికి చాలామంది రైతులు మాస్కులు, కళ్లద్దాలు ధరించారు. రైతుల ఆందోళన మళ్లీ ప్రారంభం కావడంతో దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లోనూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పలు రహదారులపై ఆంక్షలు విధించారు. మరోవైపు 'ఢిల్లీ చలో' కార్యక్రమాన్ని రెండు రోజులపాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రైతు సంఘం నాయకుడు శర్వన్ సింగ్ చెప్పారు. తదుపరి కార్యాచరణను శుక్రవారం సాయంత్రం ఖరారు చేస్తామని తెలిపారు.

ఘర్షణలో యువ రైతు మృతి

ఖనౌరీ బోర్డర్ పాయింట్ వద్ద రైతులు, పోలీసులు మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. రైతులు ముందుకెళ్లకుండా పోలీసు అడ్డుకున్నారు. ఈ ఘటనలో పంజాబ్‌లోని భటిండా జిల్లా బాలోక్ గ్రామానికి చెందిన శుభ్‌కరణ్ సింగ్(21) అనే రైతు మరణించాడని, మరికొందరు గాయపడ్డారని రైతు సంఘాల నేతలు చెప్పారు. ఈ నెల 13న 'ఢిల్లీ చలో' కార్యక్రమం ప్రారంభమైన తర్వాత ఘర్షణలో రైతు మృతి చెందడం ఇదే మొదటిసారి అని తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌లో నిప్పంటించుకున్న రైతు

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఓ రైతు ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించాడు. రైతులు బుధవారం ఇక్కడ భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న బ్రిజ్‌పాల్ అనే రైతు తనను తాను నిప్పంటించుకున్నాడు. మిగిలిన రైతులు వెంటనే అప్రమత్తమై మంటలు ఆర్పివేశారు. అతడిని ఆసుపత్రికి తరలించారు. బ్రిజ్‌పాల్‌కు ప్రాణాపాయం తప్పిందని డాక్టర్లు చెప్పారు.

నేతలను గ్రామాల్లోకి రానివ్వం: తికాయత్

రైతులను ఢిల్లీకి వెళ్లనివ్వకపోతే ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులను గ్రామాల్లోని రానివ్వబోమని భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ) అధికార ప్రతినిధి రాకేశ్ తికాయత్ హెచ్చరించారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మీరట్‌లో రైతులు బుధవారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తికాయత్ మాట్లాడారు.

చర్చలకు రండి: మంత్రి

డిమాండ్ల సాధనకు రైతులు మళ్లీ ఆందోళనకు దిగడంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా బుధవారం స్పందించారు. రైతు నేతలతో ఐదో విడత చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

చెరకు ఎఫ్ఆర్‌పీ క్వింటాల్‌కు రూ.340

న్యూఢిల్లీ: చెరకు పంటకు ఫెయిర్ అండ్ రెమ్యూనరేటివ్ ప్రైస్(ఎఫ్ఆర్‌పీ)ని క్వింటాల్‌కు మరో రూ.25 పెంచనున్నట్లుకేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దీంతో క్వింటాల్ చెరకు ఎఫ్ఆర్‌పీ రూ.340కి చేరుకోనుంది. అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే 2024-25 సీజన్‌లో ఈ ధరను అమలు చేస్తారు. ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ సమావేశంలో బుధవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. చెరకు రైతులకు చక్కెర మిల్లులు చెల్లించే కనిష్ట ధరనే ఎఫ్ఆర్‌పీ అంటారు. అంతరిక్ష రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

పాకిస్తాన్‌లో సంకీర్ణమే

- చేతులు కలిపిన పీఎంఎల్-ఎన్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ
- నూతన ప్రధానిగా షహబాజ్ షరీఫ్, అధ్యక్షుడిగా జర్దారీ
- ఇరు పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం


షహబాజ్


జర్దారీ

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో రాజకీయ అనిశ్చితికి ఎట్టకేలకు తెరపడింది. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు, అధికార పంపకంపై పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్(పీఎంఎల్-ఎన్), పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) ఎట్టకేలకు తుది ఒప్పందానికి వచ్చాయి. నూతన ప్రధానమంత్రిగా పీఎంఎల్-నేత షహబాజ్ షరీఫ్(72), అధ్యక్షుడిగా పీపీపీ సీనియర్ నాయకుడు అసిఫ్ అలీ జర్దారీ(68) బాధ్యతలు చేపట్టనున్నారు. రెండు పార్టీల మధ్య మంగళవారం అర్ధరాత్రి కీలక చర్చలు జరిగాయి. అనంతరం పీపీపీ చైర్మన్ బిలావల్ భుట్టో మీడియాతో మాట్లాడారు. పీఎంఎల్-ఎన్, పీపీపీ భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే సంకీర్ణ ప్రభుత్వ ప్రధానిగా షహబాజ్ షరీఫ్, అధ్యక్షుడి పదవికి తమ ఉమ్మడి అభ్యర్థిగా అసిఫ్ అలీ జర్దారీ పేర్లను ఖరారు చేసినట్లు ప్రకటించారు. తమ కూటమికి పార్లమెంట్‌లో తమకు సంఖ్యా బలం ఉందని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలమని బిలావల్ భుట్టో స్పష్టం చేశారు. అయితే, ఎంతమంది ఎంపీలు మద్దతు ఇస్తున్నారన్న విషయాన్ని ఆయన బహిర్గతం చేయలేదు. ఒప్పందం ప్రకారం.. జాతీయ అసెంబ్లీలో స్పీకర్ పదవికి పీఎంఎల్-ఎన్ పార్టీకి, డిప్యూటీ స్పీకర్ పదవి పీపీపీకి, సెనేట్‌లో చైర్మెన్ పదవి పీపీపీకి లభించనుంది. చర్చలు సానుకూలంగా ముగించినందుకు పీఎంఎల్-ఎన్, పీపీపీ నేతలకు షహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి పదవుల విషయంలో పీపీపీ నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని అన్నారు. అసిఫ్ అలీ జర్దారీ 2008 నుంచి 2013 దాకా పాకిస్తాన్ అధ్యక్షుడిగా పనిచేశారు. మరోసారి అదే పదవికి చేపట్టబోతున్నారు. నవాజ్ షరీఫ్ సోదరుడైన షహబాజ్ షరీఫ్ సైతం గతంలో ప్రధానమంత్రిగా సేవలందించారు. పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీకి ఫిబ్రవరి 8న జరిగిన ఎన్నికల్లో భారీగా రిగ్గింగ్ జరిగిందని, ఈ ఎన్నిలను రద్దు చేసి, మళ్లీ నిర్వహించారంటూ మాజీ సైనికాధికారి అలీ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఇలాంటి పిటిషన్ పబ్లిసిటీ స్టంట్ అంటూ కొట్టేసింది.

తూర్పు లద్దాఖ్‌పై భారత్, చైనా సైనిక చర్చలు

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో మూడున్నరేళ్ల క్రితం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను సడలించేందుకు భారత్, చైనా 21వ విడత సైనిక చర్చలు జరిపాయి. చర్చల్లో ఎలాంటి కీలకమైన ఉమ్మడి నిర్ణయాలు తీసుకోలేకపోయారు. వాస్తవాధీన రేఖ వెంబడి ఛుషుల్-మోల్డో బోర్డర్ పాయింట్ వద్ద చైనా వైపు భూభాగంలో ఫిబ్రవరి 19వ తేదీన ఈ చర్చలు జరిగాయి. భారత్ తరఫున లేహ్ కేంద్రంగా ఉన్న 14వ కోర్ లెఫ్టినెంట్ జనరల్ రషీమ్ బాలీ, చైనా తరఫున దక్షిణ గ్జిన్‌జియాంగ్ సైనిక జిల్లా కమాండర్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. కోర్ కమాండర్ స్థాయిలో జరిగిన ఈ చర్చల్లో ఇరు దేశాల సైనికుల మోహరింపును ఉపసంహరించుకోవడంపై ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం ఉన్న స్థాయిలోనే సైనిక, దౌత్య కమ్యూనికేషన్లను ఇకమీదటా కొనసాగించాలని నిర్ణయించారు. స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరిగాయని భారత విదేశాంగ శాఖ బుధవారం వెల్లడించింది. దెస్పాంగ్, దెమ్‌చోక్ ప్రాంతాల్లో బలగాల ఉపసంహరణ అంశమూ చర్చకొచ్చిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అక్టోబర్‌లో 20వ విడత చర్చలు జరిగాయి. తూర్పు లద్దాఖ్‌లో సరిహద్దు వెంట సున్నితమైన పరిస్థితులు నెలకొన్నాయని జనవరిలో ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే వ్యాఖ్యానించడం తెల్సిందే. 2020 ప్రథమార్ధంలో తూర్పు లద్దాఖ్‌లో ఉన్న సాధారణ స్థాయికి ప్రస్తుత ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరుదేశాలు ప్రయత్నిస్తున్నాయి.

మోదీ రామరాజ్యంలో దళితులు, బీసీలకు దక్కని ఉద్యోగాలు

కాన్పూర్/ఉన్నావ్(యూపీ): జనాభాలో దాదాపు 90 శాతమున్న బీసీలు, దళితులు, మైనార్టీలకు మోదీ 'రామరాజ్యం'లో సరైన ఉద్యోగాలు దక్కలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్‌జోడో న్యాయ్‌యాత్రలో భాగంగా బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో కార్యకర్తలు, మద్దతుదారులనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. '' జనాభాలో 50 శాతం బీసీలు, 15 శాతం దళితులు, 8 శాతం గిరిజనులు, 15 శాతం మైనారిటీలు ఉన్నారు. మొత్తంగా దాదాపు 90 శాతం జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న వీరికి సరైన ఉద్యోగాలు దక్కనపుడు ఇదేమీ మోదీ రామరాజ్యం?' అని ప్రశ్నించారు. '' కులం పేరిట దళితులు, బీసీలు వివక్షకు గురికావడంతో మీడియాలో, పెద్ద పరిశ్రమల్లో, ఉన్నతోద్యోగాల్లో వారికి సరైన ప్రాధాన్యత లేదు. అణగారిన వర్గాలు ఆకలికి అలమటించి మరణిస్తున్నారు. అయోధ్యలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం చూశారుగా. ఆరోజు విచ్చేసిన అతిథుల్లో వెనకబడివారు, దళితులు, గిరిజనులు ఎంతమంది?. గిరిజనురాలైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, దళితుడైన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లకు ఆరోజు లోనికి అనుమతి లేదు. అందుకే వెనకబడిన వర్గాల సంక్షేమం, వారి ఆర్థిక స్థితిగతులు తెల్సుకునేందుకే కులగణన చేపట్టదలిచాం. ఇది దేశాభివృద్ధిలో విప్లవాత్మకమైన ముందడుగు'' అని రాహుల్ అన్నారు. '' అదానీ, అంబానీ, టాటా, బిర్లా.. ఇలా దేశంలో ఒక రెండు, మూడు శాతం మంది వ్యక్తుల వద్దే దేశ సంపదలో సింహభాగం పోగుబడింది. వీళ్లే నూతన భారతావనికి మహారాజులు'' అని ఆరోపించారు. 2016లో పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, అగ్నివీర్ పథకంలపైనా రాహుల్ విమర్శలు గుప్పించారు. '' కొన్నిసార్లు మీ ప్రశ్నాపత్రం లీక్ అవుతుంది. ఇంకొందరు ఉద్యోగాలు కోల్పోతారు. హఠాత్తుగా జీఎస్‌టీ అని కొత్త పన్నుల విధానం ఒకటి వస్తుంది. పెద్ద నోట్లను రద్దు చేసి ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తారు. తీరా సైన్యంలో అయినా చేరదామంటే అగ్నివీర్ యోజన పేరిట శాశ్వత నియామకాలకు చిల్లుచీటీ పాడుతారు'' అని రాహుల్ విమర్శించారు.

ఫిబ్రవరి 26- మార్చి 1 దాకా యాత్రకు బ్రేక్

ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 దాకా న్యాయ్ యాత్రకు బ్రేక్‌పడనుంది. బ్రిటన్‌లో తాను చదువుకున్న కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో రాహుల్ ప్రసంగం, ఢిల్లీలో పార్టీ కీలక సమావేశాల నేపథ్యంలో న్యాయ్‌యాత్రకు విరామం ఇస్తున్నామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(కమ్యూనికేషన్స్) జైరామ్ రమేశ్ చెప్పారు. నేడు, రేపు సైతం యాత్ర కొనసాగదు. ఫిబ్రవరి 24వ తేదీన మొరాదాబాద్‌లో యాత్ర మొదలవుతుంది. ఫిబ్రవరి 27, 28న కేంబ్రిడ్జ్‌లో రాహుల్ ప్రసంగిస్తారు. మార్చి రెండో తేదీన ధోల్‌పూర్‌లో యాత్ర పునఃప్రారంభమవుతుంది. మార్చి ఐదున ఉజ్జయిని మహాకాలేశ్వర్ ఆలయాన్ని దర్శిస్తారు.

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు 17 సీట్లు

లక్నో: విపక్షాల 'ఇండియా' కూటమిలో మిత్రపక్షాలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల పొత్తు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో ఓ కొలిక్కి వచ్చింది. చాన్నాళ్లుగా సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిగి చివరకు బుధవారం తమ సీట్ల పంపకాలపై ప్రకటన చేశాయి. ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలు ఉండగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ కాంగ్రెస్‌కు 17 చోట్ల పోటీచేసే అవకాశం ఇచ్చింది. ఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ ఉత్తమ్ పటేల్, ఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర చౌదరి, కాంగ్రెస్ యూపీ చీఫ్ అజయ్ రాయ్, ఏఐసీసీ యూపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ అవినాశ్ పాండేల భేటీ తర్వాత ఈ ప్రకటన వెలువడింది. 'మేం 17 చోట్ల పోటీ చేస్తాం. మిగతా 63 స్థానాల్లో ఎస్పీ, ఇతర కూటమి భాగస్వామ్య పార్టీలు బరిలో నిలుస్తాయి'' అని కాంగ్రెస్ నేత వినాశ్ పాండే చెప్పారు.

ప్రియాంకా గాంధీ చొరవతో కుదిరిన ఒప్పందం

యూపీలో సీట్ల సర్దుబాటు విషయంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఒక అడుగు ముందుకేసి ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌తో ఫోన్‌లో మంతనాలు జరిపారని, దీంతో సీట్ల పంపకాల ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శ్రవస్తీ నియోజకవర్గంలో తామే పోటీ చేస్తామని పట్టుబట్టి ఎస్పీ సాధించింది. కాంగ్రెస్ అదనంగా సీతాపూర్, బారాబంకీల్లో పోటీచేసే అవకాశం సాధించింది. వీటితోపాటు అమేథీ, రాయ్‌బరేలీ, కాన్పూర్ నగర్, వారణాసి, షహరాన్‌పూర్, అమ్రోహా, సిక్రీ, మహారాజ్‌గంజ్, బన్స్‌గావ్, బులంద్‌షెహర్, ఘజియాబాద్, మథుర, ప్రయాగ్‌రాజ్, దేవరియా, ఝాన్సీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పోటీచేయనుంది. మరోవైపు, మధ్యప్రదేశ్‌లో ఖజురహోలో మాత్రమే ఎస్పీ పోటీచేయనుంది. మిగతా 28 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు ఎస్పీ మద్దతు ఇవ్వనుంది.


అమెరికా విమానంలో వ్యక్తి అలజడి..
టేపుతో కట్టేసిన తోటి ప్రయాణికులు

వాషింగ్టన్: అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంలో ఓ ప్రయాణికుడు తీవ్ర అలజడి సృష్టించాడు. విమానం గాల్లో ఎగురుతుండగానే అత్యవసర ద్వారం తెరిచేందుకు ప్రయత్నించాడు. తోటి ప్రయాణికులు భయాందోళనతో గట్టిగా అరుస్తున్నా పట్టించుకోలేదు. దాంతో వారంతా అతడిని బంధించి, బలంతంగా సీట్లో కూర్చోబెట్టి, మళ్లీ లేవకుండా టేపుతో కట్టేశారు. అమెరికాలో న్యూమెక్సికో రాష్ట్రంలోని అల్బుక్వెర్కీ సిటీ నుంచి షికాగోకు బయలుదేరిన 1219 విమానంలో(బోయింగ్ 737) ఇటీవలే ఈ ఘటన చోటుచేసుకుంది. అల్బుక్వెర్కీ ఎయిర్‌పోర్టు నుంచి విమానం బయలుదేరిన 30 నిమిషాలకు సదరు ప్రయాణికుడు ఎమర్జెన్సీ డోర్ తెరిచేందుకు ప్రయత్నించాడు. తోటి ప్రయాణికులంతా అప్రమత్తమై అతడిని అడ్డుకున్నారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించి, అల్బుక్వెర్కీ ఎయిర్‌పోర్టులో దించారు. గందరగోళానికి కారణమైన ప్రయాణికుడిని కిందికి దించి, పోలీసులకు అప్పగించారు. అతడు ఎందుకలా చేశాడన్నదానిపై పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

ఫొటోలు తీసుకోవడం మహా పాపం

అఫ్గానిస్తాన్ సీనియర్ అధికారి స్పష్టీకరణ

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో 1996 నుంచి 2001 దాకా తాలిబన్లు అధికారం చెలాయించారు. అప్పట్లో దేశమంతటా టీవీలు, ఫొటోలపై నిషేధం అమలు చేశారు. మనుషులతో సహా జీవించి ఉన్న ప్రాణులను ఫొటోలు తీయడాన్ని, వాటిని ప్రదర్శించడాన్ని నిషేధించారు. ఇస్లాం ధర్మం ప్రకారం అది పాపమని తేల్చిచెప్పారు. అతిక్రమించినవారికి కఠిన శిక్షలు విధించారు. ఇప్పుడు మళ్లీ అలాంటి పరిస్థితులు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా దళాలు వెనక్కి వెళ్లిపోయిన తర్వాత 2021లో అఫ్గానిస్తాన్‌ను తాలిబన్లు ఆక్రమించారు. తమదైన శైలిలో పరిపాలన సాగిస్తున్నారు. కాబూల్‌లో మంగళవారం జరిగిన ఓ సదస్సులో జర్నలిస్టులు ఫొటోలు తీస్తుండగా, న్యాయ శాఖ సీనియర్ అధికారి మొహమ్మద్ హషీం షహీద్ వ్రార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు పెద్ద పాపం చేస్తున్నారు అంటూ హెచ్చరించారు. 'మీడియా మిత్రులకు, అఫ్గానిస్తాన్ పౌరులకు ఒక విషయం చెప్పదల్చుకున్నా. ఫొటోలు తీసుకోవడంలో మీరంతా బిజీగా కనిపిస్తున్నారు. అనైతికత వైపు మళ్లుతున్నారు. ఫొటోలు తీసుకోవడం పాపకార్యం' అని తేల్చిచెప్పారు.



న్యాయ కోవిదుడు నారీమన్ కన్నుమూత

- ఎమర్జెన్సీని ఎదిరించి ఏఎస్‌జీగా రాజీనామా
- కీలక కేసుల వాదనలో కీలకపాత్ర

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలీ శామ్ నారీమన్ (95) మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. న్యాయ నిపుణుడుగా పేరుగాంచిన నారీమన్ 1929లో పార్శీ దంపతులైన బైరాంజీ నారీమన్, బానో నారీమన్‌లకు మయన్మార్‌లో జన్మించారు. బాంబేలో ప్రాథమిక విద్యాభ్యాసంతోపాటు ప్రభుత్వ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. బాంబే హైకోర్టులో న్యాయవాద వృత్తి ప్రారంభించిన నారీమన్ 1971లో సుప్రీంకోర్టులో సీనియర్ హోదా పొందారు. 1972 మే నుంచి 1972 జూన్ 25 వరకూ సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్ పనిచేశారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తన పదవికి మరుసటి రోజే రాజీనామా చేశారు. పలు కీలక కేసులు వాదించిన నారీమన్‌ను కేంద్ర ప్రభుత్వం 2007లో పద్మభూషణ్‌తో సత్కరించింది. 1999లో రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రపతి నామినేట్ చేశారు. 1991లో బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా 1994లో ఇంటర్నేషల్ కౌన్సిల్ ఫర్ కమర్షియల్ ఆర్బిట్రేషన్ అధ్యక్షునిగా ఉన్నారు. 1998లో లండన్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌లో సభ్యుడయ్యారు. 1995 నుంచి 1997 వరకూ ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ జ్యూరిస్ట్స్ కార్యనిర్వాహక కమిటీకి చైర్మన్‌గా పనిచేశారు. ఫాలీ నారీమన్ కుమారుడు రోహింగ్టన్ నారీమన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించారు.

నిర్ణయమే శాసనం

ఫాలీ నారీమన్ చివరి వరకూ తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారుగానీ లాయర్‌గా రాజీ పడలేదు. ఎమర్జెన్సీ సమయంలో కేంద్రాన్ని కాదని అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా రాజీనామా చేసిన ఆయన నర్మద రిహాబిలిటేషన్ కేసులో గుజరాత్ ప్రభుత్వం తరఫు న్యాయవాదిగా ఉంటూ క్రిస్టియన్లపై దాడులు నిరసిస్తూ ఆ కేసు నుంచి తప్పుకొన్నారు. తొలుత తాను మానవతావాదినని తర్వాతే న్యాయవాదిని అని ఆ సమయంలో అభిప్రాయపడ్డారు. ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని ఎదిరించినందుకు నారీమన్‌కు ఇల్లు అద్దెకు ఇవ్వడానికి ఢిల్లీలో ఎవరూ ముందుకురాకపోవడంతో స్థిరమైన నివాసం కోసం ఎంతో కష్టపడ్డారు. 'వెన్నెముక లేనితనం కంటే నిరాశ్రయమే మేలు' అని నారీమన్ వ్యాఖ్యానించారు. డిసెంబరు 2009లో జస్టిస్ ప్రసాద్, జస్టిస్ దినకరన్‌ల నియామకాల సమయంలో హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుల సమీక్ష, బహిరంగ చర్చ అనంతరమే న్యాయ నియామకాలకు సిఫార్సులు చేపట్టాలని భావిస్తున్నట్లు జ్యూడీషియల్ అకౌంటబిలిటీపై కమిటీ పేర్కొంది. ఈ ప్రకటనపై రాం జఠ్మలానీ, శాంతి భూషణ్, అనిల్ దివాన్, కామిని జైశ్వాల్, ప్రశాంత్ భూషణ్‌లతోపాటు నారీమన్ సంతకం చేశారు.

కీలక కేసులు వాదన

తన సుదీర్ఘ కెరియర్‌లో నారీమన్ అనేక కీలక కేసులు వాదించారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కేసులో ఆమె బెయిలు పొందడంలో కీలకవాదనలు చేశారు (అనంతరం ఆ బెయిలు రద్దయింది). భోపాల్ గ్యాస్ ఘటనలో యూనియన్ కార్బైడ్ తరఫున వాదించిన నారీమన్ తన తప్పును తదనంతరం అంగీకరించడానికి వెనకాడలేదు. 47 కోట్ల డాలర్ల పరిహారం కోర్టు వెలుపల బాధితులకు అందించేలా సంస్థతో ఒప్పందం కుదర్చడంలో కీలకపాత్ర పోషించారు. ఏఓఆర్ అసోసియేషన్ కేసులో తన వాదనా పటిమ అనంతరమే ఉన్నత న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తుల నియామకం సుప్రీంకోర్టు చేపట్టడం ప్రారంభించింది. అయితే తదనంతరం తన ఆత్మకథ 'బిఫోర్ మెమరీ ఫేడ్స్'లో మాత్రం న్యాయమూర్తుల నియామక విషయంలో ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులు క్లోజ్ సర్క్యూట్ కాకుండా సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరినీ సంప్రదించాలని అభిప్రాయపడ్డారు.

"ఫాలీ నారీమన్ అత్యుత్తమ న్యాయవాదులు, మేధావుల్లో ఒకరు. సామాన్య పౌరులకు న్యాయం జరిగేలా తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన మృతి నన్నెంతో బాధించింది. నారీమన్ ఆత్మకు శాంతి కలగాలి"
- ప్రధాని నరేంద్ర మోదీ

"నారీమన్ మరణానికి సంతాపం తెలుపుతున్నా. చట్టంలో గొప్ప దిగ్గజమైన నారీమన్ మృతి చాలా విచారకరం"
సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

సాక్షి
హైదరాబాద్
గురువారం। 22। ఫిబ్రవరి। 2024



ఓటీఎస్ ప్లీజ్!
వన్‌టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్)గా ఆస్తిపన్ను బకాయిల పెనాల్టీలపై 90 శాతం రాయితీ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి నివేదించింది. -8లో



మాతృభాష ఔన్నత్యాన్ని చాటాలి
మాతృభాష ఔన్నత్యాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. -8లో

...రూ.కోట్లల్లో కొట్టేస్తున్నారు!



ఇటీవల ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ విపరీతంగా పెరిగిపోయాయని నగర సంయుక్త పోలీసు కమిషనర్ (నేరాలు) ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. ఈ స్కామ్స్‌లో మోసపోతున్న వారిలో సీఏలు, ఏళ్లుగా ట్రేడింగ్ చేస్తున్న నిపుణులు, విద్యాధికులు సైతం ఉన్నారని చెప్పారు. -8లో

న్యూస్‌రీల్

చిన్నారుల లఘు చిత్రాలకు అవార్డులు



అవార్డులు గెలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

బంజారాహిల్స్: ఇంటాక్ట్– ఫిల్మ్ ఇట్ ఇండియా ఫిల్మ్ ఫెస్టివల్‌లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అద్భుత లఘు చిత్రాలను తెరకెక్కించి వావ్..అనిపించారు. గత పదేళ్లుగా ఫిల్మ్ ఇట్ ప్రోగ్రామ్‌లను పాఠశాల విద్యార్థులు నిరంతరం చేస్తున్నారు. ఏయేటికాయేడు కొత్త ఆలోచనలతో ముందుకువస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది 15 మంది విద్యార్థులు వివిధ సందేశాత్మక అంశాలపై 8–10 లఘు చిత్రాలను రూపొందించి పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చినట్లు పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి తెలిపారు. గ్రేడ్–7 నుంచి శ్రేయాసైన్, సాన్వి ఖండేలియా ఉత్తమ చలన చిత్ర కథనం 'దుర్గపూజ' అవార్డును అందుకున్నారు. అలాగే ఉత్తమ ప్రో–యాక్టివ్ చిత్రం 'గౌతమా' అవార్డును అందుకున్నారు. చల్లగుళ్ల వశిష్ఠ చిత్రం, అలెగ్జాండర్ హెయిర్ సెలూన్, ఉత్తమ కథాంశం అవార్డులను అందుకున్నాయి. ఫిల్మ్ ఇట్ అనేది విద్యార్థులకు సహాయపడే అద్భుతమైన బహుళ–సాంస్కృతిక ప్రాజెక్టుగా ఆమె పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కాంచనవల్లి అవార్డుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా దర్శకుడు, సినిమాటోగ్రాఫర్, నిర్మాత పింగ్లే రెడ్డి హాజరుకాగా, ఇన్‌టాక్ టీమ్ సభ్యులు అనురాధారెడ్డి, డాక్టర్ ఎస్‌పీ అంచూరి, అభిషేక్‌దాస్ తదితరులు హాజరయ్యారు.

జైల్ వార్డర్లుగా ఎంపికైన వారికి శిక్షణ

చంచల్‌గూడ: రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జరిపిన నియామకాల్లో 136 మంది తెలంగాణ జైళ్ల శాఖ వార్డర్లుగా ఎంపికయ్యారు. ఇటీవల వీరికి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను కూడా అందజేశారు. ఉద్యోగంలో చేరడానికి ముందు వీరికి 9 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం చంచల్‌గూడలోని సీకా మైదానంలో జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా ప్రారంభించనున్నారు. శిక్షణలో భాగంగా వారికి జైల్ మాన్యువల్, ఫుట్ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, ఫైరింగ్ డ్రిల్, కరాటే, సెల్ఫ్ డిఫెన్స్, యోగాతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్, ఐపీసీ, సీఆర్‌పీసీ ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించనున్నారు.

బదిలీలు..బాధ్యతలు

- చర్యలు చేపట్టిన జీహెచ్ఎంసీ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీకి ఇటీవల బదిలీపై వచ్చిన మునిసిపల్ కమిషనర్లకు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ బాధ్యతలు అప్పగించారు. ఆమేరకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. జి.నళినీ పద్మావతిని అడిషనల్ కమిషనర్ (పరిపాలన)గా నియమించారు. ప్రస్తుతం ఆ బాధ్యతల్లో ఉన్న పి.సరోజను అడిషనల్ కమిషనర్ (డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీస్)గా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కె.సత్యనారాయణను అడిషనల్ కమిషనర్ (లీగల్, ఎలక్ట్రికల్)గా నియమించారు. జి.వేణుగోపాల్‌రెడ్డిని శేరిలింగంపల్లి జోన్ ఘనవ్యర్థాల నిర్వహణ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. మహమూద్‌షేక్‌ను ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పి.ముకుందరెడ్డికి జోనల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

జిల్లా సమాచారశాఖ ఏడీగా అబ్దుల్ కలీం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులుగా అబ్దుల్ కలీం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అసిస్టెంట్ డైరెక్టర్ భానుప్రసాద్ హన్మకొండకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లోని సమాచార శాఖ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ కలీం

ట్రాఫిక్ నియంత్రణ ఎలా?



త్వరలో 'ఇంపాక్ట్' స్టడీ
- మార్గదర్శకాలకు సిద్ధమవుతున్న జీహెచ్ఎంసీ
- కొత్త నిర్మాణాలతో పెరిగే ఒత్తిడిపై అంచనా
- తెరపైకి మళ్లీ సొరంగ మార్గాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఇప్పటికే పెరిగిపోయిన హైరైజ్ భవనాలు, తదితర నిర్మాణాల వల్ల ట్రాఫిక్‌పై తీవ్ర ప్రభావం పడుతోంది. అభివృద్ధి పేరిట నిర్మాణాలు ఊపందుకున్నా..అందుకు తగిన మౌలిక వసతులు కల్పించకుంటే ఇబ్బందులు తప్పేలా లేవు. ముఖ్యంగా ఈ 'అభివృద్ధి' ప్రభావం కేవలం ట్రాఫిక్‌పైనే కాదు తాగునీరు, సివరేజి, పార్కింగ్, ఇతరత్రా సదుపాయాలపైనా ఉంటోంది. ఈ ప్రభావాన్ని(ఇంపాక్ట్) అంచనా వేసే మార్గదర్శకాల కోసం జీహెచ్ఎంసీ పేరెన్నికగన్న కన్సల్టెన్సీ సంస్థలను ఆహ్వానించింది. కొత్త నిర్మాణాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులతో పాటు సదరు సదుపాయాలకు పెరిగే డిమాండ్ తదితరమైనవి అంచనా వేసేందుకు తగిన విధానాలు సూచించాల్సిందిగా కోరింది. ఈ మేరకు తగిన అధ్యయనం చేసి వివరాలివ్వాలని పేర్కొంది. తద్వారా భవిష్యత్‌లో పెద్ద భవన నిర్మాణాలకు అనుమతులివ్వాలంటే ఈ స్టడీలోని మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుంటారు. సదరు నిర్మాణానికి అనుమతి ఇస్తే వాటర్, సివరేజి లైన్లు, పార్కింగ్ ప్రదేశాలు, రహదారులు తదితరమైన వాటి డిమాండ్ ఏ మేరకు పెరగనుంది. వాటిని ఏర్పాటు చేసేందుకు సాధ్యమవుతుందా..అందుకు తగిన ప్రత్యామ్నాయాలున్నాయా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న ఇబ్బందులు మరింత పెరగకుండా ఉంటాయని భావిస్తున్నారు. డిమాండ్ కనుగుణంగా సదరు సదుపాయాలు కల్పించే అవకాశాలుంటే, వాటిని కల్పించేందుకు ఇంపాక్ట్ ఫీజు వసూలు చేయాలనేది ఆలోచన.

జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు తదితరమైనవి ఎన్ని నిర్మించినా అంతకంటే వేగంగా పెరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలు, తద్వారా పెరుగుతున్న నివాసాలు, కార్యాలయాలు, వాహనాలు తదితరమైన వాటితో ట్రాఫిక్ ఇబ్బందుల వంటివి మళ్లీ మొదటికొస్తున్నాయి. ఆ ఇబ్బందులు నివారించేందుకు నాలుగైదేళ్ల క్రితం జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంపాక్ట్ స్టడీ చేశారు. ఆ నివేదిక ఏమైందో తెలియదు. ప్రస్తుతం ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అధ్యయనానికి అవసరమైన మార్గదర్శకాల కోసం కన్సల్టెంట్లను ఆహ్వానించారు.

ఇంపాక్ట్ స్టడీ ఇలా..
ఉదాహరణకు ఒక హైరైజ్ భవనానికి అనుమతి ఇవ్వాలంటే ఎంత బిల్టప్ ఏరియాలో నిర్మాణం జరుపుతారు.. అందులో ఉండే వాణిజ్య దుకాణాలెన్ని..వాటి వల్ల అక్కడ పెరిగే ట్రాఫిక్ ఎంత.. వాహనాల సంఖ్య దాదాపు ఎంత పెరగనుంది.. పార్కింగ్ సదుపాయం ఉంటుందా? అక్కడ ఉన్న రహదారి అదనపు ట్రాఫిక్‌కు సరిపోతుందా? లేని పక్షంలో రోడ్డు విస్తరణకు అవకాశాలున్నాయా.. ఇలా వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. వాటిని బట్టి కొత్తగా నిర్మాణాలకు అనుమతులివ్వవచ్చా లేదా అనేది నిర్ణయిస్తారు.

ప్రతిపాదిత కారిడార్లు
1. ఐటీసీ కోహినూర్ నుంచి విప్రో సర్కిల్ (వయా ఖాజాగూడ, నానక్‌రామ్‌గూడ)వరకు.
2. ఐటీసీ కోహినూర్ నుంచి జేఎన్‌టీయూ (వయా మైండ్‌స్పేస్) వరకు.
3. ఐటీసీ కోహినూర్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 (వయా జూబ్లీహిల్స్ రోడ్‌నెంబర్ 45) వరకు.
4. జీవీకే1 మాల్ నుంచి నానల్‌గర్ (వయా మాసాబ్‌ట్యాంక్) వరకు.
5. నాంపల్లి నుంచి చాంద్రాయణగుట్ట ఇన్నర్ రింగ్ రోడ్ (వయా చార్మినార్, ఫలక్‌నుమా) వరకు.

తెరపైకి మళ్లీ సొరంగ మార్గాలు..



మరోవైపు భూగర్భంలో సొరంగ మార్గాలు నిర్మించడం ద్వారా రోడ్లపై వాహన రద్దీ, ట్రాఫిక్ చిక్కులు తగ్గించవచ్చునని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం కేబీఆర్ పార్కు కింద నుంచి సొరంగమార్గాలు నిర్మించాలని భావించింది. పార్కునుంచి వివిధ మార్గాల్లో దాదాపు 6 కి.మీ.ల మేర సొరంగమార్గాలకు ప్రతిపాదనలు రూపొందించారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ల(టీబీఎం)ను వినియోగించి వాటిని నిర్మించాలనుకున్నారు. ఫీజిబిలిటీస్టడీ తదితరమైన పనులు కన్సల్టెన్సీలకు అప్పగించారు. ఇతరనగరాల్లోని సొరంగమార్గాలను పరిశీలించారు. తదుపరి పనులు జరగలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు కారిడార్లలో టీబీఎంలతో సొరంగ మార్గాలకు ప్రతిపాదనలు చేసింది. వాటి ఫీజిబిలిటీ స్టడీ, డీపీఆర్‌ల కోసం కన్సల్టెన్సీ సంస్థలను జీహెచ్ఎంసీ ఆహ్వానించింది.


పీల్చేదంతా కాలుష్యమే!

ప్రధాన నగరాలలో ఘనపు మీటరు గాలిలో పీఎం-10 స్థాయిలు: (మైక్రో గ్రాములలో)

ఢిల్లీ	209
లక్నో	149
ముంబై	124
కోల్‌కతా	97
అహ్మదాబాద్	91
హైదరాబాద్	83
బెంగళూరు	68
చెన్నై	66

గత ఐదేళ్లలో నగరంలో పీఎం-10 స్థాయిలు

సంవత్సరం	పీఎం స్థాయి
2017-18	110
2018-19	96
2019-20	86
2020-21	88
2022-23	83



నగరంలో క్షీణిస్తున్న గాలి నాణ్యత
- తీవ్రస్థాయిలో ధుమ్ము, ధూళి కణాలు
- పీఎం-10 మోతాదు ఘనపు మీటరుకు 83 మైక్రో గ్రాములు
- దక్షిణాది నగరాలతో పోలిస్తే మన దగ్గరే అధ్వానం
- వాహనాల పొగ, బహిరంగ చెత్త దహనమే ప్రధాన కారణాలు
- పొంచి ఉన్న గుండె, శ్వాసకోశ వ్యాధుల ముప్పు

సాక్షి, సిటీబ్యూరో: ఏటేటా హైదరాబాద్ నగరంలో గాలి నాణ్యత దారుణంగా క్షీణిస్తోంది. నగరవాసులు పీల్చే గాలిలో కాలుష్య కారకాలే అధికంగా ఉంటున్నాయి. స్వచ్ఛమైన గాలిలో పార్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం)–10 స్థాయి పరిమితికి మించింది. సాధారణంగా ప్రతి ఘనపు మీటరులో 60 మైక్రో గ్రాముల పీఎం–10 స్థాయి ఆమోదయోగ్యమైనదిగా పరిగణిస్తుంటారు. అయితే హైదరాబాద్‌లో ఇది ఘనపు మీటరుకు 83 మైక్రో గ్రాములుగా ఉందని ప్రాణ (పోర్టల్ ఫర్ రెగ్యులేషన్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్ ఇన్ నాన్ ఎటైన్‌మెంట్ సిటీస్) అధ్యయనం వెల్లడించింది.

వాహనాల పొగ, నిర్మాణ పనులే కారణం..
ఏటా జనాభా, వాహనాల సంఖ్య పెరగడం, కాలం చెల్లిన వాహనాల నుంచి వెలువడే పొగ, బహిరంగంగా చెత్త దహనం, రోడ్లు, భవన నిర్మాణాల నుంచి వెలువడే ధుమ్ము, ధూళి, కూడళ్ల వద్ద రద్దీ వంటి కారణాలతో ఈ ఉద్గారాలు అధిక మోతాదులో వెలువడుతున్నాయి. పీఎం–10 కణాలు పీల్చినప్పుడు శ్వాసకోశ వ్యవస్థ, రక్తనాళాలలోకి చొచ్చుకుపోయి తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ కణాలు గుండె, ఊపిరితిత్తులపై హానికర ప్రభావాలను చూపిస్తాయి. గుండె, శ్వాసకోశ సమస్యలు వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారి తీస్తాయి.


నియంత్రణ ఇలా...
- కాలం చెల్లిన, మరమ్మతులకు గురైన వాహనాలను వినియోగించకూడదు.
- అత్యవసరమైతే తప్ప సొంత వాహనాలను వినియోగించరాదు. కార్ పూలింగ్ వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు ప్రజా రవాణాకే మొగ్గు చూపించాలి.

జూ పార్క్ వద్ద అత్యధికం..
గత ఐదేళ్లతో పోలిస్తే నగరంలో ఏటేటా పీఎం–10 స్థాయి తగ్గుతూ వస్తున్నప్పటికీ, నిర్దేశిత పరిమితి కంటే అధికంగా ఉండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది నగరంలోని చాలా ప్రాంతాలలో గాలి నాణ్యత దారుణంగా నమోదయింది. ఘనపు మీటరు గాలిలో పీఎం–10 మోతాదు జూ పార్కు వద్ద 249 మైక్రో గ్రాములు, పాశమైలారం 164, బొల్లారం 170, నాచారం 101, బాలానగర్ 142, శామీర్‌పేట 112, జీడిమెట్ల 140లుగా నమోదైంది.

బహిరంగంగా చెత్తను కాల్చొద్దు.
- భవన నిర్మాణాల నుంచి ధుమ్ము, ధూళి వెలువడకుండా జాగ్రత్తలు వహించాలి. సాధ్యమైనంత వరకు హరిత నిర్మాణ ఉత్పత్తులనే వినియోగించాలి.

ఆహ్లాదం.. ఆనందం పంచాలి

దుర్గం చెరువును సుందరంగా తీర్చిదిద్దాలి



- కాలుష్యాన్ని నివారించాలి.. పచ్చదనం పెంచాలి
- హైకోర్టుకు నివేదిక సమర్పించిన ప్రత్యేక కమిటీ
- 'కార్యాచరణ' చేపట్టాలని అధికారులకు ధర్మాసనం ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: 'దుర్గం చెరువులోకి మురుగు నీరు, చెత్త చేరకుండా చర్యలు చేపట్టాలి. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లను గుర్తించాలి. చెట్లు, గార్డెన్‌లను అభివృద్ధి చేయాలి. చెరువు చుట్టూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలి. మొత్తంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి' అని ప్రత్యేక కమిటీ సూచించింది. ఈమేరకు రూపొందించిన నివేదికను సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు అందజేసింది. ఈ నివేదికపై కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని అధికారులను సీజే ధర్మాసనం ఆదేశించింది. దుర్గం చెరువులో కాలుష్యం చేరి ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారి వందలాది చేపలు మృతి చెందాయంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటోగా ప్రజాప్రయోజన వ్యాజ్యంగా విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. నాగ్‌పూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ అతుల్ నారాయణ్ వైద్య, రాష్ట్ర ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి ఎం.శాంతివర్ధనితో ధర్మాసనం ఓ కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ దుర్గం చెరువును సందర్శించి సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పించింది. ఆ సీల్డ్ కవర్‌ను తెరిచి నివేదికను ధర్మాసనం పరిశీలించింది. కమిటీ సూచించిన అంశాలపై కార్యాచరణ ప్రణాళిక నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

కమిటీ గమనించిన అంశాలు...
- దుర్గం చెరువు 160 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గరిష్ట లోతు 10 నుంచి 13 మీటర్లు. దీనిపై కేబుల్ వంతెన 2020లో ప్రారంభించారు. సరస్సును ఆనుకుని ప్రత్యేకమైన రాతి నిర్మాణాలు ఉన్నాయి. ఈ కారణంగా దీన్ని రక్షిత ప్రాంతంగా మార్చారు.
- హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బీ ఆధ్వర్యంలో రెండు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు (ఎస్‌టీపీ) ఏర్పాటు చేశారు. మాదాపూర్ నుంచి వస్తున్న మురుగు నీరులో కొంత మాత్రం శుద్ధి అవుతోంది.
- చెరువు నీటిలో కాలుష్యకారకాలు చాలా ఉన్నాయి.
- చెరువు 160.6 ఎకరాల విస్తీర్ణంలో ఎఫ్‌టీఎల్ సరిహద్దును ప్రకటిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసినా తుది నోటిఫికేషన్ వెలువడలేదు.
- ఎఫ్‌టీఎల్ సరిహద్దు మ్యాప్ ప్రకారం..78 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో, 146 నిర్మాణాలు బఫర్ జోన్‌లో ఉన్నాయి.

చెరువు పునరుద్ధరణ/సంరక్షణకు సూచనలు..
- చుట్టుపక్కల నుంచి కాలుష్యం సరస్సులోకి ప్రవేశించకుండా నిరోధించాలి.
- సరస్సులోకి వచ్చే శుద్ధి చేసిన నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. వర్షాకాలం ముగిసిన తర్వాత నీటి నాణ్యత పర్యవేక్షించి.. శుభ్రపరిచే పనిని జీహెచ్ఎంసీ చేపట్టాలి. దీని కోసం ప్రామాణిక ఆపరేటింగ్ విధానం(ఎస్‌ఓపీ) పాటించాలి.
- చెత్త రాకుండా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ వస్తే తొలగించాలి. సందర్శకులు కూడా చెత్త వేయకుండా చూడాలి.
- చేపలు పట్టేందుకు సరైన పద్ధతి పాటించాలి. ఆ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి.
- గణేష్ నిమజ్జన చెరువుల్లోని నీరు సరస్సులోకి రాకుండా చూసుకోవాలి.
- చుట్టూ చెరువు వివరాలతో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి.
- చెరువును రెవెన్యూ శాఖతో పాటు నీటిపారుదల, ప్రజాపనుల శాఖ సర్వే చేయాలి.
- ఆక్రమణలకు గురికాకుండా సర్వే మ్యాప్‌లో సరస్సుకు 30 మీటర్ల దూరం, కాలువలకు 15 మీటర్ల దూరం గుర్తించాలి. మ్యాప్ ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలి.
- నీటి నాణ్యతను ఒక సంవత్సరం పాటు పర్యవేక్షించాలి. కాలుష్యం పరిమాణాన్ని లెక్కించి ఆ మేరకు రక్షణ చర్యలు చేపట్టాలి.
- కాలుష్య మురుగు నీటిని ఎట్టిపరిస్థితుల్లోనూ చెరువులోకి చేరనీయవద్దు. మురికినీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. వీటి పనితీరును కూడా నిరంతరం పర్యవేక్షించాలి.

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

వచ్చే నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహణ

- 361 కేంద్రాలు 76,575 మంది విద్యార్థులు
- గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి
- ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించొద్దు
- పది పరీక్ష ఏర్పాట్లపై సమీక్షలో కలెక్టర్



పది పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా..ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణ కోసం సుమారు 361 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, అందులో 76,575 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రం వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు జరగకుండా అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల నుండి జవాబు పత్రాలను పకడ్బందీగా తీసుకువెళ్లేందుకు చర్యలు చేపట్టాలని పోస్టల్ శాఖ అధికారులను, పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల రూట్లలో బస్సులను నడుపాలని ఆర్టీసీ అధికారులను సూచించారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. పరీక్షా సమయం కంటే ముందే చేరుకోవాలని, పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి పరీక్షా సమయం కన్నా ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి ఆర్.రోహిణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

సమాజంపై అవగాహన పెంచుకోండి

సమయపాలన పాటిస్తూ విధులు నిర్వర్తించండి
- కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో కొత్వాల్

చార్మినార్: పోలీసు విభాగంలో అడుగుపెట్టే కానిస్టేబుళ్లు సమాజంపై అవగాహన పెంచుకోవాలని, సమయపాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పేట్లబుర్జులోని సీఏఆర్ హెడ్–క్వార్టర్స్‌లో ఆయన కానిస్టేబుళ్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ బ్యాచ్‌లో సైబరాబాద్, రాచకొండ, నిజామాబాద్, సిద్దిపేట కమిషనరేట్లకు ఎంపికైన 268 మంది కానిస్టేబుళ్లతో పాటు డ్రైవర్, మెకానిక్ పోస్టులకు ఎంపికైన 17 మందికి శిక్షణ ఇస్తున్నారు. ఈ బేసిక్ ట్రైనింగ్ తొమ్మిది నెలల పాటు కొనసాగనుంది. కొత్వాల్ మాట్లాడుతూ.. 'ఈ ఉద్యోగాల కోసం లక్షలాది మంది పోటీ పడగా మీరు ఎంపికయ్యారు. దాదాపు 35 ఏళ్ల మీరు సర్వీసులో ఉంటారు. ఈ కాలంలో ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు విధి నిర్వహణలో అనేక సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. అంతర్గతంగా ఎదురయే సమస్యలనూ ఎదురుకోవడానికి, శాంతిభద్రతలను పరిరక్షించడానికి శాయశక్తులా కృషి చేస్తూ వృత్తి ధర్మాన్ని పాటించాలి' అని వ్యాఖ్యానించారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు పని వేళలు ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తారని, అయితే పోలీసులు మాత్రం 24 గంటలూ విధులకు అంకితమై ఉండాలని కొత్వాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను సమయపాలన పాటిస్తూ అంకిత భావంతో నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వంతో పాటు మానసిక శక్తి కోసం ఆరోగ్యం పై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సీపీ వి.సత్యనారాయణ, అదనపు డీసీపీ మద్దిపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ క్రమశిక్షణ పాటించాలి
సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పరేడ్ గ్రౌండ్లో బుధవారం స్టయిపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ (ఎస్‌సీటీపీసీ) బేసిక్ ఇండక్షన్ శిక్షణ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లు పోలీసు శాఖకు వన్నె తెచ్చేలా ప్రవర్తించాలని, స్వీయ క్రమశిక్షణను పాటించాలని సూచించారు. కాగా మొత్తం నాలుగు యూనిట్లకు చెందిన 196 మంది సివిల్ ఎస్‌సీటీపీసీలు సైబరాబాద్‌లోని కమాండ్ ట్రైనింగ్ సెంటర్ లో రిపోర్ట్ చేశారు. వీరికి తొమ్మిది నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయెల్ డేవీస్, డీసీపీ సీటీసీ ప్రిన్సిపల్ ఎల్సీ నాయక్, అదనపు డీసీపీ, వైస్ ప్రిన్సిపల్ సీటీసీ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



సీపీ శ్రీనివాస్‌రెడ్డిని స్వాగతిస్తున్న అధికారులు

ఓటీఎస్ ప్లీజ్!

- ఆస్తిపన్ను బకాయిలపై రాయితీ ఇవ్వండి
- ప్రభుత్వానికి జీహెచ్ఎంసీ లేఖ

సాక్షి, సిటీబ్యూరో: వన్‌టైమ్ సెటిల్మెంట్(ఓటీఎస్)గా ఆస్తి పన్ను బకాయిల పెనాల్టీలపై 90 శాతం రాయితీ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి నివేదించింది. జీహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్నే. త్వరలో ముగియనున్న ఈ ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ. 2100 కోట్లు అయినప్పటికీ, గతనెల 20 వరకు రూ.1269 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆర్థిక కష్టాల్లో ఉంది. నెలనెలా సిబ్బంది జీతభత్యాల చెల్లింపులకే కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో పలు పర్యాయాలు కల్పించిన ఓటీఎస్ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ స్కీమ్ అమల్లోకి వస్తే ఆస్తిపన్ను బకాయిదారులు అసలుతో పాటు బకాయిల వడ్డీలపై కేవలం 10 శాతం పెనాల్టీ చెల్లిస్తే సరిపోతుంది. అది ఎందరికో వెసులుబాటుగా ఉండటమే కాక జీహెచ్ఎంసీ ఆర్థిక కష్టాల నుంచి గెట్టెక్కేందుకూ ఉపకరిస్తుంది. ఈ అంశాన్ని వివరిస్తూ లేఖ రాశారు. పరిశీలనలోకి తీసుకుని ప్రభుత్వం అవకాశం కల్పించగలదని ఆశిస్తున్నారు.

ఆస్తిపన్ను బకాయిలు (వడ్డీలపై పెనాల్టీలతో సహా)..

- 4,95,628 ప్రైవేట్ యజమానుల భవనాలకు సంబంధించి బకాయిలు రూ.1887.59 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో కలిపి అవి రూ.4522.18 కోట్లకు పేరుకు పోయాయి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 1800 భవనాల నుంచి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలు రూ. రూ.1622.16 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో సహ అవి రూ.5281.21 కోట్లకు పేరుకుపోయాయి.
- అన్నీ వెరసి పేరుకు పోయిన మొత్తం బకాయిలు రూ.9803.39 కోట్లు.

స్కూటీని ఢీ కొట్టిన పాల వ్యాన్

ఒకరి మృతి, మరొకరికి గాయాలు


మృతి చెందిన లింగప్ప, గాయపడిన వైష్ణవి

శామీర్‌పేట్: స్కూటీని పాల వ్యాన్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మారేడ్‌పల్లికి చెందిన లింగప్ప (విక్కి) (24), పికెట్‌కు చెందిన స్నేహితురాలు వైష్ణవితో కలిసి స్కూటీపై శామీర్‌పేటలోని కట్ట మైసమ్మ ఆలయానికి వచ్చి తిరిగి వెళుతుండగా శామీర్‌పేట ఆరేంజ్‌బౌల్ సమీపంలో వేగంగా వచ్చిన పాలవ్యాన్ వెనక నుంచి వీరి స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ఇద్దరూ కిందపడ్డారు. పాలవ్యాన్ వెనక చక్రాలు వారి మీదుగా వెళ్లడంతో లింగప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన వైష్ణవిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


జశ్వంత్(ఫైల్)

గచ్చిబౌలి: ఆలస్యంగా ఇంటికి వచ్చినందుకు తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి లోనైన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, రాజుపేట కు చెందిన బానోతు కుమారి కుమారుడు బానోతు జశ్వంత్(17) రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం కాలేజీ నుంచి రెండు గంటలు ఆలస్యంగా రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి లోనైన జశ్వంత్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.వేలల్లో ఇచ్చి రూ.కోట్లల్లో కొట్టేస్తున్నారు!

- గణనీయంగా పెరిగిపోయిన ఇన్వెస్టిమెంట్ మోసాలు
- సైబర్ ఠాణాలో ప్రతి రోజూ కనిష్టంగా 4 కేసులు
- మోసపోతున్న వారిలో చార్టెడ్ అకౌంటెంట్లు సైతం
- అప్రమత్తత అవసరమంటున్న జేసీపీ ఏవీ రంగనాథ్



సాక్షి, సిటీబ్యూరో: 'పిగ్ బుచ్చరింగ్'... తరహాకు చెందిన ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగిపోయాయని నగర సంయుక్త పోలీసు కమిషనర్ (నేరాలు) ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. ఈ స్కామ్స్‌లో మోసపోతున్న వారిలో చార్టెడ్ అకౌంటెంట్లు, ఏళ్లుగా ట్రేడింగ్ చేస్తున్న నిపుణులతో పాటు విద్యాధికులు ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో ప్రతి రోజూ కనిష్ఠంగా నాలుగు కేసులు నమోదు అవుతున్నట్లు తెలిపారు. ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్ జరుగుతున్న విధానం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

అదే పంథా ఇక్కడ అమలు...

మాంసం వ్యాపారులు పంది బక్కపలుచగా ఉన్నప్పుడు దాన్ని వధించరు. కొన్నాళ్లపాటు దానిని మేపడం ద్వారా బలిష్టంగా చేసి ఆపై మాంసంగా మారుస్తారు. పిగ్ బుచ్చరింగ్‌గా పిలిచే ఈ విధానాన్నే ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ చేసే నేరగాళ్లు అనుసరిస్తున్నారు. ట్రేడింగ్ పేరుతో వివిధ రకాలైన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ప్రకటనలు గుప్పిస్తున్న నేరగాళ్లు పలువురిని ఆకర్షిస్తున్నారు. ఇలా తమ వల్లోపడిన వారికి పూర్తి నమ్మకం కలగడం కోసం కొన్ని యాప్స్ డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. వీటి ద్వారా వాట్సాప్, టెలిగ్రామ్ తదితర గ్రూపుల్లో వారికి సభ్యులుగా చేస్తున్నారు. ఆపై ప్రత్యేక లింకుల ద్వారా తమ యాప్స్ టార్గెట్ చేసిన వారి ఫోన్లలో డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. దీని డ్యాష్‌బోర్డ్‌లో సదరు వ్యక్తి ఎంత పెట్టుబడి పెట్టారు? ఎంత లాభం వచ్చింది? మొత్తం ఎంతకు పెరిగింది? తదితరాలు కనిపిస్తూ ఉంటాయి. తొలినాళ్లల్లో వాళ్లు పెట్టిన పెట్టుబడికి రూ.వేలల్లో లాభాలు ఇచ్చి పూర్తిగా నమ్మిస్తారు. ఆపై పెట్టుబడి మొత్తాన్ని రూ.లక్షలు, రూ.కోట్లకు పెంచేలా చేస్తారు.

ఆ గ్రూపుల నిండా 'లాభాలే'...

ఈ ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్‌కు సంబంధించిన యాప్‌ల్లో కొన్ని ప్రముఖ సంస్థల పేర్లతో, వాటి లోగోలతో ఉంటుండటంతో బాధితులు తేలిగ్గా మోసపోతున్నారు.



వీరు సభ్యులుగా ఉండే గ్రూపులకు ప్రీమియం, వీఐపీ లాంటి పేర్లు పెడతారు. వీటిలో అత్యధికులు సైబర్ నేరగాళ్ల అనుచరులే సభ్యులుగా ఉంటారు. వారు ప్రతి రోజూ తనకు ఇంత మొత్తం లాభం వచ్చింది, అంత మొత్తం లాభం వచ్చింది అంటూ కామెంట్స్ పోస్టు చేస్తారు. దీంతో పాటు తమ యాప్స్‌కు సంబంధించి డ్యాష్ బోర్డులు, నగదు తమ ఖాతాల్లో మళ్లినట్లు చూపించే కల్పిత సందేశాలను ఈ గ్రూపుల్లో పొందుపరుస్తారు. ఇవి చూసిన బాధితులు పూర్తిగా నమ్మేస్తారు. అప్పటి నుంచి సైబర్ నేరగాళ్లు వీళ్లు పెట్టే పెట్టుబడులను తమ సొంత ఖాతాల్లో డిపాజిట్ చేయిస్తారు. ప్రతి దశలోనూ భారీ లాభాలు వచ్చాయంటూ సందేశాలు పంపడంతో పాటు యాప్‌ల డ్యాష్ బోర్డుల్లోనూ ఆ మొత్తాన్ని చూపిస్తుంటారు. కొన్ని రోజుల తర్వాత వాటిలోని విత్‌డ్రా ఆప్షన్ డిజేబుల్ చేసేసి బాధితులు తమ నగదు వెనక్కు తీసుకోవడానికి అవకాశం లేకుండా చేస్తారు. అప్పటికే వీరి నుంచి భారీ మొత్తం పెట్టుబడిగా తీసేసుకుని ఉంటారు. దీంతో ఈ మొత్తం అది నష్టపోతామనే ఉద్దేశంతో బాధితులు నేరగాళ్లు చెప్పినట్లు చేయడానికి సిద్ధమవుతారు.

అసలు కథ మొదలెట్టి వీలైనంత...

దీనిని క్యాష్ చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు డ్యాష్‌బోర్డులో కనిపిస్తున్న వర్చువల్ ఖాతాల్లో నగదు డ్రా చేసుకోవాలంటే నిర్ణీత మొత్తం పెట్టుబడి పెట్టాలని మరికొంత డిపాజిట్ చేయించుకుంటారు. చివరకు ఆదాయపు పన్ను, జీఎస్టీ తదతర చెల్లింపుల పేరుతో మిగిలిన మొత్తం కాజేసి... ఆ యాప్, గ్రూపులు పని చేయకుండా చేస్తారు. ఇలా భారీ మొత్తాలు స్వాహా చేస్తున్న ఈ యాప్స్ వెనుక చైనీయులే ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ తరహా కేసుల్లో బాధితుల నుంచి కాజేసిన మొత్తం క్రిప్టో కరెన్సీ, హవాలా రూపంలో దేశం దాటిపోతున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఈ మోసాల నేపథ్యంలో కేవలం సెబీ అనుమతి ఉన్న సంస్థలు, యాప్‌ల ద్వారానే ట్రేడింగ్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. డీమ్యాట్ ఖాతాల ద్వారా మాత్రమే లావాదేవీలు చేయాలని, బ్రోకర్ల సహా ఎవరి వ్యక్తిగత ఖాతాల్లోని నగదు బదిలీ చేయవద్దని స్పష్టం చేస్తున్నారు. అపరిచిత గ్రూపుల్లోని పోస్టులు నమ్మడం, లింకుల ద్వారా వచ్చే యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవడం కూడదని ఆయన పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల ఆటకట్టు



పోలీసుల అదుపులో నిందితులు

వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురి అరెస్ట్

నిజాంపేట్: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను బాలానగర్ ఎస్ఓటీ, బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 6.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఒడిస్సాకు చెందిన రోహిత్ మచ్చా, కూకట్‌పల్లికి చెందిన దుర్గాప్రసాద్, యాప్రాల్‌కు చెందిన పర్‌దీమ్ ఓమేష్ ముఠాగా ఏర్పడి గంజాయి దందా నిర్వహిస్తున్నారు. వీరిలో ఓమేష్ గతంలో కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో గంజాయి కేసులో జైలుకు వెళ్లొచ్చాడు. నిజాంపేట్ పరిధిలోని కూలీలు, కళాశాలల విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని వీరు గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో బాలానగర్ ఎస్ఓటీ, బాచుపల్లి పోలీసులు బుధవారం ముగ్గురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, వారి నుంచి 6.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

చిక్కడపల్లిలో..

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను చిక్కడపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలానగర్‌లోని సంజయ్‌గాంధీనగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఓమర్, అశోక్‌నగర్‌కు చెందిన ఆవుల సాయితరుణ్, రాంనగర్‌కు చెందిన దాసరి శ్రీధర్ గత కొంతకాలంగా గంజాయి విక్రయాలు చేపడుతున్నారు. దీనిపై సమాచారం అందడంతో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించి సయ్యద్ ఓమర్ అవుల సాయితరుణ్, దాసరి శ్రీధర్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.


నిందితులు రోహిత్, దుర్గాప్రసాద్, ఓమేష్

మాతృభాషా ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి

- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు..
- ప్రముఖ కవి అందెశ్రీకి పంపకవి పురస్కారం ప్రదానం

సనత్‌నగర్: మాతృభాష ఔన్నత్యాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. అక్షయాన్ తెలుగు విమెన్ రైటర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ కవి అందెశ్రీకి పంపకవి పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలో 40 శాతం మంది తమ మాతృభాషలో చదవలేకపోతున్నారన్నారు. ఫిబ్రవరి 21న ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నామని, కేవలం వేడుకలకే పరిమితం కాకుండా తెలుగు భాష గొప్పతనాన్ని నేటి యువతకు చేరేలా కవులు, రచయితలు తమ కలాలకు పదునుపెట్టాలన్నారు. లిపిలో కొరియా భాష తర్వాత తెలుగు భాషకు అంత ప్రాధాన్యం ఉందన్నారు. తెలుగు భాషకు అద్భుతమైన వ్యాకరణం ఉందన్నారు. స్వర్గీయ పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో స్పానిష్ దేశానికి చెందిన వారు ఇంటర్వ్యూ చేసేందుకు రాగా వారితో పీవీ ఆంగ్లంలో మాట్లాడగా వారికి ఇంగ్లిష్ రాకపోవడంతో స్పానిష్‌లో ప్రశ్నలు అడిగారన్నారు. పీవీ సైతం స్పానిష్ భాషలో సమాధానాలు చెప్పడంతో వారు పీవీ బహుభాషా పాండిత్యాన్ని కొనియాడారని గుర్తుచేశారు. ప్రభుత్వాలు విద్య, వైద్యం కోసం అధికంగా నిధులు ఖర్చు చేయాలన్నారు. తెలుగులో మంచి రచనలు చేసి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వచ్చే ఏడాది మాతృభాషా దినోత్సవం విదేశాల్లో నిర్వహించి తెలుగు భాష ఖ్యాతిని చాటి చెప్పాలన్నారు.

అందరిదీ తెలంగాణ:
పంపకవి పురస్కార గ్రహీత అందెశ్రీ..

''ఒక్కడు లెక్కలేసుకుంటే తెలంగాణ వచ్చింది కాదని..పురుడు పోసుకున్న పసికూనల నుంచి కాటికి కాలుసాచే వారు పోరాడితే వచ్చిందే తెలంగాణ..అందరిదీ తెలంగాణ..ఐదేళ్లు కాక పోతే పదేళ్లు ఏలుకోండి..ఎల్లకాలం ఏలడానికి ఎవరి తాత జాగీరు కాదు'' అంటూ పంపకవి పురస్కార గ్రహీత అందెశ్రీ అన్నారు. తనకు తన భాష తప్ప మరో భాష రాదన్నారు. ''నా ఊరు తెలంగాణ..నా పేరు తెలంగాణ..నా తల్లి తెలంగాణ..నా నిలువెల్లా తెలంగాణ..నా పాట తెలంగాణ..సై ఆట తెలంగాణ'' అని తనదైన శైలిలో భాషా గొప్పతనాన్ని వివరించారు. నైజామోడికి పైజామా ఊడగొట్టింది..రజాకార్ల మూకలను తరిమికొట్టింది..గడీలకు అగ్గిపెట్టింది..రాజరికానికి ఘోరీ కట్టింది తెలంగాణ అన్నారు. తెలంగాణ అంటే పిడికిలి మట్టి కాదని, పోరాటాల గడ్డ అన్నారు. ఒక్కరి వల్ల తెలంగాణ రాలేదని, గతంలోనే సారుకు చెబితే ఏడేళ్లు నాతో మాట్లాడలేదన్నారు అనంతరం తెలుగు భాషకు సేవ చేసిన వంశీరామరాజు, నేటినిజం దేవదాస్, సరోజ, చెన్నమనేని పద్మజ, సుధామలను సన్మానించారు. కార్యక్రమంలో రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ, అక్షరయాన్ వ్యవస్థాపకురాలు శ్రీలక్ష్మి, ప్రతినిధులు సమ్మెట విజయ, యశోధ, మల్లీశ్వరి, విశ్వైకం, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.


అందెశ్రీ కి అవార్డు అందజేస్తున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు

డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ...

సైబర్ నేరగాళ్ల బెదిరింపులు

- రూ.50లక్షలు వసూలు
- ముంబై సైబర్ క్రైం డీసీపీ పేరుతో స్కైప్ కాల్
- సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

హిమాయత్‌నగర్: ముంబై అంధేరీ నుంచి మీ ఆధార్ కార్డు నంబర్‌తో డ్రగ్స్(మాదక ద్రవ్యాల) సరఫరా చేస్తున్నారని బెదిరించి సైబర్ నేరగాళ్లు భారీ మోసానికి తెగబడ్డారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన వ్యక్తికి ముంబై అంధేరి బ్రాంచ్‌లోని ఫెడెక్స్ ఇంటర్నేషనల్ కొరియర్ సర్వీస్ అధికారినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మీ ఆధార్ నంబర్‌తో ఉన్న కొరియర్‌ను ముంబై కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని, ఆ కొరియర్‌లో మాదక ద్రవ్యాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ తర్వాత ముంబై సైబర్ క్రైం డీసీపీ పేరుతో స్కైప్ కాల్ చేసిన వ్యక్తి తాను పోలీసు అధికారినని నమ్మించేందుకు ఐడీ కార్డును సైతం చూపించారు. మీ ఆధార్ కార్డు ద్వారా మనీలాండరింగ్, ఉగ్రవాద కార్యకలాపాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరుగుతున్నాయని భయపెట్టాడు. మీ బ్యాంక్ ఖాతాలను తనిఖీ చేయాలని, ఇందుకోసం ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.50లక్షలు డిపాజిట్ చేయాలని చెప్పారు. బాధితుడు బ్యాంకు ఖాతాల వివరాలతో పాటు రూ.50లక్షలు డిపాజిట్ చేశాడు. ఆ తర్వాత వారు స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుపడాలి

– కార్పొరేటర్ల నుంచి ఫిర్యాదులు రావొద్దు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలో చెత్త సమస్యలు తదితరమైన వాటిపై జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో కమిషనర్ రోనాల్డ్‌రాస్ సంబంధిత అధికారులు, నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేస్తున్న రాంకీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పారిశుద్ధ్యం మెరుగుపడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ప్రాథమిక దశలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నందున ఇకపై వాటికి తావు లేకుండా డీసీలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంలో స్థానిక కార్పొరేటర్ల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులు లక్ష్యం మేరకు చెత్త సేకరించని పక్షంలో చర్యలు తీసుకోవాలన్నారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మాల్స్, హోటల్స్, ఫంక్షన్ హాళ్ల వద్ద వ్యర్థాలను సకాలంలో తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బస్తీస్థాయిలో చెత్త సేకరణకు అవసరమైన ప్రాంతాల్లో రిక్షాలు అందజేయాలని సూచించారు. స్వీపింగ్ మెషీన్లు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో నిఘా పెట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డిప్యూటీ కమిషనర్లు ఎస్ఎఫ్ఏలతో మాట్లాడేందుకు వైర్‌లెస్ సెట్లు వినియోగించాలన్నారు. చురుగ్గా పనిచేసే కార్మికులకు బహుమతులివ్వాలని సూచించారు. జోనల్, డిప్యూటీ కమిషనర్లు ఉదయం 5:45 గంటల్లోగా రోడ్ల వెంబడి చెత్త నిల్వ ప్రదేశాలను పరిశీలించాలన్నారు. ప్రధాన రహదారులపై ఉదయం 7 గంటల వరకు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, 8 గంటలకు జోనల్ కమిషనర్లు పరిశీలించాలని ఆదేశించారు.

చెరువులను పరిరక్షించాలి

చెరువులు అన్యాక్రాంతం కాకుండా జోనల్, డిప్యూటీ కమిషనర్లు తమ పరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఆకస్మిక పర్యటనలు నిర్వహించాలని సూచించారు. చెరువుల పరిరక్షణకు స్థానికంగా కమిటీలు ఏర్పాటు చేసుకుని ప్రతిరోజూ సంప్రదింపుల కోసం వాట్సాప్ గ్రూప్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెరువులవద్ద సీసీటీవీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, జోనల్ కమిషనర్లు, రాంకీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్

విభిన్న కళల సంగమం

- విశిష్టమైన హస్త కళలకు వేదికగా నగర సీసీటీ...
- వివిధ రాష్ట్రాల కళాకారులకు క్యూరేషన్‌లో శిక్షణ..
- ప్రతి సంస్కృతిలో ఒక కళ ఇమిడి ఉంది..: రమా రాజమౌళి



సాక్షి, సిటీ బ్యూరో: సంస్కృతుల సంగమంతో ఎన్నో కుటీర పరిశ్రమలుగా వెలుగొందిన విభిన్న హస్తకళల పునర్వైభవానికి ఇటీవల ఆదరణ పెరిగింది. ఈ నేపథ్యంలో కళాత్మకతను సామాజికంగా చేరువ చేయడానికి టైటాన్ ఆధ్వర్యంలో క్రియేటివ్ డిగ్నిటీ సహకారంతో 'ప్రాజెక్ట్ తరాషా'ను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న విభిన్న హస్తకళలను, పర్యావరణహిత కళాకృతులను నగరంలోని బంజారాహిల్స్ సీసీటీ (క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ)వేదికగా ప్రదర్శిస్తుంది. ప్రముఖ దర్శకులు రాజమౌళి సతీమణి ప్రముఖ క్యాస్టూమ్ డిజైనర్ రమా రాజమౌళి బుధవారం ఆవిష్కరించిన ఈ కళాకృతుల సంగమం ఈ నెల 24 వరకు కొనసాగనుంది. టైటాన్, క్రియేటివ్ డిగ్నిటీ ఆధ్వర్యంలో విశిష్ట కళల నైపుణ్యకారులకు ఎలాంటి కమీషన్లు, పార్టిసిపేషన్ ఫీజులు లేకుండా ప్రీ-ఎగ్జిబిషన్ ట్రైనింగ్, ప్రొడక్ట్ క్యూరేషన్, జాతీయ స్థాయి మార్కెట్ ఎంగేజ్‌మెంట్ తదితర అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా క్రియేటివ్ డిగ్నిటీ నిర్వాహకురాలు లత మాట్లాడుతూ., ప్రస్తుత ఆధునిక కాలానికి అనుగుణంగా కళాకారులు వారి ఉత్పత్తులను డిజిటల్ వేదికగా, సోషల్ మీడియాలో వినూత్న ప్రచారం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని, ఈ కళలను ఆదరించే ఔత్సాహికులను చేరుకోవడానికి వారధిలా ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు.!!

పౌష్టికాహారంపై అవగాహన



మాస్టర్ చెఫ్ కార్యక్రమంలో బర్డ్స్ అండ్ బ్లూమ్స్ చిన్నారులు

శ్రీనగర్‌కాలనీ: జంక్‌ఫుడ్‌ను తినకూడదని, ప్రొటీన్, న్యూట్రిషన్ ఫుడ్‌నే తినాలని తెలుపుతూ చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఆహూతులను ఆలోచింపజేశాయి. బుధవారం రాజీవ్‌నగర్ కాలనీలోని బర్డ్స్ అండ్ బ్లూమ్స్ చిన్నారులు మాస్టర్ చెఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూట్రిషన్ ఫుడ్ విశిష్టలను తెలుపుతూ ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలో వివరించారు. చిన్నతనం నుంచే న్యూట్రిషన్ ఫుడ్‌పట్ల మరింత ఆసక్తి పెంచడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్, ప్రిన్సిపాల్ శాంతికుమారి తెలిపారు.

వట్టికోట రచనలతో ప్రజా చైతన్యం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

బంజారాహిల్స్: తెలంగాణ ప్రజా సాహిత్యకులు, గ్రంథాలయోద్యమ నాయకుడు, రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతిని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో బుధవారం స్మారకోపన్యాసం జరిగింది. ప్రముఖ జర్నలిస్ట్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని 'వట్టికోట ఆళ్వార్‌స్వామి–గ్రంథాలయోద్యమం' అనే అంశంపై ప్రసంగించారు. తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయోద్యమాన్ని నడిపించి ప్రజలను తన అక్షరానికి పదునుపెట్టడం ద్వారా చైతన్య పరిచారన్నారు. తెలంగాణ జాగృతి కోసం తెలంగాణ మట్టిగడ్డపై పోరు విత్తనాలు జల్లి ఉద్యమ సుమాలను పూయించిన సాహిత్య ఉద్యమ రైతు వట్టికోట అని కీర్తించారు. నవ తెలంగాణ నిర్మాణానికి సాంస్కృతిక పునాదులు వేసిన కవి, కార్మిక వైతాళికుడు, వలసవాదం, భూసామ్యం కింద నలుగుతున్న తెలంగాణను విముక్తి చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించిన నవయుగ వైతాళికుడిగా ఆయన గుర్తింపు పొందారన్నారు. విజ్ఞానానికి విలువ కట్టని సమాజం వృద్ధి చెందదని భావించి హైదరాబాద్‌లో దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించారని పేర్కొన్నారు. తెలంగాణ భాషకు యాసకు పెద్దపీట వేసిన సాహిత్య మేరు నగధీరుడు అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సీతారామారావు మాట్లాడుతూ... తెలంగాణ సాహితీ సరస్వతి కన్న మరో అక్షరం వట్టికోట ఆళ్వారుస్వామి అని అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఏవీఆర్ఎన్ రెడ్డి, సామాజిక శాస్త్రాల డీన్ వడ్డాణం శ్రీనివాస్, విశ్వవిద్యాలయ లైబ్రరీ ఇన్‌చార్జి రజని, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

హోంగార్డుపై దాడి: వ్యక్తి రిమాండ్

వెంగళరావునగర్: హోంగార్డుపై దాడి చేసిన వ్యక్తిని మధురానగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ... సోమవారం రాత్రి అమీర్‌పేట చౌరస్తాలో ఎస్ఆర్ నగర్ లా అండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులను చెక్ చేశారు. వారిలో డ్రైవింగ్ చేస్తున్న నరేష్ అనే యువకుడు మద్యం సేవించి ఉండగా అతనిపై కేసు పెట్టి వాహనాన్ని సీజ్ చేశారు. వెనుక కూర్చున్న అతని స్నేహితుడు ప్రవీణ్ ద్విచక్ర వాహనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అది సీజ్ చేశామని, కోర్టుకు వచ్చి తీసుకోవాలని పోలీసులు సూచించారు. దాంతో ప్రవీణ్ హడావుడి చేసి అక్కడ విధులు నిర్వహిస్తున్న కుమార్ అనే హోంగార్డుపై దాడికి పాల్పడ్డాడు. మధురానగర్ పోలీసులు అతనిని అదుపులోనికి తీసుకున్నారు. 14 ఏసీఎంఎం న్యాయమూర్తి కన్నయ్యలాల్ నిందితుడికి రిమాండ్ విధించారు.

ఆన్‌లైన్‌లో సట్టా ఆడుతున్న వ్యక్తి అరెస్టు

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో సట్టా ఆడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌కు చెందిన ఓ పండ్ల వ్యాపారి తరచూ రహమత్‌నగర్ చౌరస్తాలో సట్టా నిర్వహిస్తున్నాడు. పండ్ల వ్యాపారంతోపాటు రహస్యంగా దీనిని నిర్వహిస్తున్నట్లుగా తెలుసుకున్న కొందరు పోలీసులకు సమాచారం అందించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతనిని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న రూ. 8 వేలను స్వాధీనం చేసుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చట్టసభల్లో బీసీల వాటా కోసం 1 నుంచి మహా పాదయాత్ర



నరేందర్ గౌడ్

కాచిగూడ: చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం మార్చి 1వ తేదీ నుంచి మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ తెలిపారు. పండుగ సాయన్న ముదిరాజ్ స్వగ్రామం మీర్జాన్‌పల్లె నుంచి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కోట ఖిలాషాపూర్ వరకు పాదయాత్ర జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర బీసీ కుల జనగణన బిల్లు పెట్టడం తెలంగాణ బీసీ సమాజం పోరాట విజయమని ఆయన అన్నారు. ఏదైనా రాష్ట్రంలో ఆయా ప్రభుత్వాలు బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం ప్రయత్నిస్తే వెంటనే సంఘ్ పరివార్ శక్తులు కోర్టులో కేసులు వేస్తుంటాయని, దీంతో జనాభా లెక్కలు లేకుండానే రిజర్వేషన్లు ఎలా పెంచుతారని కోర్టులు మోకాలడ్డుతాయని పేర్కొన్నారు. మరోవైపు కేంద్రం కుల జనగణన చేయనంటోందని, కేంద్రం, సుప్రీం కోర్టు మధ్య ఓబీసీల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలాగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల హక్కుల సాధనకై.. చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం జరిగే మహా పాదయాత్రలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.

నియామకం

కాచిగూడ: తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరాల గౌతమ్‌కుమార్‌ను నియమిస్తూ అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి నియామకపు పత్రాన్ని అందజేశారు. బుధవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కందగట్ల స్వామితో కలిసి గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ... పద్మశాలి యువతను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సరఫరాపై సమీక్ష

- సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించాలి
- అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- ప్రజల ఫోన్‌కాల్స్‌కు వెంటనే అటెండ్ కావాలి
- సమీక్షా సమావేశంలో ఎస్ఈ చంద్రశేఖర్



హాజరైన సిబ్బంది

బంజారాహిల్స్: వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వేసవి కార్యాచరణ ప్రణాళికను రూపొందించిన విద్యుత్ శాఖ అధికారులు ఆ మేరకు సమస్యలు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకునే క్రమంలో బంజారాహిల్స్ టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్ అధ్యక్షతన బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

- డీఈ నరేందర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ ఏడీఈ మల్లేశం, బంజారాహిల్స్ ఏడీఈ హైమానంద, అమీర్‌పేట ఏడీఈ ప్రేమ్‌కుమార్, సెంట్రల్ బ్రేక్ డౌన్ (సీబీడీ) ఏడీఈ శ్రీనివాస్, యూసుఫ్‌గూడ ఏడీఈ జాన్‌పీటర్, బంజారాహిల్స్ ఏడీఈ రమేష్‌కుమార్, ఫిలింనగర్ ఏఈ లక్ష్మణ్, జూబ్లీహిల్స్ ఏఈ ప్రవీణ్, మాదాపూర్ ఏఈ ఆంజనేయులు, అమీర్‌పేట ఏఈ సాంబశివరావు, ఎస్కే నగర్ ఏఈ తిరుపతిరావు, సీబీడీ ఏఈలు సాయికుమార్, సుధీర్‌కుమార్, మహమూద్, వేణుమాధవ్‌లతో పాటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, వెంకటేశ్వరకాలనీ, ఫిలింనగర్, శ్రీనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, శ్రీకృష్ణదేవరాయనగర్, శ్రీకృష్ణానగర్, కమలాపురికాలనీ తదితర ప్రాంతాలకు చెందిన 70 మంది ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు.
- ఈ సందర్భంగా విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులతో పాటు సిబ్బంది పర్యవేక్షణ నిరంతరంగా కొనసాగాలని, ఏమాత్రం అలసత్వం వహించవద్దని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సకాలంలో స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఈ వేసవికాలం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు, తగిన ప్రణాళికలు రూపొందించుకుని 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి దృష్ట్యా కరెంటు సరఫరాలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఏఈలపై ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు, సమాచారం అందించినప్పుడు వెంటనే స్పందించాలన్నారు.



అధికారులతో సమావేశమైన టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే...

ఎస్ఈ చంద్రశేఖర్:	94408 12826
డీఈ నరేందర్‌రెడ్డి:	94408 12828
ఏడీఈ బంజారాహిల్స్, హైమానంద:	94408 12840
ఏడీఈ అమీర్‌పేట, ప్రేమ్‌కుమార్:	94408 12843
ఏడీఈ జూబ్లీహిల్స్, మల్లేశం:	83329 47016
ఏడీఈ సీబీడీ, శ్రీనివాస్:	94408 12854
ఏఈ బంజారాహిల్స్ రమేష్‌కుమార్:	94408 12860
ఏఈ ఫిల్మ్‌నగర్ లక్ష్మణ్:	94408 12872
ఏఈ జూబ్లీహిల్స్ ప్రవీణ్:	94408 12871
ఏఈ మాదాపూర్ ఆంజనేయుడు:	83339 56153
ఏఈ ఎస్కేనగర్ తిరుపతిరావు:	94408 12859
ఏఈ అమీర్‌పేట సాంబశివరావు:	94408 12862
ఏఈ యూసుఫ్‌గూడ జాన్‌పీటర్:	94408 12886
ఫ్యూజ్ ఆఫ్ కాల్ బంజారాహిల్స్:	94906 19700
ఫ్యూజ్ ఆఫ్ కాల్ మినిస్టర్ క్వార్టర్స్:	83339 23731
ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫిలింనగర్:	94906 19704
ఫ్యూజ్ ఆఫ్ కాల్ అమీర్‌పేట:	83339 23728
ఫ్యూజ్ ఆఫ్ కాల్ యూసుఫ్‌గూడ:	94906 19708
ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఎస్కేనగర్:	94906 19710
ఫ్యూజ్ ఆఫ్ కాల్ జూబ్లీహిల్స్:	94906 19702
ఫ్యూజ్ ఆఫ్ కాల్ మాదాపూర్:	94906 19706

ఈజీ మనీకి ఆశపడొద్దు

- సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన
- సైబర్ నేరాగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం పోలీసులు

హిమాయత్‌నగర్: రోజు రోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. అమాయక ప్రజల నుంచి లక్షలు, కోట్ల రూపాయలను కేటుగాళ్లు కాజేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ కారణంగా బాధితులు సైబర్ వలలో పడుతున్నారు. తాజాగా సైబర్ నేరాలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఐ భవానీల ఆధ్వర్యంలో నారాయణగూడలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నకిలీ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలు, పార్ట్‌టైమ్ జాబ్ మోసాలతో పాటు ఇతర సైబర్ క్రైమ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు ఈ తరహా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేటుగాళ్లు మాయమాటల ద్వారా పంపించే సందేశాలను నమ్మవద్దని చెప్పారు. కొన్ని కేసులలో తమ అనుభవాలను విద్యార్థులుకు తెలియజేశారు. ప్రధానంగా స్టాక్ మార్కెట్‌లో సెబి అనుమతి ఉన్న యాప్‌లలో కాకుండి ఇతర యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టవద్దని, దీంతో పాటు స్టాక్ బ్రోకర్ వారి అధికారిక అకౌంట్లలో మాత్రమే డబ్బు స్వీకరిస్తారని, తమ పెట్టుబడులను వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయవద్దని, గూగుల్ ప్లే, వారి సొంత వెబ్‌సైట్‌ల నుంచి డౌన్ లోడ్ చేస్తున్నప్పుడు ఆయా అప్లికేషన్‌లు ఒకసారి నిర్ధారించుకోవాలని, తమ తమ డీమ్యాట్ ఖాతా ఆధారాలను తెలియని వ్యక్తులతో ఎప్పుడూ పంచుకోవద్దని, గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియాలలో వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రాంలలో నకిలీ సంభాషణలను నమ్మవద్దని, వారు పంపిచే ఆకర్షణీయమైన ప్రకటనలతో కష్టపడి సంపాదించిన డబ్బును గుడ్డిగా పెట్టుబడి పెట్టవద్దనే పలు అంశాలపై విద్యార్థుకు సమగ్రమైన అవగాహన కల్పించారు.

పుస్తక పఠనంతో ఉజ్వల భవిత



కశ్యప్‌ను సత్కరిస్తున్న పద్మజ

చిక్కడపల్లి: పుస్తకాలు చదవడంతో ఉద్యోగాలు సాధించారని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల ప్రకటించిన స్కూల్ లైబ్రేరియన్ పరీక్షల ఫలితాల్లో నగర కేంద్ర గ్రంథాలయ సంస్థలో చదివిన విద్యార్థి జి.కశ్యప్ గురుకుల స్కూల్ లైబ్రేరియన్‌గా ఉద్యోగం వచ్చినందుకు బుధవారం గ్రంథాలయం ఆవరణలో ఆమె ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ... అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు చదివి ఉద్యోగాలు అనేక మంది పొందారని అన్నారు నగర కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు చదివి ఉద్యోగం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినీవిద్యార్థులు ఇదే విధంగా ఏకాగ్రతతో, అంకిత భావంతో చదవి పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయం గ్రేడ్–1 లైబ్రేరియన్ మదన్మోహన్, గ్రేడ్–2 లైబ్రేరియన్ వెంకటేశ్వర్‌రెడ్డి, అవినాష్, వెంకటేష్ యాదవ్, కష్ణారెడ్డి, సుకేష్‌కుమార్, రాంమోహన్, నరేంద్ర, విద్యార్థి నేత డి.సలీం తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

చిక్కడపల్లి: వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని దోమలగూడ పోలీసులు అరెస్టు చేశారు. వరుస బైక్ దొంగల వివరాలను ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మహ్మద్ సమీర్(20),అల్తాఫ్(20), మహ్మద్ ఒమెస్ (42), శేఖర్ చింతకాయల (36)లు దోమలగూడలోని ఏజీఎస్ బైక్ సర్వీస్ పాయింట్ అప్పర్ ట్యాంక్ బండ్ గ్యారేజీ తాళాలు పగులగొట్టి బైకులను దొంగలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు డీఐ ఎం.వరప్రసాద్, ఎస్ఐ ఎస్.శ్రీగిరి శ్రీకాంత్, క్రైం బృందం ఖలీల్, వంశీ, ఉదయ్‌లు విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నలుగురుని పట్టుకొని విచారించగా దోమాలగూడ పీఎస్ పరిధిలో ఐదు బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించినట్లు ఆయన చెప్పారు. దొంగతనం చేసిన వాహనాల విడిభాగాలను స్క్రాబ్ చేసి అమ్మే వారని వీటి విలువ రూ. 2 లక్షల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నలుగురు దొంగలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ

లిబర్టీ: భారతీయ ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం పలువురు పేదలకు సమితి జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎన్.శర్మ దుస్తులను పంపిణీ చేశారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు దయనీయ జీవితాలు వెల్లదీస్తున్నపేదలకు, కూలీలకు, నిరుపేదలకు, అభాగ్యులకు దుస్తులు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు.

బీసీ శక్తి రాజకీయ శక్తిగా మారాలి

కాచిగూడ: బీసీ శక్తి రాజకీయ శక్తిగా మారి అన్ని వర్గాలను కలుపుకుని రాబోయే రోజుల్లో అధికారం చేపట్టాలని తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం అధ్యక్షుడు కొవ్వూరు భాస్కర్ రావు పిలుపునిచ్చారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం కార్యనిర్వహక అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వి మహేందర్ కుమార్, ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం కొవ్వూరు భాస్కర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కొవ్వూరు భాస్కర్ రావు నేతృత్వంలో త్వరలోనే రాజకీయాలకతీతంగా బీసీ ప్రముఖులందరిని ఒకే వేదికపైన ఘనంగా సత్కరించి బీసీల సత్తా చాటేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జనగణన చేపట్టేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేయడం హర్షించదగిన పరిణామమని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం సీట్లు కేటాయించాలని, బీసీ వర్గాలను గుర్తించి సీట్లు కేటాయించిన పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. బీసీ సంఘాల నేతలు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 53, పచ్చకాకర 48, పందిరి బీర 45, క్యాబేజీ 28, క్యారెట్ 28, దొండ 35, గుండు బీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 19, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 21, చామగడ్డ 50, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఓయూలో జాతీయస్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వచ్చే నెల 27, 28 తేదీలలో జాతీయ స్థాయిలో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలను నిర్వహించనున్నారు. బుధవారం ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ఫిల్మ్ ఫెస్టివల్ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జాష్న్–ఏ–సైన్మా పేరుతో జరిగే షార్ట్స్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలలో దేశ వ్యాప్తంగా డిగ్రీ, పీజీ, విద్యార్థులతో పాటు పీహెచ్‌డీ విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని జర్నలిజం విభాగం హెడ్ ప్రొ.సతీష్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

మేడారంలో ఉచిత వైద్య శిబిరం

- భారీగా తరలిన అంబులెన్స్, వైద్య సామగ్రితో కూడిన వాహనాలు
- వైద్యులు, పారామెడికల్ సిబ్బంది సైతం పయనం
- జెండా ఊపి ప్రారంభించిన ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలత కొంపెల్ల



అంబులెన్స్‌లు, సామగ్రి వాహనాలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మాధవీలత

బంజారాహిల్స్: తెలంగాణలో అతిపెద్ద గిరిజన పండుగ మేడారం జాతరలో లతామా ఫౌండేషన్, విరించి హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందించేందుకు పెద్ద సంఖ్యలో పారామెడికల్ సిబ్బంది, వైద్యులు తరలివెళ్లారు. వారితో పాటు నాలుగు అంబులెన్స్‌లు, మందులను తరలించారు. బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సామగ్రితో కూడిన వాహనాలు, అంబులెన్స్‌లకు లతామా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలత కొంపెల్ల జెండా ఊపి జాతరలోని వైద్య శిబిరానికి పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విరించి హాస్పటల్ సహకారంతో లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో వైద్య శిబిరాలను నిర్వహించిందన్నారు. కేవలం మెడికల్ క్యాంప్‌ల నిర్వహణే కాకుండా అవసరమైన వారికి వైద్య సహాయం కూడా లతామా ఫౌండేషన్ ద్వారా అందిస్తోందని వివరించారు. లక్షలాది మంది తెలంగాణవాసులు హాజరయ్యే మేడారం జాతరలో బీజేపీ మెడికల్ సెల్ నిర్వహిస్తోన్న ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌లో సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే నాలుగు రోజుల పాటు అక్కడి క్యాంప్‌లో తమ సిబ్బంది, అంబులెన్స్‌లు సేవలు అందుతాయని తెలిపారు.

సందడిగా శ్రీసరస్వతీ విద్యామందిర్ వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

బంజారాహిల్స్: వెంకటరమణ కాలనీలోని శ్రీసరస్వతీ విద్యామందిర్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేశభక్తిని తట్టిలేపేలా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ప్రాచీన యోగా విశిష్టతను యోగాసనాల ద్వారా చాటిచెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగచాప్, ఘోష్, తిష్ట వ్యాయామం, పిరమిడ్స్, రామాయణ రూపకం, పుణ్య భూమి నా దేశం నృత్యం, జొన్నలబండి జానపద నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రీ ప్రైమరీ విద్యార్థులు తాము సైతం అంటూ నిర్వహించిన ప్రదర్శనలు కనువిందుచేశాయి. సమితి అధ్యక్షుడు వేదాల భాస్కర్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు గ్రీన్ రిచ్ ఎస్టేట్స్ ఎండీ తీగల నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు సందేశాన్ని వినిపించారు. విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, వెలగపూడి సుధాకర్‌రావు, బెల్డి శ్రీధర్, పతకమూరి శ్రీనివాసరావు, పరమానంద బన్సల్, బాలకృష్ణారెడ్డి, రామనాథం, అనఘా వెంకటలక్ష్మీ, కొత్తపల్లి ఉమ, సాయినాథ్, గంగాధర్, వజ్రలింగం, ఆనంద్, వెంకట గోపాలకృష్ణ, హరికిషోర్, కృష్ణారెడ్డి, సూర్యనారాయణమూర్తి, దీప్‌చందన్, సంగమేశ్వర్, తంగెళ్లపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను ఘనంగా సత్కరించారు.

పేదల కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తాం



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రామన్‌గౌడ్

హిమాయత్‌నగర్: డివిజన్‌లోని అన్ని బస్తీలలో పేదలకు ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రామన్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని బుధవారం మెల్కొటే పార్క్‌లో కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ క్యాంప్‌ను రామన్‌గౌడ్ ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వివిధ టెస్టులను చేసి, వారికి సంబంధించిన రిపోర్ట్‌ని అందజేశారు. అనంతరం వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ తరహా ఉచిత ఆరోగ్య శిబిరాలను రానున్న రోజుల్లో డివిజన్‌లోని పేదల ప్రజల కోసం అన్ని బస్తీలలో ఏర్పాటు చేస్తామని రామన్ గౌడ్ అన్నారు. డాక్టర్ అనురాగ్ మెల్కొటే పార్క్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూషణ్‌రావు, 180 మంది వాకర్స్ పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని తిప్పికొట్టాలి: సీపీఎం



మాట్లాడుతున్న వీరయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మార్క్స్ ఇజం, లెనినిజం ప్రపంచానికి మార్గం చూపుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. దేశంలో నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా మార్క్స్ ఇజం, లెనినిజాన్ని అనువదించుకోవాలన్నారు. దేశంలో విస్తరిస్తున్న మతోన్మాదాన్ని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. లెనిన్ ఓ విప్లవాయుధం పుస్తకంపై సామూహిక పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ... రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలవకుండా చేయాలని అందుకోసం లెనినిస్టు విప్లవ ఎత్తుగడలను అనుసరించాలని సూచించారు. లెనిన్ ప్రతిపాదించిన సిద్ధాంతం, సాధించిన విజయాలు, ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో పార్టీ పునాది బలహీనపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మతం మీద కాకుండా మత విశ్వాసాల మూలాల మీద పోరాడాలని సూచించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఆనందచారి, సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మహేందర్, టి.స్కైల్యాబ్‌బాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఓపెన్ జిమ్ పనుల పర్యవేక్షణ

కాచిగూడ: నింబోలిఅడ్డ మెయిన్ రోడ్డులో ఉన్న సమోస పార్కులో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పనులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ బుధవారం పర్యవేక్షించారు. అనంతరం రహమత్‌బాగ్ బస్తీలో పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నేతలు శ్రీకాంత్, నిఖిల్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ ఆర్థిక నేరస్తుడే

'మార్గదర్శి' పేరిట రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం ● ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ

నల్ల గురివింద
రామోజీ-1

- అవి అక్రమ డిపాజిట్లేనని సుప్రీంకోర్టులో ఆర్‌బీఐ వెల్లడి
- 2006 నాటికే రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు
- కేసులు విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్లు
- ఆ ముసుగులో భారీగా నల్లధనం దందా
- రామోజీ అక్రమాలకు చెక్ పెట్టిన నాటి వైఎస్సార్ ప్రభుత్వం
- అక్రమ డిపాజిట్లు తిరిగి చెల్లించేశామంటూ రాజగురువు బుకాయింపు
- ఎవరి నుంచి సేకరించారు.. ఎవరికి చెల్లించారో మాత్రం చెప్పరట
- నగదు రూపంలో డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమన్న ఐటీ శాఖ
- ఆర్‌బీఐ స్టేట్‌మెంట్ నేపథ్యంలో రామోజీకి శిక్షపై సర్వత్రా చర్చ

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'పేరిట ఏళ్ల తరబడి సాగించిన అక్రమ డిపాజిట్ల వసూళ్లు.. నల్లధనం దందాపై 2006లో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఎట్టకేలకు ఫలించాయి. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు అక్రమ డిపాజిట్లు వసూలు చేశారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సుప్రీంకోర్టుకు విస్పష్టంగా నివేదించింది. దాంతో రామోజీ అవినీతి ఆట కట్టిందని, ఇక శిక్ష పడటమే మిగిలిందని నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండేళ్ల నుంచి గరిష్ఠంగా యావజ్జీవ జైలు శిక్ష పడే అవకాశం ఉందని కూడా చెబుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. దాంతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు సాగించిన ఆర్థిక అక్రమాల కథా కమామిషు మరోసారి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2006లో అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే వరకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'అనే సంస్థ ఉన్నట్టు కూడా సామాన్యులకు తెలియదు. రాష్ట్రం అంతటా 'మార్గదర్శి చిట్ ఫండ్స్'కార్యాలయాలే కనిపిస్తూ ఉండేవి. కానీ ఆ కార్యాలయాల్లోనే గుట్టు చప్పుడు కాకుండా 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'పేరిట మరో కంపెనీ ఆర్థిక కార్యకలాపాలు సాగించేదనే విషయం బయటి ప్రపంచానికి తెలీదు. అలా 1997 నుంచి 2006 వరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ యథేచ్ఛగా కార్యకలాపాలు సాగించింది.

భారీగా అక్రమ డిపాజిట్లు సేకరణ

ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా రామోజీరావు మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు. డిపాజిట్ల సేకరణ పేరిట ప్రజలను మోసం చేయకుండా కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ స్పష్టమైన విధివిధానాలను నిర్దేశించింది. ఆర్‌బీఐ చట్టంలోని 45ఎస్ ప్రకారం కంపెనీల చట్టం ప్రకారం నమోదైన ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. రామోజీరావు తన గ్రూపు సంస్థలను 'హిందూ అవిభాజ్య కుటుంబం(హెచ్‌యూఎఫ్) కింద నమోదు చేసినట్టుగా పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ కింద నమోదైన కంపెనీలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. కానీ చట్టానికి తాను అతీతం అని భావించే రామోజీ ఈ నిబంధనను నిర్భీతిగా బేఖాతరు చేశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట యథేచ్ఛగా డిపాజిట్లు వసూలు చేశారు. 2006లో మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చే నాటికి ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లను సేకరించడం విభ్రాంతికర వాస్తవం. కాగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కేసు న్యాయస్థానంలో విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్ల వరకు అక్రమ డిపాజిట్లు సేకరించారని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీంకోర్టుకు నివేదించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

> ఈనాడు పత్రికాధిపతి చెరుకూరి రామోజీరావు ఆర్థిక నేరస్తుడే అన్నది నిగ్గు తేలింది. టీడీపీ అధినేత చంద్రబాబు రాజగురువు రామోజీ ఆర్థిక ఉగ్రవాదేనన్నది స్పష్టమైంది. 'మార్గదర్శి' ముసుగులో భారీగా నల్లధనం దందా నిర్వహిస్తున్నారన్నదీ రూఢీ అయ్యింది. అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు తొడుక్కున్న 'పత్రికా స్వేచ్ఛ' అనే ముసుగు తొలగిపోయింది. చట్టాలను ఉల్లంఘిస్తూ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ రామోజీ నిజరూపంలో అవినీతి దిగంబరుడిగా నిలబడ్డాడు.

> మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్లు వసూలు చేసిందని ఆర్‌బీఐ స్పష్టం చేయడంతో ఈ కేసులో తరువాత పరిణామాలు ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. అక్రమ డిపాజిట్ల కేసు నిరూపితమైతే ఏకంగా రెట్టింపు జరిమానా అంటే రూ.5,200 కోట్ల జరిమానాతోపాటు కనీసం రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలుశిక్ష విధించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు.



తప్పు ఒప్పుకోక తప్పని రామోజీ

మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల దందా బయటపడటంతో రామోజీరావు కంగుతిన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు రంగాచారిని విచారణ అధికారిగా నియమించింది. ఈ అక్రమాలపై సీఐడీ తరపున న్యాయ స్థానాల్లో కేసులు దాఖలు చేసేందుకు టి.కృష్ణంరాజును అధీకృత అధికారిగా నియమించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు వీరు గుర్తించారు. కాగా తాము చట్టాన్ని ఉల్లంఘించలేదని బుకాయించేందుకు రామోజీ యత్నించారు. హెచ్‌యూఎఫ్‌గా తాము ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించవచ్చని అడ్డగోలుగా వాదించారు. కానీ సెక్షన్ 45 ఎస్ ప్రకారం హెచ్‌యూఎఫ్‌లు డిపాజిట్లు సేకరించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దాంతో తాము తప్పు చేసినట్టు రామోజీరావు అంగీకరించారు. నగదు రూపంలో డిపాజిట్లు వసూలు చేసినట్టు కూడా సమ్మతించారు. తమ తప్పును అంగీకరిస్తూ డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్లను తిరిగి చెల్లించేస్తామని, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను మూసి వేస్తామని న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా తెలిపారు.

వివరాలు చెప్పం అని వితండవాదం

తాము అక్రమంగా వసూలు చేసిన డిపాజిట్లను సంబంధిత డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని రామోజీరావు న్యాయస్థానానికి తెలిపారు. కాగా అక్రమ డిపాజిట్లు ఎవరెవరి నుంచి సేకరించారు.. ఎవరెవరికి తిరిగి చెల్లించారో ఆ వివరాలు వెల్లడించాలని సీఐడీ, ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరినప్పటికీ రామోజీరావు సమ్మతించ లేదు. ఆ వివరాలు తాము వెల్లడించాల్సిన అవసరం లేదని వితండ వాదం చేశారు. కాగా అక్రమంగా డిపాజిట్లు వసూలు చేసిన రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలని అధీకృత అధికారి కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉమ్మడి హైకోర్టు తన చివరి పని దినాన కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ.. డిపాజిట్దారుల వివరాలు వెల్లడించాలని కోరుతూ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం 2022లో ఇంప్లీడ్ అయ్యింది. డిపాజిట్‌దారుల వివరాలు వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు గత ఏడాది పేర్కొంది. కానీ ఇంత వరకు రామోజీరావు తమ డిపాజిట్‌దారుల వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం.

నల్లధనం దందా వల్లే గప్‌చుప్

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించిన 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'ముసుగులో రామోజీరావు భారీగా నల్లధనం దందాను సాగించారు.
- 2006 నాటికే ఏకంగా 32,385 మంది నుంచి రూ.2,600 కోట్ల వరకు అక్రమంగా డిపాజిట్లు సేకరించారని వెల్లడైంది. కానీ వారి పేర్లు, వివరాలను మాత్రం వెల్లడించేందుకు రామోజీరావు ససేమిరా అంటుండటం గమనార్హం. ఎందుకంటే ఆ డిపాజిట్ల ముసుగులో టీడీపీ పెద్దలు భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తీసుకువచ్చారు. అందుకే సీఐడీతోపాటు న్యాయస్థానం కోరినప్పటికీ వారి వివరాలను వెల్లడించేందుకు సమ్మతించడం లేదు.
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ రశీదు రూపంలో సేకరించిన డిపాజిట్ల పత్రాలను పరిశీలిస్తే అదంతా నల్లధనం బాగోతమేనన్నది స్పష్టమవుతోంది. డిపాజిట్‌దారుల పాన్ నంబర్లు, చిరునామాలు కూడా లేకుండానే డిపాజిట్లు సేకరించడం గమనార్హం.
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన మొత్తం రూ.2,610.38 కోట్లుగా రామోజీరావు 2006లో తమ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కానీ 2008లో సమర్పించిన అఫిడవిట్‌లో రూ.1,864.10 కోట్లు చెల్లించేశామని తెలిపారు. మరి మిగిలిన రూ.800 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయనే విషయంపై మౌనం వహించారు. గుట్టు చప్పుడు కాకుండా రికార్డుల నుంచి తొలగించిన ఆ రూ.800 కోట్లు రామోజీకి అత్యంత సన్నిహితుడైన పచ్చ బాబు, ఆయన గ్యాంగ్‌వే అని తెలుస్తోంది. పోనీ చెల్లించామని చెబుతున్న రూ.1,864.10 కోట్ల డిపాజిట్లు ఎవరెవరికి చెల్లించారో చెప్పడానికి రామోజీ ససేమిరా అంటున్నారు.

బాబుకు రెస్ట్!

35 ఏళ్లుగా పోటీ చేస్తున్నారు... రెస్ట్ అవసరమన్న భార్య

ఈ సారి కుప్పంలో పోటీ చేయాలనుకుంటున్నానన్న భువనేశ్వరి

ఈ మాటల వెనక కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం చంద్రబాబుదే

'సిద్ధం' సభలకు వెల్లువలా వస్తున్న జనాన్ని చూసి వెన్నులో వణుకు

(సాక్షి, అమరావతి-తిరుపతి-శాంతిపురం)



"35 ఏళ్లుగా మీరు చంద్రబాబు నాయుడు గారిని గెలిపిస్తున్నారు. ఇక ఆయనకు రెస్ట్ ఇవ్వాలనిపిస్తోంది. అందుకే ఈ సారి ఇక్కడి నుంచి నేను పోటీ చేయాలనుకుంటున్నాను" అంటూ చంద్రబాబు నాయుడి భార్య నారా భువనేశ్వరి బుధవారం కుప్పంలో ఓ బహిరంగ సభలో స్పష్టంగా చెప్పారు.

స్కిల్ కుంభకోణంలో వేల కోట్లు నేరుగా విత్‌డ్రా చేసుకుని మింగేసిన కేసులో ఈ మధ్య చంద్రబాబు నాయుడిని పోలీసులు అరెస్టు చేయటంతో ఆయన జైలుకు వెళ్లటం తెలిసిందే. అది జరిగిన 10-15 రోజుల తరవాత కూడా ఆయన జైలు జీవితాన్ని చూసి తట్టుకోలేక కొందరు మరణించారన్నది టీడీపీ-ఎల్లో మీడియా వ్యాఖ్యానం. వారందరికీ సాయం చెయ్యడానికి నేరుగా నారా భువనేశ్వరి ఓ యాత్ర చేస్తున్నారు. ఆమేమీ రాజకీయ నాయకురాలు కాదు. దీంతో యాత్రలో భాగంగా ఎక్కడికి వెళ్లాలి? ఎవరెవరిని కలవాలి? ఎవరికి చెక్కులివ్వాలి? ఏమేం మాట్లాడాలి? అనేది మొత్తం స్క్రిప్టు ప్రకారమే చేస్తున్నారు. బుధవారం మాట్లాడిన మాటలు కూడా ఆ స్క్రిప్టులో భాగమే. కళ్లెదుట ఓటమి స్పష్టంగా కనిపిస్తుండడంతో ఏదో ఒక వంకతో అక్కడి నుంచి పోటీ చేయకుండా జారుకోవాలనేది బాబు పన్నాగమని, అందుకే భార్యతో ఆ మాటలు మాట్లాడించారు తప్ప అవేమీ చమత్కారమో, యథాలాపమో కావని టీడీపీ వర్గాలే చెబుతున్నాయి.

కుప్పంలో పడిపోయిన బాబు గ్రాఫ్...

కుప్పం బరి నుంచి పక్కకు తప్పుకొని వేరే నియోజకవర్గం చూసుకోవాలని, లేకపోతే ఈ సారి ఎన్నికల్లో పోటీయే చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా వ్యవహరించాలని బాబు ఆలోచిస్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కుప్పంలో బాబు గ్రాఫ్ అంతకంతకూ దారుణంగా పడిపోవటం దీనికి మొదటి కారణం. నిజానికి 2019 ఎన్నికల్లోనే ఆయన మెజారిటీ బాగా తగ్గిపోవటం నుంచి ఈ గ్రాఫ్ పతనం మొదలయింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు చేతి నుంచి కుప్పం జారిపోయింది. మున్సిపల్ ఎన్నికల్లో కుప్పం మున్సిపాలిటీని వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంది. 25 వార్డుల్లో టీడీపీ కేవలం 7 వార్డుల్లో గెలవగా మిగిలిన 18 వార్డుల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. అంతకుముందు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 89 పంచాయతీలకు గాను 70 పంచాయతీలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. నాలుగు జెడ్పీటీసీలు, నాలుగు ఎంపీపీ స్థానాల్లో కూడా టీడీపీ ఓడిపోయింది. ఈ ఫలితాలన్నీ కుప్పంలో చంద్రబాబు పని అయిపోయినట్లేనని స్పష్టంగా చెప్పాయి.

'సిద్ధం' సభలతో ఉక్కిరి బిక్కిరి

చంద్రబాబు ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలోనూ 'రా... కదలిరా' పేరిట సభలు నిర్వహించారు. మరోవైపు లోకేశ్ 'శంఖారావం' పేరుతో సభలు పెట్టారు. ఇక నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' అంటూ సమావేశాలు పెడుతున్నారు. వైఎస్సార్ సీపీ తరఫున వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే... 'సిద్ధం' అంటూ సభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. బాబు...లోకేశ్... భువనేశ్వరి సభలన్నింట్లోనూ కలిపినా... రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వచ్చిన జనాల్లో సగం కూడా రాలేదు. 'సిద్ధం' సభలు మూడూ ఒకదాన్ని మించి మరొకటి జనసంద్రాలయ్యాయి. జనం నాడి అర్థమైన చంద్రబాబుకు వణుకు మొదలైంది. అందుకే పొత్తులతోనైనా ఎలాగోలా పరువు నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కుప్పంలో కూడా తాను ఓడిపోతే పరిస్థితి దయనీయంగా మారుతుందని, పార్టీ చేజారిపోతుందని అర్థమై.. ఈ సారికి వేరే చోట నుంచి పోటీ చెయ్యడమో... లేకపోతే ఎక్కడా పోటీ చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌లా వ్యవహరించి పరువు నిలుపుకోవటమో చేయాలని చూస్తున్నారన్నది పార్టీ వర్గాల మాట.

నగర వార్తలు

హెచ్‌ఎండీఏ స్థలం అన్యాక్రాంతం

- ఎమ్మెల్యే కాలనీలో చేతులెత్తేసిన అధికారులు



హెచ్‌ఎండీఏకు కేటాయించిన స్థలంలో నిర్మాణాలు

బంజారాహిల్స్: స్థలాలను కాపాడుకోవాల్సిన హెచ్‌ఎండీఏ.. కబ్జాదారులపై ఉదాసీనంగా వ్యవహిస్తుండటంతో కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. తనకు కేటాయించిన స్థలాలను కాపాడుకోవడంలో హెచ్‌ఎండీఏ పూర్తిగా చేతులెత్తేయగా.. అప్పుడప్పుడు రెవెన్యూ అధికారులు వాటిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. షేక్‌పేట మండలం హకీంపేట గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 102/1లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ఎమ్మెల్యే కాలనీని ఆనుకొని హెచ్‌ఎండీఏకు రెవెన్యూ అధికారులు 54 ఎకరాల స్థలం ఇచ్చారు. ఇందులో 38 ఎకరాలను హుడా హైట్స్ పేరుతో వెంచర్ వేసి ప్లాట్లుగా హెచ్‌ఎండీఏ విక్రయించింది. మిగతా 14 ఎకరాల స్థలం ఖాళీగా ఉంది. దీంతో కబ్జాదారులు ఈ స్థలంపై కన్నేసి నకిలీ దస్తావేజులు సృష్టించడమే కాకుండా నిర్మాణాలు చేపట్టారు. షేక్‌పేట రెవెన్యూ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను పలుమార్లు కూల్చివేయడంతో పాటు కబ్జాదారులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్లో క్రిమినల్ కేసులు పెట్టారు. ఈక్రమంలో జనవరి 5వ తేదీన షేక్‌పేట తహసీల్దార్ అనితా రెడ్డి హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు లేఖ రాశారు. స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని.. కాపాడుకోవాల్సిందిగా లేఖలో సూచిస్తూ ఆధారాలు కూడా జత చేశారు. అయితే కబ్జాదారులతో కుమక్కైన హెచ్‌ఎండీఏ అధికారులు లేఖను పట్టించుకోలేదు. దీంతో స్థలాలు కాపాడటం తమ వల్ల కాదని.. స్థలాలను మీరే కాపాడుకోవాలంటూ రెండోసారి తహసీల్దార్ మరో లేఖ రాశారు. అయినప్పటికీ హెచ్‌ఎండీఏ అధికారుల నుంచి స్పందన లేదు. ఈక్రమంలో 14 ఎకరాల స్థలంలో ఇప్పటికే 7 ఎకరాలు కబ్జాకు గురయినట్లు అధికారులు చెబుతున్నారు. కబ్జాకు గురైన స్థలం విలువ సుమారు రూ.150 కోట్లు ఉంటుందని ఒక అంచనా. చర్యలు తీసుకోకుంటే మిగతా స్థలం కూడా కబ్జాకు గురవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, హెచ్‌ఎండీఏలోని కొందరు అధికారులు, కింది స్థాయి సిబ్బంది ఈ కబ్జాలకు ప్రోత్సహిస్తున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి.

స్త్రీ వ్యాధులపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

బంజారాహిల్స్: స్త్రీ వ్యాధులపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి సూచించారు. ఎండోమెట్రియోసిస్ అవగాహన మాసోత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ అపోలో హాస్పటల్స్ ఓపెన్ ఎయిర్ యాంపీ థియేటర్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతారెడ్డి మాట్లాడుతూ ఎండోమెట్రియోసిస్ అనేది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మిలియన్ల మంది మహిళలను ప్రభావితం చేసే ఆరోగ్య పరిస్థితి అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ విషయంలో సహాయపడేందుకు ఎండోమార్చ్, ఎండోమెట్రియోసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా, పెయిర్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు ఆరోగ్య సమస్యలపై ఓపెన్‌గా మాట్లాడేందుకు ఇవి ఎంతగానో ప్రోత్సహిస్తాయని చెప్పారు. ఎండోమెట్రియోసిస్ ఉన్న స్త్రీలు అలసట, నిరాశ, వంధ్యత్వానికి గురవుతారన్నారు. రోగ నిర్ధారణ 6 నుంచి 10 ఏళ్లు ఆలస్యం అవుతుందన్నారు. ఇది మహిళల జీవన ప్రమాణాలను గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ సమాజంతో పాటు కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలంటే మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అపోలో హాస్పటల్స్ ఎంటర్‌ప్రైజెస్ సీఎస్ఆర్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కామినేని మాట్లాడుతూ మహిళలు తమ భావాలను వ్యక్తంచేయడానికి ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రూమా సిన్హా తదితరులు పాల్గొన్నారు.

సంగీత, నృత్య కళాశాలల పరీక్ష ఫీజు గడవు పొడిగింపు

నాంపల్లి: ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు, పాఠశాలల సర్టిఫికెట్, డిప్లొమా కోర్సు పరీక్ష ఫీజు గడవును పొడిగించినట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్, ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు గడువు ఈ నెల 20వ తేదీతో పూర్తయిందని, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న కళాశాలు, పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న రెండు రాష్ట్రాల్లో ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు పరీక్ష ఫీజు గడవు తేదీని (సర్టిఫికెట్ కోర్సు ఫీజు రూ.4500, డిప్లొమా కోర్సు ఫీజు రూ.4800) ఆలస్య రుసుముతో ఈ నెల 27 ఫిబ్రవరి 2024 వరకు పొడిగించామన్నారు.

ఆలోచింపజేసిన 'ఇకబనా' ప్రదర్శన

బంజారాహిల్స్: పర్యావరణంపై అవగాహన కలిగించేలా బంజారాహిల్స్ సప్తపర్ణిలో నిర్వహించిన 'ఇకబనా' ప్రదర్శన ఆలోచింపజేసింది. ఇకబనా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జంట నగరాలకు చెందిన సుమారు 30 మంది చిన్నారులు ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిబింబించేలా విభిన్న రకాల మొక్కలను కళాత్మకంగా ప్రదర్శించారు. ఇకబనాకు చెందిన ఒహారా స్కూల్ సబ్ గ్రాండ్ మాస్టర్ ఒహ్రియు రేఖారెడ్డి మార్గనిర్దేశం చేసిన ఈ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో ది ఫ్లిప్ సైడ్ వర్క్‌స్పేస్ నుంచి న్యూరో డైవర్జెంట్‌తో బాధపడుతున్న యువతీ యువకులు అంచల్‌రాంకా, సదీద్ అమ్మార్ అజీజ్, సమీక్షా భలోటియా, అదితి రాఠీలు సైతం ఉత్సాహంగా పాల్గొనడం గమనార్హం. ఈ ఎగ్జిబిషన్‌కు చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ టాగా మస యుకీ ముఖ్యఅతిథిగా హాజరై తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటేటా ఈ ఇకబనా కార్యకలాపాలను చూడడం అపారమైన ఆనందం కలుగుతుందన్నారు. రేఖారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రదర్శన కేవలం పువ్వులు, ఆకుల సౌందర్య మిశ్రమాలను ప్రదర్శించడమే కాదని, కళ ద్వారా శాంతి, ఆనందాన్ని కలిగించడమే లక్ష్యం అన్నారు. యువ కళాకారుల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందించడం జరుగుతుందన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజ్ మార్కులు ఇవ్వాలి

నాంపల్లి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ సర్వీస్ వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని, ఎన్‌హెచ్ఎం, ఆర్ఎన్‌టీసీపీ, టీఎస్ఏసీఎస్‌లకే కాకుండా మిగతా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని నిలోఫర్ ఆసుపత్రి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షులు గద్దెల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గద్దెల శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎటువంటి రిమార్కులు లేకుండా అనేక సంవత్సరాలుగా అధికారులు సంతృప్తి చెందే విధంగా పేద రోగులకు సేవలందిస్తున్నట్లు వివరించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన జీ.ఓ నెం-67 ప్రకారం 2017వ సంవత్సరంలో విడుదలైన నోటిఫికేషన్ కింద భర్తీ చేసే పోస్టులకు దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి రాత పరీక్షలు, 1:3 ద్వారా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి ఫలితాలు విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచారని అన్నారు. కొత్త ప్రభుత్వంలో విడుదలయ్యే నోటిఫికేషన్ల పోస్టులను కూడా 2017లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు కలుపాలని కోరారు.

ఈఎస్ఐసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) 73 వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన స్పెషల్ సర్వీసెస్ పక్షోత్సవాలు ముగిశాయి. నగరంలోని ఈఎస్ఐసీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రాంగణాలు, పారిశ్రామివాడల్లో పక్షం రోజుల పాటు నిర్వహించిన అవగాహన సదస్సులు, మెడికల్ క్యాంప్‌లు తదితర కార్యక్రమాలను డిజిటల్ డ్యాకుమెంటరీ రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్మిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రాణి కుముదిని పాల్గొని ప్రసంగించారు. ఈఎస్ఐసీ ద్వారా అందించే పథకాలను. సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల్లో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన, ప్రమాదాలకు గురైన బాధిత కుటుంబాలకు నెలవారీ పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐసీ తెలంగాణ ప్రాంతీయ డైరెక్టర్ గౌమింతాంగ్, మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ మాధూరి,డిప్యూటీ డైరెక్టర్ మహేశ్, సూపరింటెండెంట్ డాక్టర్ రాధిక, తదితరులు పాల్గొన్నారు.

మరో పోరాటానికి సిద్ధం కండి: వంగపల్లి మాదిగ



సభ్యులకు నియామకపత్రాలను అందజేస్తున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణ, సామాజిక న్యాయం కోసం మాదిగ మహిళలు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మాదిగ మహిళా సమైక్య రాష్ట్ర స్థాయి సదస్సు విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ .. ఎస్సీ వర్గీకరణ కోసం గతంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అసెంబ్లీ ముట్టడించిన చరిత్ర మాదిగ మహిళలదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతో మంది మాదిగ వీరవనితలు పోరాటంలో అమరులు అయ్యారన్నారు. వారి అమరత్వాన్ని బుజాన వేసుకోని మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర నూతన కమిటిని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ నియమించారు. తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలుగా పాలడుగు మేరీ మాదిగ(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాదిగ మహిళ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు), రాష్ట్ర అధ్యక్షురాలుగా బాష్ప వరలక్ష్మిలను నియమించారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



ఆచార్య తంగెడ కిషన్‌రావుకు నిఘంటువును అందజేస్తున్న మౌలానా

నాంపల్లి: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను బుధవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిపాలన భవన్‌లో నిర్వహించారు. తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావు అధ్యక్షతన జరిగిన సభకు ప్రధాన వక్తగా ప్రముఖ సాహితీవేత్త ఆచార్య పి.సుబ్బాచారి హాజరై ప్రసంగించారు. మనుష్యులను విడదీసే లక్షణం, కలిపే లక్షణం భాషకు ఉందని చెప్పారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడినప్పుడు భాషా పరంగా వేటికవే విడిపోయి ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పశ్చిమ పాకిస్తాన్, తూర్పు పాకిస్తాన్ రెండుగా విడిపోయాయని అన్నారు. 1952లో ఢాకా విశ్వవిద్యాలయంలో భాష కోసం జరిగిన ఆందోళనలో భాగంగా ఫిబ్రవరి 21న ఐదుగురు విద్యార్థులు చనిపోయారని, కొన్ని వందల మందికి గాయాలయ్యాయని గుర్తు చేశారు. భాష కోసం 21 ఫిబ్రవరి 1999న పెద్ద ఆందోళన జరిగితే, 21 ఫిబ్రవరి 2008న అంతర్జాతీయ మాతభాషా దినోత్సవాన్ని జరుపుకోవడం అమలులోకి వచ్చిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరు వేల భాషలు ఉన్నప్పటికి 1650 భాషలే జీవికలుగా ఉన్నాయని చెప్పారు. 1968లో తెలుగు అకాడమి ఏర్పాటు వలన తెలుగు భాషాభివృద్ధికి విశేషమైన కషి చేశారని చెప్పారు. అరబిక్-తెలుగు నిఘంటువు రచయిత మౌలానా మాట్లాడుతూ... అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం రోజున తాను రచించిన నిఘంటువును ఆవిష్కరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. భాషాభివృద్ధి పీఠం పీఠాధిపతి ఆచార్య వై.రెడ్డి శ్యామల స్వాగతోపన్యాసం చేయగా, ఆచార్య జి.ఎస్.గాబ్రియల్ వందన సమర్పణ చేశారు.

ప్రభుత్వ, సీలింగ్ భూములు గుర్తించాలి

- గూగుల్ మ్యాప్ తయారు చేయాలి
- రెవెన్యూ అధికారులను ఆదేశించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, సీలింగ్ భూములను సత్వరమే గుర్తించి, గూగుల్ మ్యాప్ తయారు చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో ఆర్డీవోలు, ఎమ్మార్వోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సీలింగ్ భూములు అన్నింటిని ధరణిలో క్రయవిక్రయాలు జరగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. కోర్టుకేసులు పెండింగ్‌లో ఉన్న వాటిని కౌంటర్ ఫైల్ చేయమని తహశీల్దార్లను ఆదేశించారు. హౌసింగ్ బోర్డ్ ల్యాండ్ లను కాపాడాలని కలెక్టర్ కోరారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల గూగుల్ మ్యాప్‌ను తయారు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఓ ఆర్ ఆర్ చుట్టూ ఇండస్ట్రియల్ పార్కు స్థాపించడానికి గవర్నమెంట్ పార్సిల్ గుర్తించమన్నారు. మండల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న టీఎస్ బి పాస్ దరఖాస్తులను పరిశీలించి నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్డీవో శ్యాంప్రకాష్, మండల తహశీల్దార్‌లు పాల్గొన్నారు.



కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తుండంగా రక్షణగా ఉన్న రోప్‌పార్టీ, చిత్రంలో మంత్రి సీతక్క

మేడారం నుంచి సాక్షిప్రతినిధి, వరంగల్ :

తెలంగాణ కుంభమేళా.. ఆదివాసీ గిరిజన జాతర మొదలైంది. కోరిన కోర్కెలు తీర్చే తల్లి, సారలమ్మ బుధవారం మేడారం గద్దెపైకి చేరింది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి మేడారం చేరుకున్న గోవిందరాజులు కూడా సారలమ్మతోనే గద్దెలపైకి చేరారు. ముగ్గురు వనదేవతల రాకతో మేడారం మహాజాతర ఘనంగా మొదలైంది. కన్నెపల్లి నుంచి సారలమ్మ తల్లిని మేడారం గద్దెలపై ప్రతిష్ఠించే ప్రక్రియలో భాగంగా బుధవారం ఉదయమే ఆలయం వద్ద భేటీ అయిన పూజారులు ఆలయప్రాంగణాన్ని శుద్ధిచేశారు. తిరిగి సాయంత్రం కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజారులు, వడ్డెలు సాయంత్రం సుమారు 6.21 నుంచి రాత్రి 7.40 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 7.42 గంటలకు గుడి నుంచి మొంటె(వెదురు బుట్ట)లో అమ్మవారి ప్రతిరూపమైన పసుపు, కుంకుమ తీసుకుని మేడారానికి బయలుదేరారు. జంపన్నవాగులో నుంచి సమ్మక్క గుడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పగిడిద్దరాజు, గోవిందరాజులుతో కలిసి వడ్డెలు ముగ్గురి రూపాలను రాత్రి 12 గంటల తర్వాత మేడారంలో గద్దెలపై ప్రతిష్ఠించారు.

వన దేవత వచ్చె..
భక్తజనం మురిసె

మేడారం గద్దెపైకి సారలమ్మ..
- పగిడిద్దరాజు, గోవిందరాజు సైతం
- ఎదురేగి భక్తుల దండాలు.. దారిపొడవునా భక్తి పారవశ్యం
- ఘనంగా మేడారం జాతర ప్రారంభం
- నేడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క ఆగమనం

మీకు తెలుసా ?

మదిర గుడ్డ లేనిదే కదలరు



మేడారం(ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి): మదిర గుడ్డ(ఎర్రటి వస్త్రం) లేనిది పూజారులు ముందుకు కదలరు. మదిర గుడ్డను ధరించి అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తారు. వనదేవతలను తీసుకువచ్చే క్రమంలో భక్తులకు కనిపించకుండా పూజారులు, వడ్డెలు ముఖానికి, కుంకుమభరిణె, వెదురుబుట్టలకు ఆ ఎర్రటి వస్త్రం కట్టి తీసుకువస్తారు. ప్రతి పూజా కార్యక్రమం ఎర్రవస్త్రం లేనిది సాగదు.

బంగారమే తల్లుల ప్రతిరూపం

- మౌలాలీ నుంచి ఆరేళ్లుగా..



బెల్లం ముద్దలతో అమ్మవారి అలంకరణ

మేడారం(ఏటూరునాగారం, ఎస్ఎస్‌తాడ్వాయి): మేడారంలోని బంగారాన్ని శ్రీ సమ్మక్క–సారలమ్మ తల్లుల ప్రతి రూపాలుగా కొలుస్తున్నారు. జాతరకు వచ్చిన భక్తులు చిలకలగుట్ట ప్రాంతంలో విడిది చేసి బెల్లం ముద్దలను అమ్మవారి ప్రతిరూపాలుగా అలంకరించారు. కంకవనాలు, ఒడిబియ్యం, మద్యం, చీరసారెలను అమ్మవారి వద్ద అప్పగిస్తారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి వచ్చిన 80 మంది భక్తులు గుడారం ఏర్పాటు చేసుకుని ఒకే వేదికగా నివాసం ఉంటున్నారు. సమ్మక్క–సారలమ్మ గద్దెలపై మొక్కులు సమర్పించేంత వరకు దీపారాధన, నైవేద్యాలు, కొబ్బరికాయలు కొట్టి పూజిస్తారు. జాతరలో విడిది చేసిన చోటే ఎంతో పవిత్రంగా పూజించడం విశేషం. మేడారం జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బస్సులు, డీసీఎంలు, లారీలు, ట్రాక్టర్లనే గుడారాలుగా మార్చుకొని వాటి కింద సేద తీరుతూ అమ్మవారికి వెండి కన్నులు, ఆభరణాలు, గాజులను అలంకరించి పూజలు చేస్తున్నారు. 'అందరం ఒకే దగ్గర చేరుకొని కుటుంబ సభ్యులు, బంధువులను ఆహ్వానించి విందు భోజనాలు చేస్తాం.. సంతోషంగా గడుపుతాం.. వారం రోజుల పాటు మేడారం జాతరలో ఉంటాం'.. అని పలువురు భక్తులు తెలిపారు.

ఆరేళ్ల నుంచి వస్తున్నాం : భరణి



సమ్మక్క– సారలమ్మ జాతరకు ఆరు సంవత్సరాల నుంచి వస్తున్నాం. నాకు కొడుకు పుట్టిండు. అప్పటి నుంచి భక్తిశ్రద్ధలతో తల్లులను పూజిస్తున్నాం. వనదేవతలు గద్దెలకు వచ్చిన తర్వాత వెళ్లి మొక్కులు సమర్పిస్తాం.

ఐదు దోసిళ్ల ఒడిబియ్యం జల్లుతాం : రేవతి



సమ్మక్క చిలకలగుట్ట నుంచి వచ్చేటప్పుడు తాము తెచ్చిన ఒడిబియ్యం నుంచి ఐదు దోసిళ్ల చల్లుతాం. ఆ తల్లిని గద్దెకు తీసుకు వచ్చేటప్పుడు కళ్లారా చూసి తరిస్తాం. పూర్వ కాలం నుంచి మా తాతలు ముత్తాతలు చెప్పిన ఆచారాన్ని మేము పాటిస్తున్నాం.

లాల్‌దర్వాజ నుంచి వచ్చినం : భాగ్యమ్మ



లాల్‌దర్వాజ నుంచి 60 మంది వచ్చి చిలకల గుట్ట వద్ద బస చేస్తున్నం. బెల్లం ముద్దలను అమ్మవారు కొలువు దీరిన తర్వాతనే సమర్పిస్తాం. మేకలు, కోళ్లను బలిచ్చి సంహపక్తి భోజనాలు చేస్తాం.

అక్కున చేర్చుకుని.. అప్పజెప్పి!



మేడారం(కాళేశ్వరం): మేడారం మహాజాతరలో తప్పిపోతున్న చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేరుస్తున్నారు పోలీసులు. బుధవారం జంపన్న వాగు వద్ద తప్పిపోయిన చిన్నారులను పోలీసులు హెల్ప్ డెస్క్‌కు అప్పగించారు. హెల్ప్‌డెస్క్ సిబ్బంది తల్లిదండ్రులకు తమ పిల్లలను అప్పగిస్తున్నారు.



గోవిందరాజును తీసుకొస్తున్న పూజారులు



గద్దెపైకి వస్తున్న పగిడిద్దరాజు



సారలమ్మను తీసుకొస్తున్న పూజారులు

కన్నెపల్లి నుంచి మేడారం.. ఎదురేగిన భక్త జనం

కన్నెపల్లి నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోని మేడారం గద్దెల వద్దకు సారలమ్మ వస్తున్న వేడుకను చూసేందుకు లక్షలాది మంది భక్తులు పోటీపడ్డారు. దేవతను సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య, పూజారులు తీసుకొస్తున్న సమయంలో వరం పట్టిన మహిళలను దాటుకుంటూ వెళ్తే.. సంతానభాగ్యం కలుగుతుందని, కోర్కెలు నెరవేరతాయని వారి నమ్మకం. సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య అమ్మవారి ప్రతిమను మొంటె(వెదురు బుట్ట)లో తీసుకొస్తుండగా ఆలయం మెట్ల నుంచి వంద మీటర్ల పొడవునా భక్తులు కింద పడుకుని వరం పట్టారు. సారలమ్మను తీసుకువస్తున్న పూజారులు వీరిపై నుంచి దాటి వెళ్లారు. సారలమ్మ గద్దెకు రాకను సూచిస్తూ ఆదివాసీ పూజారులు కొమ్ముబూరలు ఊదారు. ప్రత్యేక డోలు వాయి ద్యాలు, శివసత్తుల పూనకాలు, శివాలుతో కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయం భక్తితో ఉప్పొంగింది. ఆదివాసీ పూజారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క వీరికి తోడుగా వచ్చారు. అంతకు ముందు పూజారులతో కలిసి పూజలు నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి కన్నెపల్లికి చేరుకుని అక్కడ వడ్డెలు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రోప్ పార్టీ పోలీసులు వలయంగా ఏర్పడి వీరికి భద్రత కల్పించారు. వడ్డె సోలం వెంకటేశ్వర్లు హనుమాన్ జెండా పట్టగా, ఆ జెండా నీడలో సారలమ్మ గద్దెలపైకి చేరింది. కన్నెపల్లిలో సారలమ్మ బయలుదేరే ముందు మంత్రి ధనసరి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ శబరీష్, అధికారులు, ఆదివాసీ ఉద్యోగులు గిరిజ నులతో కలిసి చేసిన నృత్యాలు అలరించాయి. జాతరలో భక్తులు కేరింతలు కొడుతూ సందడి చేశారు.

దారులన్నీ మేడారం వైపే..

సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు ప్రతిమలను గద్దెలపైకి తీసుకురావడంతో మేడారం, కన్నెపల్లి, రెడ్డిగూడెం, జంపన్న వాగు, నార్లాపూర్ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. లక్షలాదిగా వస్తున్న భక్తులతో అటవీ దారులన్నీ పోటెత్తుతున్నాయి. ఈసారి కూడా కార్లు, జీపులు, ట్రాక్టర్ల, ట్రాలీ ఆటోలు, డీసీఎం, లారీల ద్వారా భక్తులు మేడారం చేరుకున్నప్పటికీ.. అత్యధికంగా ఆర్టీసీ బస్సుల్లో వచ్చారు. కాగా భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు మొత్తం జనంతో నిండిపోయింది. మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తుల తాకిడితో నాలుగు కిలోమీటర్ల పొడవునా దారులు కిక్కిరిసిపోయాయి. సారలమ్మ గద్దెపైకి రాగానే భక్తిపారవశ్యంతో దర్శనం కోసం ఒక్కసారిగా గద్దెల వద్దకు వచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో పలుమార్లు తోపులాట జరిగింది. అమ్మవార్ల గద్దెలను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులుదీరుతున్నారు. మూడు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన క్యూలైన్లు సరిపోక రోడ్డుపై సైతం వరుసల్లో ఉండిపోయారు. భక్తుల తాకిడి పెరగడంతో దర్శనానికి ఎక్కువ సమయం పడుతోంది.

చిలకలగుట్ట నుంచి నేడు సమ్మక్క రాక..

మేడారంలో గద్దెలపైకి సమ్మక్క చేరడం అత్యంత ప్రధాన ఘట్టం కాగా.. చిలకలగుట్ట నుంచి మేడారానికి సమ్మక్క ప్రతిమను తీసుకువచ్చే ప్రక్రియ గురువారం జరుగుతుంది. ముందుగా నిర్ణయిచిన ప్రకారం సాయంత్రం 5 గంటల సమయంలో గిరిజన సంప్రదాయం ప్రకారం ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య చిలకలగుట్టపై నుంచి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను వెదురు బొంగులో భద్రపర్చుకుని తీసుకొస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కలెక్టర్ ఇలా త్రిపాఠి సమ్మక్కను తీసుకువచ్చే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు. ములుగు ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపిన తర్వాత సమ్మక్క కుంకుమ భరిణెతో వడ్డెలు బయల్దేరుతారు. ఆ సమయంలో భక్తులు.. సమ్మక్కకు ఎదురేగి కోళ్లను, మేకలను బలి ఇస్తారు. రాత్రి సమ్మక్కను ప్రతిష్ఠించిన కొద్ది నిమిషాల నుంచి వీవీఐపీలు, వీఐపీలు, ఉన్నతాధికారులు, భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. వన దేవతలందరూ గద్దెలపై కొలువై ఉండడంతో గురువారం రాత్రి నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకునే ప్రక్రియ జోరందుకుంటుంది. కాగా బుధవారం రాత్రి నుంచే మేడారం భక్తజన గుడారంగా మారగా.. గురువారం ఉదయం నుంచి మహాజాతర జనసంద్రంగా మారింది. సాయంత్రం వరకు కిక్కిరిసిపోయే అవకాశం ఉంది.

కొలువుదీరిన సారలమ్మ..

- 24 వరకు తెలంగాణ కుంభమేళా
- రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



సారలమ్మను తీసుకురావడానికి వెళ్తున్న మంత్రి సీతక్క, అధికారులు

తెలంగాణ కుంభమేళా మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని, కన్నెపల్లి నుంచి గద్దెపైకి వచ్చి సారలమ్మ కొలువు తీరిందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం మంత్రి సీతక్క కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయం నుంచి గద్దెపైకి వచ్చిన సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన పూజారి కాక సారయ్య ఇంటికి వెళ్లి ఆలయ శుద్ధి గురించి చర్చించిన మంత్రి అనంతరం సమ్మక్క సారలమ్మ గర్భగుడి నుంచి గద్దెలకు చేరుకొని కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి తెలంగాణ కుంభమేళా మేడారం మహాజాతర జరుగుతుందని, సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా కోట్ల మంది భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారని చెప్పారు. మేడారం మహా జాతరను పురస్కరించుకొని ఆదివాసీ సంప్రదాయం ప్రకారం డప్పు వాయిద్యాల నడుమ మహా జాతరకు అంకురార్పణ జరిగిందని, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆదివాసీలు కొట్టు గోత్రం సంబంధీకులు మేడారంలోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారని మంత్రి పేర్కొన్నారు.





సంప్రదాయబద్ధంగా ఎడ్లబండ్లపై మేడారం తరలివస్తున్న భక్తులు



జంపన్నవాగులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- సాక్షిఫొటోగ్రాఫర్ గుంపుల వెంకటేశ్వర్లు



యూఏఈ క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా లాల్‌చంద్ రాజ్‌పుత్

భారత మాజీ క్రికెటర్ లాల్‌చంద్ రాజ్‌పుత్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుకు హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. పాకిస్తాన్‌కు చెందిన ముదస్సర్ నాజర్ స్థానంలో 62 ఏళ్ల రాజ్‌పుత్‌ను నియమించారు. నాజర్ కోచింగ్‌లోని యూఏఈ జట్టు ఈ ఏడాది వెస్టిండీస్, అమెరికాలలో జరిగే టి20 ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. రాజ్‌పుత్ కెరీర్‌లో రెండు టెస్టులు, నాలుగే వన్డేలు ఆడారు. 2007లో భారత్ గెలిచిన తొలి టి20 ప్రపంచకప్‌లో జట్టు కోచ్‌గా వ్యవహరించారు.



భారత బాస్కెట్‌బాల్ జట్టు కోచ్‌గా సంతోష్

ఆసియా కప్ సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టుకు కోచ్‌గా తెలంగాణకు చెందిన పి.ఎస్.సంతోష్ ఎంపికయ్యాడు. ఈ టోర్నీ కజకిస్తాన్‌లో ఈనెల 23 నుంచి 26 వరకు జరుగుతుంది. గ్రూప్ 'ఇ'లో భారత్‌తోపాటు ఖతర్, కజకిస్తాన్, ఇరాన్ జట్లున్నాయి. భారత జట్టులో విశేష్, అరవింద్, ముయిన్ బెక్, ప్రణవ్ ప్రిన్స్, అమృత్‌పాల్, గుర్బాజ్, పల్‌ప్రీత్, అమరేంద్ర, వైశాఖ్, ప్రిన్స్‌పాల్ సింగ్, సహజ్‌ప్రతాప్ సింగ్, బాలదానేశ్వర్ సభ్యులుగా ఉన్నారు.


సాకేత్
రామ్

సాకేత్ జోడీ సంచలనం

పుణే: మహారాష్ట్ర ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని–రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ సంచలన విజయంతో బోణీ కొట్టింది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్–రామ్ ద్వయం 7–6 (7/5), 6–4తో రెండో సీడ్ పీటర్ మటూవ్‌స్కీ (పోలాండ్)–మాథ్యూ రోమియోస్ (ఆస్ట్రేలియా) జంటను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–రామ్ జోడీ మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో అర్జున్ – జీవన్ (భారత్) 6–3, 6–3తో రిత్విక్ చౌదరీ–నికీ పూనాచా (భారత్)లపై నెగ్గగా... గంటా సాయి కార్తీక్ రెడ్డి–కరణ్ (భారత్) 6–3, 3–6, 4–10తో ట్రిస్టన్–వాల్టన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడారు.

భారత్ శుభారంభం


మనీషా

అలాన్యా: టర్కిష్ కప్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో భారత జట్టు శుభారంభం చేసింది. తొలి పోరులో భారత మహిళల బృందం 4–3 గోల్స్ తేడాతో ఎస్టోనియాపై విజయం సాధించింది. భారత సీనియర్ మహిళల జట్టు చరిత్రలో ఒక యూరోపియన్ టీమ్‌పై గెలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. భారత్ తరఫున మనీషా కల్యాణ్ రెండు గోల్స్ (17వ ని.లో, 81వ ని.లో) సాధించగా... ఇందుమతి (62వ ని.లో), ప్యారీ (79వ ని.లో) ఒక్కో గోల్ కొట్టారు. ఎస్టోనియా ప్లేయర్లలో లిసెట్ తమిక్ (32వ ని.లో), వ్లాదా (88వ ని.లో), లిస్ లిలెమా (90వ ని.లో) ఒక్కో గోల్ నమోదు చేశారు.

ప్రిక్వార్టర్స్‌లో భారత జట్ల ఓటమి

ప్రపంచ టీటీ టీమ్ చాంపియన్‌షిప్

బుసాన్: పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారు కావడానికి అవసరమైన విజయాన్ని భారత మహిళల, పురుషుల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లు సాధించలేకపోయాయి. పటిష్ట జట్లతో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో భారత జట్లు ఓడిపోయి ప్రపంచ టీటీ టీమ్ చాంపియన్‌షిప్ నుంచి నిష్క్రమించాయి. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో భారత మహిళల జట్టు 1–3తో చైనీస్ తైపీ జట్టు చేతిలో... భారత పురుషుల జట్టు 0–3తో దక్షిణ కొరియా జట్టు చేతిలో ఓడిపోయాయి. అంతకుముందు జరిగిన నాకౌట్ దశ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు 3–0తో ఇటలీపై... భారత పురుషుల జట్టు 3–2తో కజకిస్తాన్‌పై విజయం సాధించాయి. ఈ మెగా ఈవెంట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో క్వార్టర్ ఫైనల్ చేరిన 8 జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. మార్చి 5న విడుదల చేసే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్–16లో చోటు సంపాదిస్తే భారత జట్లకు పారిస్ ఒలింపిక్ బెర్త్‌లు లభిస్తాయి. ప్రస్తుతం


మనిక బత్రా

భారత మహిళల జట్టు 17వ ర్యాంక్‌లో, భారత పురుషుల జట్టు 15వ ర్యాంక్‌లో ఉన్నాయి.

చైనీస్ తైపీతో జరిగిన పోటీలో తొలి మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ మనిక బత్రా 11–8, 8–11, 4–11, 11–9, 11–9తో ప్రపంచ 10వ ర్యాంకర్ చెన్ జు యుపై సంచలన విజయం సాధించి భారత్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించింది. రెండో మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ 6–11, 9–11, 5–11తో చెంగ్ ఐ చింగ్ చేతిలో... మూడో


ఆకుల శ్రీజ

మ్యాచ్‌లో ఐహిక ముఖర్జీ 10–12, 13–15, 11–9, 2–11తో లి యు జున్ చేతిలో... నాలుగో మ్యాచ్‌లో మనిక బత్రా 10–12, 11–5, 9–11, 5–11తో చెంగ్ ఐ చింగ్ చేతిలో ఓడిపోవడంతో భారత పరాజయం ఖరారైంది.

కొరియాతో జరిగిన పోటీలో తొలి మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 10–12, 11–13, 7–11తో జాంగ్ వూజిన్ చేతిలో... రెండో మ్యాచ్‌లో ఆచంట శరత్ కమల్ 9–11, 5–11, 11–8, 4–11తో లిమ్ జాంగ్‌హూన్ చేతిలో... మూడో మ్యాచ్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ 5–11, 8–11, 2–11తో లీ సాంగ్ హు చేతిలో ఓటమి పాలయ్యారు.

యశస్వి @ 15

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 14 స్థానాలు ఎగబాకిన భారత ఓపెనర్

దుబాయ్: భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ క్రీజులోనే కాదు... అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ దూసుకెళ్తున్నాడు. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో వరుస టెస్టుల్లో డబుల్ సెంచరీలతో అదరగొట్టిన జైస్వాల్ ఐసీసీ టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 15వ స్థానానికి చేరుకున్నాడు. 22 ఏళ్ల ఈ ఓపెనర్ ఏకంగా 14 స్థానాల్ని మెరుగుపర్చుకొని తొలిసారి టాప్–20లోకి వచ్చాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ 12వ, శుబ్‌మన్ గిల్ 35వ స్థానాల్లో ఉన్నారు. అరంగేట్రం టెస్టులో రెండు అర్ధసెంచరీలు సాధించిన సర్ఫరాజ్ 75వ ర్యాంకులో ఉన్నాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌కు దూరంగా ఉన్నప్పటికీ స్టార్ బ్యాటర్



విరాట్ కోహ్లి ఒక్కడే భారత్ తరఫున టాప్–10లో ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు. రాజ్‌కోట్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బ్యాటర్ల జాబితాలో 41 నుంచి 34వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఈ టెస్టులో శతకం సహా ఏడు వికెట్లు తీసిన జడేజా బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 9 నుంచి 6వ స్థానానికి చేరాడు. 500 వికెట్ల క్లబ్‌లో చేరిన అశ్విన్ ఒకస్థానం మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌లో నిలువగా, బుమ్రా టాప్ ర్యాంక్‌లోనే కొనసాగుతున్నాడు.

'షూటౌట్'లో నెదర్లాండ్స్ చేతిలో భారత్ పరాజయం

రూర్కెలా: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) పురుషుల ప్రో లీగ్‌లో తొలి అంచె పోరులో నెదర్లాండ్స్‌ను కంగుతినిపించిన భారత్‌కు రెండో అంచెలో పరాజయం ఎదురైంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 'షూటౌట్'లో 2–4తో ఓడిపోయింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 1–1తో సమంగా నిలిచాయి. షూటౌట్‌లో అరిజీత్ సింగ్, లలిత్ ఉపాధ్యాయ్ మాత్రమే సఫలం కాగా, సుఖ్‌జీత్, షంషేర్ సింగ్ విఫలమయ్యారు. అయితే డచ్ జట్టులో డి మోల్ జోప్, డుకో, బ్రింక్‌మన్ థియెరి, క్రూన్ జోరిట్ గోల్ చేసి గెలిపించారు.

'టాప్' పుణేరి పల్టన్

పంచ్‌కులా: ప్రో కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. బుధవారంతో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. పుణేరి పల్టన్ 40–38తో యూపీ యోధాస్‌పై గెలిచి ఓవరాల్‌గా 96 పాయింట్లుతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 53–39తో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. పుణేరి పల్టన్, జైపూర్ పింక్ పాంథర్స్, దబంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్, హరియాణా స్టీలర్స్, పట్నా పైరేట్స్ టాప్–6లో నిలిచి ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించాయి. ఈనెల 26 నుంచి మార్చి 1 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ప్లే ఆఫ్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి.



ఆసీస్‌ను గెలిపించిన టిమ్ డేవిడ్

ఆఖరి బంతికి ఫోర్ కొట్టిన ఆసీస్ బ్యాటర్ • తొలి టి20లో న్యూజిలాండ్ ఓటమి

వెల్లింగ్టన్: ఆఖరి బంతిదాకా ఉత్కంఠ రేపిన తొలి టి20 మ్యాచ్‌లో టిమ్ డేవిడ్ (10 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు ఆస్ట్రేలియాను గెలిపించాయి. న్యూజిలాండ్‌తో జరిగిన ఈ పోరులో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా కివీస్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీస్కోరు చేసింది. రచిన్ రవీంద్ర (35 బంతుల్లో 68; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), కాన్వే (46 బంతుల్లో 63; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఆసీస్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (15 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ వార్నర్ (20 బంతుల్లో 32; 1 ఫోర్, 3 సిక్స్‌లు) తక్కువే చేసినా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ మార్ష్ (44 బంతుల్లో 72 నాటౌట్; 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. 17వ ఓవర్ ఆఖరి బంతికి హిట్టర్ టిమ్ డేవిడ్ క్రీజులోకి వచ్చాడు. అప్పుడు ఆసీస్ గెలిచేందుకు 19 బంతుల్లో 44 పరుగులు కావాలి. కాసేపటికే అది కాస్తా 9 బంతుల్లో 32 పరుగుల సమీకరణం కష్టంగా మారింది. ఈ దశలో మిల్నే వేసిన 19వ ఓవర్ ఆఖరి మూడు బంతుల్ని డేవిడ్ 4, 6, 6లుగా బాదేశాడు. దాంతో చివరి ఓవర్లో ఆసీస్ విజయానికి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమయ్యాయి. చివరి ఓవర్ వేసిన సౌతీ వైడ్ సహా 3 బంతుల్లో 4 పరుగులే ఇచ్చాడు. ఇక మిగిలిన 3 బంతుల్లో 12 పరుగులు కావాల్సి ఉండగా... డేవిడ్ 6, 2, 4లతో ఆసీస్ జట్టును గెలిపించాడు. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో టి20 మ్యాచ్ శుక్రవారం ఆక్లాండ్‌లో జరుగుతుంది.



పేస్ బౌలర్ల ప్రదర్శన వల్లే...

విజయాలు దక్కాయన్న గిల్



రాంచీ: ఇంగ్లండ్‌తో గత రెండు టెస్టుల్లో భారత జట్టు విజయం సాధించడంలో పేస్ బౌలర్లు ప్రధాన పాత్ర పోషించారని జట్టు బ్యాటర్ శుబ్‌మన్ గిల్ అభిప్రాయపడ్డాడు. పిచ్‌లు అనుకూలంగా లేకపోయినా కీలక సమయాల్లో వారు చెలరేగడం వల్లే మ్యాచ్‌లు మనవైపు మొగ్గు చూపాయని అతను అన్నాడు. ఈ సిరీస్‌లో భారత స్పిన్నర్లు తీసిన 36 వికెట్లతో పోలిస్తే పేసర్లు 22 వికెట్లు తీశారు. 'సాధారణంగా భారత్‌లో దాదాపు అన్ని పిచ్‌లు స్పిన్‌కు అనుకూలిస్తూనే ఉంటాయి. అశ్విన్, జడేజాలు ఎలాగూ ఇక్కడ వికెట్లు తీయగలరు. కానీ మన ఫాస్ట్ బౌలర్ల ప్రదర్శనే సిరీస్‌లో ఇరు జట్ల మధ్య ప్రధాన తేడాగా మారింది. పరిస్థితులకు తగినట్లుగా స్పందించి పేసర్లు జట్టును ముందంజలో నిలిపారు. నాలుగో టెస్టుకు బుమ్రాలాంటి స్టార్ బౌలర్ దూరం కావడం నిరాశ కలిగించేదే. అయినా ఇతర పేసర్లకూ మంచి అనుభవం ఉంది. సిరాజ్ తీసిన నాలుగు వికెట్ల ప్రదర్శనను మరచిపోవద్దు' అని గిల్ ప్రశంసించాడు. పలువురు కీలక ఆటగాళ్లు దూరం కావడం వల్ల వచ్చిన అవకాశాలను కొత్త ఆటగాళ్లు సమర్థంగా వాడుకున్నారన్న గిల్... సర్ఫరాజ్ ఖాన్, యశస్వి జైస్వాల్‌లను ఉదాహరణగా చూపించాడు. తనపై తాను పెట్టుకున్న అంచనాల కారణంగానే కొన్నిసార్లు నిరాశను ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఇప్పుడు వాటిని అధిగమించి భారీ స్కోర్లపై దృష్టి పెట్టినట్లు అతను చెప్పాడు. తొలి టెస్టులో శుభారంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయినా భారత జట్టు...ఆ మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకొని తర్వాతి రెండు టెస్టుల్లో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచినట్లు గిల్ గుర్తు చేసుకున్నాడు.

సినిమా


• గోపీచంద్

గల్లీ సౌండుల్లో భీమా

గోపీచంద్ హీరోగా నటించిన చిత్రం 'భీమా'. ఎ.హర్ష దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లు. కేకే రాధామోహన్ నిర్మించిన 'భీమా' మార్చి 8న రిలీజ్ కానుంది. రవి బస్రూర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'గల్లీ సౌండుల్లో..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. రవి బస్రూర్, సంతోష్ వెంకీ రాసిన ఈ పాటను సంతోష్ వెంకీ పాడారు. ''గోపీచంద్ పాత్ర గురించి చెప్పే ట్రాక్ ఇది. ఈ పాట మాస్‌ని అల రించేలా ఉంటుంది'' అన్నారు మేకర్స్.

త్రిష థగ్ లైఫ్ ఆరంభం


• త్రిష

'థగ్ లైఫ్'ను ఆరంభించారు హీరోయిన్ త్రిష. 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'థగ్ లైఫ్'. 'జయం' రవి, త్రిష, దుల్కర్ సల్మాన్, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ముఖ్య తారలుగా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా చిత్రీకరణ ఇటీవలే ప్రారంభమైంది. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ అయ్యారు త్రిష. సెట్స్‌లో 'థగ్ లైఫ్' స్క్రిప్ట్‌ను పట్టుకుని ఉన్నట్లుగా ఇన్‌స్టా స్టోరీలో త్రిష ఓ చిన్న వీడియోను షేర్ చేశారు. దీంతో 'థగ్ లైఫ్' సినిమా షూటింగ్‌లో త్రిష జాయిన్ అయ్యారని స్పష్టం అయింది. ప్రస్తుతం చెన్నైలో జరుగుతున్న ఈ సినిమా షెడ్యూల్ పూర్తవ్వగానే, నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ కోసం టీమ్ సెర్బియా వెళుతుందని కోలీవుడ్ సమాచారం. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్, మణిరత్నం, ఏ. శివ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

త్రిషకు క్షమాపణలు చెప్పిన ఏవీ రాజు: త్రిషను ఉద్దేశించి తమిళనాడు రాజకీయ నేత ఏవీ రాజు రెండు రోజుల క్రితం చేసిన కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ విషయంపై లీగల్‌గా ముందుకు వెళ్తానని త్రిష పేర్కొన్నారు. అనంతరం మంగళవారం రాత్రి ఏవీ రాజు స్పందించారు. తాను ఏ యాక్టర్‌నీ టార్గెట్ చేయాలనుకోవడం లేదని, తన మాటలు తప్పుగా అర్థం చేసుకోబడ్డాయని, ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని ఓ వీడియోను రిలీజ్ చేశారు ఏవీ రాజు.

కథని నమ్మి చేశారనిపిస్తోంది


- వరుణ్ తేజ్
• వరుణ్ తేజ్, అభినవ్ గోమఠం

''విభిన్న పాత్రల ద్వారా ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న అభినవ్ 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' చిత్రంలో తొలిసారి హీరోగా చేశాడు. ఈ చిత్రంతో తనకు మంచి సక్సెస్ రావాలి. టీజర్, ట్రైలర్ చూస్తే కథని నమ్మి చేసిన సినిమాలా అనిపిస్తోంది. టీమ్ అంతా చాలా నమ్మకంగా ఉన్నారు. ఈ చిత్రం విజయం సాధించి, దర్శక, నిర్మాతలకు మంచి బ్రేక్ రావాలని ఆశిస్తున్నాను'' అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. అభినవ్ గోమఠం, వైశాలి రాజ్ జంటగా తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా'. కాసుల క్రియేటివ్ వర్క్స్‌పై భవాని కాసుల, ఆరెం రెడ్డి, ప్రశాంత్.వి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగా హాజరై, మూవీ బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. అభినవ్ గోమఠం మాట్లాడుతూ– ''ఈ సినిమా కోసం నా కెరీర్‌లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. అయినా ఈ మూవీలో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు. ''నాకు తొలి అవకాశం ఇచ్చిన అభినవ్‌కు, నిర్మాతలకు రుణపడి ఉంటాను. ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను'' అన్నారు తిరుపతి రావు. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలున్న ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు భవాని కాసుల.

ఘనంగా జాకీ–రకుల్‌ల వివాహం


• జాకీ భగ్నానీ, రకుల్

నటుడు–నిర్మాత జాకీ భగ్నానీ, హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్‌ల వివాహం సౌత్ గోవాలో బుధవారం వైభవంగా జరిగింది. రెండు కుటుంబాల సభ్యులు, సన్నిహితులు, స్నేహితుల సమక్షంలో జాకీ, రకుల్ ఏడడుగులు వేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో పెళ్లి జరిగిందని బాలీవుడ్ సమాచారం. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా, శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా, అనన్యా పాండే తదితర ప్రముఖులు పెళ్లికి హాజరయ్యారు. ఇక 2021 అక్టోబరులో తమ రిలేషన్‌షిప్‌ను అధికారికంగా ప్రకటించారు జాకీ, రకుల్. నిజానికి జాకీ–రకుల్‌ల వివాహం ఫారిన్‌లో జరగాల్సింది. కానీ సెలబ్రిటీలు భారతదేశంలోనే వివాహాలు చేసుకోవాలన్నట్లుగా భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దీంతో జాకీ– రకుల్ తమ నిర్ణయాన్ని మార్చుకుని గోవాలో పెళ్లి చేసుకున్నారు.

మా నాన్నే వచ్చారనుకుంటున్నాను


• నిఖిల్

హీరో నిఖిల్ సిద్ధార్థ్ తండ్రయ్యారు. ఆయన సతీమణి డా. పల్లవి వర్మ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చారు. ''జీవితం అనేది వృత్తంలాంటిది. గత ఏడాది మా నాన్నగారు మాకు దూరం అయ్యారు. ఇప్పుడు మా కుటుంబంలోకి కొత్త సభ్యుడు చేరాడు. మా నాన్నే వచ్చారనుకుంటున్నాను'' అంటూ తన కుమారుడిని ముద్దాడుతున్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు నిఖిల్.

ఆమె కళ్లు వేటాడతాయి!


• త్రిప్తి దిమ్రీ

బాలీవుడ్ హారర్ కామెడీ ఫ్రాంచైజీలో 'భూల్ భూలయ్యా' ఒకటి. 2007లో విడుదలైన 'భూల్ భూలయ్యా', 2022లో విడుదలైన 'భూల్ భూలయ్యా 2' చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. తాజాగా 'భూల్ భూలయ్యా 3' చిత్రీకరణ జరుగుతోంది. అనీస్ బాజ్మీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్ ప్రధాన పాత్రలు చేస్తున్నారు. 'భూల్ భూలయ్యా' ఫ్యామిలీలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రీ చేరారు. ''ఆమె నవ్వు భయం పుట్టిస్తుంది. ఆమె కళ్లు వేటాడతాయి... అలాగే !భయపెడతాయి. మిస్టరీ గాళ్'' అంటూ ఈ సినిమాలో త్రిప్తి దిమ్రీ పాత్రను వివరించారు మేకర్స్.

దిష్టి బొమ్మ కథేంటి అని చూపిస్తున్నాం


• స్నేహాల్, శశిధర్

''**భూ**తద్దం భాస్కర్ నారాయణ' చిత్రం డిటెక్టివ్ థ్రిల్లర్‌గా రూపొందింది. డిటెక్టివ్ కథని పురాణాలతో ముడిపెట్టిన విధానం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది'' అని నిర్మాతలు స్నేహాల్, శశిధర్ అన్నారు. శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ మూవీ మార్చి 1న రిలీజవుతోంది. స్నేహాల్, శశిధర్ మాట్లాడుతూ– ''2014లో 'షీష్ మహల్' అనే ఇండిపెండెంట్ సినిమా, 2020లో 'నీతో' మూవీ చేశాం. 2022లో 'భూతద్దం భాస్కర్ నారాయణ' ప్రయాణం ఆరంభమైంది. ప్రతి ఇంటి ముందు దిష్టి బొమ్మ ఉంటుంది.. దాని వెనక ఉన్న కథ ఏంటి? అన్నదానికి ఫ్యాంటసీ ఎలిమెంట్‌ని జోడించి ఈ కథని తీశాడు పురుషోత్తం'' అన్నారు.


• అక్షయ్, టైగర్ ష్రాఫ్

భగ్గుమంటే నిప్పుల వానే..

''**నువ్వు** భగ్గుమంటే నిప్పుల వానే... నిన్ను చుట్టుకున్న గాలిని నేనే.. నీకు ఎప్పుడైనా తోడు ఉంటానే...' (అక్షయ్‌కుమార్), 'నువ్వు చిరుతను మించి కిలాడి.. ఈ దునియాను చేసుకో దాడి' (టైగర్ ష్రాఫ్) అంటూ సాగుతాయి హిందీ చిత్రం 'బడే మియా చోటే మియా' సాంగ్ తెలుగు లిరిక్స్. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ కీలక పాత్రధారిగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ చిత్రం ఇది. ఈ చిత్రం ఈ ఏడాది రంజాన్‌కు విడుదల కానుంది. ఈ నేపథ్యంలో 'బిందాస్ బడే భయ్యా...' అంటూ సాగే ఈ సినిమా టైటిల్ ట్రాక్‌ను విడుదల చేశారు. విశాల్ మిశ్రా సంగీత సారథ్యంలో సురేష్ బనిశెట్టి తెలుగు లిరిక్స్ అందించిన ఈ పాటను దీపక్, శరత్ సంతోష్ పాడారు.

సస్పెన్స్.. థ్రిల్


• వేదిక

'**కాం**చన 3, రూలర్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఫియర్'. హరిత గోగినేని దర్శకత్వం వహించిన ఈ మూవీలో అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ఏఆర్ అభి నిర్మించారు. కాగా బుధవారం (ఫిబ్రవరి 21) వేదిక పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఫియర్'. ఇందులో వేదిక క్యారెక్టర్ కొత్తగా ఉంటూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయనుంది. ఆమె కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన చిత్రం అవుతుంది. ప్రస్తుతం 'ఫియర్' పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: ఐ. ఆండ్రూ, సహ నిర్మాతలు: సుజాత రెడ్డి, సామ సురేందర్ రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	434	72,623
నిఫ్టీ ▽	142	22,055

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,507	▽	123
డోజోన్స్	38,492	▽	72
ఎఫ్‌టీఎస్ఈ 100	7,663	▽	57
డాక్స్	17,118	△	50
షాంఘై	2,951	△	28
నికాయ్	38,262	▽	101

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	62,258	△	119
బంగారం (99.5 స్వచ్ఛత)	62,009	△	119
వెండి (కేజీ)	70,708	▽	109

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.51	83.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.62	106.16
€	యూరో	ఎస్‌బీఐ	88.61	90.97
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.76	56.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.58	55.50
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.41	64.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.96	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49

విదేశీ రోడ్లపై మన స్కూటర్లు రయ్

- ఎగుమతుల్లో కొత్త రికార్డులు
- 10 నెలల్లో 4,21,096 యూనిట్లు
- 2022–23లో ఈ సంఖ్య 4,16,935



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో తయారైన స్కూటర్లు విదేశీ గడ్డపై పరుగులు తీస్తున్నాయి. 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి మధ్య 4,21,096 యూనిట్ల స్కూటర్లు పలు దేశాలకు ఎగుమతి అయ్యాయి. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 24 శాతం అధికం. 2022–23లో విదేశాలకు సరఫరా అయిన స్కూటర్ల సంఖ్య 4,16,935 యూనిట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన ఎగుమతుల పరిమాణాన్ని ఈ పది నెలల కాలంలోనే దాటడం విశేషం. ప్రస్తుత వేగాన్నిబట్టి చూస్తే 2023–24 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతయ్యే స్కూటర్ల సంఖ్య 5,00,000 యూనిట్లు దాటడం ఖాయంగా కనిపిస్తోంది. మేడిన్ ఇండియా వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో ఉందో ఈ గణాంకాలనుబట్టి అవగతమవుతోంది.

స్కూటర్ల ఎగుమతుల్లోనే వృద్ధి..

భారత్ నుంచి విదేశాలకు 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి మధ్య 12 శాతం క్షీణతతో 28,03,217 యూనిట్ల ద్విచక్ర వాహనాలు చేరాయి. 2022 ఏప్రిల్–2023 జనవరి మధ్య ఈ సంఖ్య 31,71,461 యూనిట్లుగా ఉంది. జనవరితో ముగిసిన 10 నెలల కాలంలో ఎగుమతుల్లో మోటార్‌సైకిల్స్ 16 శాతం, మోపెడ్స్ 43 శాతం తిరోగమన వృద్ధి సాధించాయి. స్కూటర్స్ మాత్రమే వృద్ధి నమోదు చేశాయి. స్కూటర్ల ఎగుమతులు 2013–14లో 93,931 యూనిట్లు నమోదైంది. ఏటా పరిమాణం పెరుగుతూ 2018–19లో ఏకంగా 3,98,316 యూనిట్ల ఎగుమతులను సాధించింది. ఆ తర్వాతి సంవత్సరాల్లో క్షీణిస్తూ 2020–21లో 2,32,020 యూనిట్లతో సరిపెట్టుకుంది. తిరిగి 2021–22 నుంచి వృద్ధిలో పయనించింది. 2013–14 నుంచి 2024 జనవరి వరకు విదేశాలకు చేరిన స్కూటర్ల సంఖ్య మొత్తం 33,44,223 యూనిట్లు నమోదయ్యాయి.

అగ్ర స్థానంలో హోండా..

స్కూటర్ల ఎగుమతుల్లో హోండా మోటార్‌సైకిల్స్, స్కూటర్స్ ఇండియా తొలి స్థానంలో ఉంది. 2024 జనవరితో ముగిసిన 10 నెలల కాలంలో ఈ కంపెనీ 1,87,305 యూనిట్ల స్కూటర్లను విదేశాలకు సరఫరా చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో టీవీఎస్ మోటార్ కో, సుజుకీ మోటార్‌సైకిల్స్ ఇండియా, ఇండియా యమహా మోటార్, హీరో మోటోకార్ప్, పియాజియో వెహికల్స్, ఏథర్ ఎనర్జీ, బజాజ్ ఆటో నిలిచాయి. ఇక దేశీయంగా ద్విచక్ర వాహనాల అమ్మకాలు హోల్‌సేల్‌లో 2024 జనవరిలో 26 శాతం వృద్ధితో 14.9 లక్షల యూనిట్లు జరిగాయి. 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య ఈ సంఖ్య 11 శాతం అధికమై 1.49 కోట్ల యూనిట్లను తాకింది. పరిమాణం తక్కువ అయినప్పటికీ ఎలక్ట్రిక్ స్కూటర్ల ఎగుమతులు సైతం అనూహ్య వృద్ధి సాధించాయి. 2023 ఏప్రిల్–2024 జనవరిలో 586 శాతం ఎగసి 412 యూనిట్ల ఈ–స్కూటర్లు విదేశాలకు సరఫరా అయ్యాయి.

ఫోన్‌పే ఇండస్ యాప్ స్టోర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత డిజిటల్ ప్రయాణంలో సరికొత్త అధ్యాయానికి ఫిన్‌టెక్ కంపెనీ ఫోన్‌పే తెరతీసింది. తాజాగా ఆండ్రాయిడ్ యాప్ స్టోర్ అయిన ఇండస్ యాప్‌స్టోర్‌ను ఢిల్లీ వేదికగా బుధవారం ఆవిష్కరించింది. 45 విభాగాల్లో 2 లక్షలకుపైగా యాప్స్, గేమ్స్‌ను ఈ యాప్‌స్టోర్‌లో పొందుపరిచింది. తెలుగు, ఇంగ్లిష్, హిందీ సహా 12 భాషల్లో యూజర్లు తమకు కావాల్సిన యాప్స్‌ను సర్చ్ చేయవచ్చు. డెవలపర్లు 2025 ఏప్రిల్ 1 వరకు యాప్ లిస్టింగ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. అలాగే డెవలపర్లు ఇన్–యాప్ బిల్లింగ్ కోసం తమకు నచ్చిన థర్డ్‌పార్టీ పేమెంట్ గేట్‌వేను ఎంచుకోవచ్చు. ఫోన్‌పే యాప్ లేదా ఇండస్ యాప్‌స్టోర్.కామ్ నుంచి ఇండస్ యాప్‌స్టోర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 'మొబైల్ యాప్ మార్కెట్‌లో మరింత ఆరోగ్యకర పోటీకి ఈ యాప్‌స్టోర్ నాంది పలికింది. ఇది మరింత ప్రజాస్వామ్య, శక్తివంతమైన భారతీయ డిజిటల్ పర్యావరణ వ్యవస్థను రూపొందించడంలో సహాయపడుతుంది' అని ఫోన్‌పే సీఈవో, ఫౌండర్ సమీర్ నిగమ్ తెలిపారు.



అనధికారిక రుణ యాప్‌ల పని పట్టండి

ఆర్థిక నియంత్రణ సంస్థలకు మంత్రి నిర్మలా సీతారామన్ సూచన



న్యూఢిల్లీ: అనధికారిక రుణాల యాప్‌లను కట్టడి చేసేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఆర్థిక స్థిరత్వానికి పొంచి ఉన్న రిస్కులను గుర్తించేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్రియాశీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. బుధవారం జరిగిన ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ఎస్‌డీసీ) 28వ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ మేరకు సూచనలు చేశారు. స్థూల ఆర్థిక స్థిరత్వం, సవాళ్లను ఎదుర్కొనడంలో భారత్ సన్నద్ధత, నియంత్రణ సంస్థల మధ్య సమన్వయాత్మక అంశాలు మొదలైన వాటి గురించి ఈ సమావేశంలో చర్చించినట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. సమ్మిళిత వృద్ధి సాధనకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చేలా ఆర్థిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నియంత్రణ సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్టం చేయాలని ఎఫ్ఎస్‌డీసీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్, సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్, ఐఆర్‌డీఏఐ చైర్మన్ దేవాశీష్ పాండా, ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బైజూస్ రైట్స్ ఇష్యూ సక్సెస్



పూర్తిస్థాయిలో సబ్‌స్క్రిప్షన్

న్యూఢిల్లీ: ఎడ్యుటెక్ కంపెనీ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన 20 కోట్ల డాలర్ల విలువైన రైట్స్ ఇష్యూ విజయవంతమైంది. ఇష్యూ పూర్తిస్థాయిలో సబ్‌స్క్రిప్షన్ సాధించినట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో బైజు రవీంద్రన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్త మిషన్‌లో వాటాదారులంతా పాలు పంచుకోవలసిందిగా కోరారు. బైజూస్ బ్రాండుతో కంపెనీ ఎడ్యుకేషన్ సంబంధ సేవలను అందించే సంగతి తెలిసిందే. ఇష్యూకి పూర్తిస్థాయిలో స్పందన లభించినందుకు రవీంద్రన్ కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే వాటాదారులంతా రైట్స్‌లో పాలుపంచుకుంటేనే విజయానికి ప్రామాణికత ఉంటుందని వ్యాఖ్యానించారు. అందరం కలసికట్టుగా సంస్థను నిర్మించినట్లు వాటాదారులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీంతో అందరూ కొత్త మిషన్‌లో భాగస్వాములుకావలసి ఉన్నదని సూచించారు. రైట్స్ నిధుల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు థర్డ్‌పార్టీ ఏజెన్సీని ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. రైట్స్‌కు ముందు, తదుపరి కంపెనీ యాజమాన్యంలో ఎలాంటి మార్పులు ఉండబోవని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో బ్లాక్‌బెర్రీ ఐవోటీ సెంటర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కెనడాకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్లాక్‌బెర్రీ లిమిటెడ్ కొత్తగా హైదరాబాద్‌లో ఐవోటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇంజనీరింగ్, ఇన్నోవేషన్‌ను (సీవోఈ) ప్రారంభించింది. ఇది కెనడా తర్వాత తమకు అతి పెద్ద సీవోఈ అని బ్లాక్‌బెర్రీ ఐవోటీ ప్రెసిడెంట్ మతియాస్ ఎరిక్సన్ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. బ్లాక్‌బెర్రీ క్యూఎన్ఎక్స్ గ్లోబల్ డెవలపర్ నెట్‌వర్క్‌కి ఇది ఆసియా పసిఫిక్ హబ్‌గా ఉంటుందని ఎరిక్సన్ వివరించారు. దీనికోసం పెద్ద యెత్తున నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్ కేంద్రంలో ప్రస్తుతం 60 మంది సిబ్బంది ఉన్నారు. ఏడాదిలో ఈ సంఖ్యను రెండింతలు చేయాలన్నది కంపెనీ ఆలోచన.

ఆఖర్లో అమ్మకాలు

- ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్
- 73 వేల దిగువకు సెన్సెక్స్
- ఇంట్రాడేలో నిఫ్టీ కొత్త రికార్డు
- ఐటీ, ఇంధన షేర్ల భారీ పతనం




ముంబై: ఆఖరి గంటలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీల ఆరు రోజుల వరుస ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. ట్రేడింగ్‌లో 22,249 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 142 పాయింట్లు పతనమై 22,055 వద్ద నిలిచింది. సెన్సెక్స్ 434 పాయింట్లు నష్టపోయి 73 వేల స్థాయి దిగువన 72,623 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లోని మిశ్రమ సంకేతాలు, గరిష్ఠ స్థాయిల ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు ట్రేడింగ్ చివర్లో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ఇంట్రాడేలో స్థిరంగా ముందుకు కదలాయి. ఒక దశలో సెన్సెక్స్ 211 పాయింట్లు బలపడి 73,268 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 52 పాయింట్లు పెరిగి ఆల్‌టైం హై స్థాయి(22,249 వద్ద)ని నమోదు చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, రియల్టీ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లు విక్రయాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఆయిల్‌అండ్‌గ్యాస్, ఐటీ షేర్లు భారీ నష్టాలు చవిచూశాయి. యూఎస్ ఫెడ్ మినిట్స్ వెల్లడికి ముందు ఈక్విటీ మార్కెట్లు ఒడిదుడుకులకు గురికావచ్చనే ఆందోళనలతో మధ్య, చిన్న తరహా షేర్లు పతనాన్ని చవిచూశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.27%, 0.84% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.285 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.411 కోట్ల షేర్లు కొన్నారు. యూఎస్ టెక్ దిగ్గజం ఎన్‌విడియా త్రైమాసిక ఫలితాలు, ఫెడ్ రిజర్వ్ సమావేశ వివరాల వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప బలహీనతతో ట్రేడవుతున్నాయి.

- వరుసగా నాలుగో రోజూ పేటీఎం షేరు 5% ర్యాలీ చేసి రూ.395 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. తన అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఫెమా నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ఈడీ ఇప్పటి వరకు ఎలాంటి నిబంధనల అతిక్రమణలు గుర్తించలేకపోవడంతో పేటీఎం షేరుకు కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభిస్తోంది.
- జీ ఎంటర్‌టైన్‌మెంట్ 15% నష్టపోయి రూ.164.50 వద్ద ముగిసింది. ఈ కంపెనీ ఖాతాల్లో అవకతవకలు జరిగినట్లు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ గుర్తించడంతో షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది.
- క్యూ3 లాభం 13% వృద్ధితో ఏబీబీ ఇండియా షేరు 10% పెరిగి రూ.4989 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ట్రేడింగ్‌లో 11% పెరిగి రూ.5019 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

వాణిజ్యం, పెట్టుబడులపై పారదర్శకంగానే..

- దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలపై భారత్ పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా వ్యవహరిస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఈ విషయమై దీర్ఘకాలంలో ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ), పెట్టుబడులపై సంప్రదింపులు నిర్వహించే దేశాలు.. భారత్ అందించే భారీ మార్కెట్ అవకాశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ప్రపంచంలో భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని గుర్తు చేశారు. సీఐఐ ఇండియా–యూరప్ సమావేశంలో భాగంగా మంత్రి మాట్లాడారు. యువ జనాభా అధికంగా కలిగిన భారత్‌లో వస్తు, సేవలకు ఉన్న డిమాండ్.. ప్రపంచవ్యాప్తంగా కంపెనీలకు భారీ అవకాశాలను కల్పిస్తుందన్నారు. బ్రిటన్, ఒమన్, యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై భారత్ సంప్రదింపులు నిర్వహిస్తున్న విషయం గమనార్హం. ఇదే సమావేశంలో పాల్గొన్న బ్రిటన్ మంత్రి లార్డ్ అహ్మద్ మాట్లాడుతూ.. బ్రిటిష్ కంపెనీలు భారత్‌లో పెద్ద పెట్టుబడిదారులుగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతోందన్నారు.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్‌బీలో 9000 టెక్నీషియన్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ).. దేశవ్యాప్తంగా ఉన్న అన్నీ రైల్వే రీజియన్లలో వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 9000.
- **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్ గ్రేడ్1 సిగ్నల్–1100, టెక్నీషియన్ గ్రేడ్ 3–7900.
- **ఆర్ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.
- **వయసు:** 01.07.2024 నాటికి టెక్నీషియన్ గ్రేడ్1 సిగ్నల్ పోస్టులకు 18 నుంచి 36 ఏళ్లు, టెక్నీషియన్ గ్రేడ్–3 పోస్టులకు 18 నుంచి 33 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
- **ప్రారంభ వేతనం:** నెలకు టెక్నీషియన్ గ్రేడ్1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200, టెక్నీషియన్ గ్రేడ్3 పోస్టులకు రూ.19,900.
- **ఎంపిక విధానం:** ఫస్ట్ స్టేజ్ సీబీటీ–1, సెకండ్ స్టేజ్ సీబీటీ–2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.03.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.04.2024.
- **వెబ్‌సైట్:** https://indianrailways.gov.in

ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎస్‌వోఈ/సీవోఈ)ల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎనిమిదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతితోపాటు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఉంటుంది.

గురుకుల పాఠశాలలు

- కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(పీజీటీ), మల్లి; స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, విశాఖపట్నం; స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, పార్వతీపురం(జోగింపేట); కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్, విస్సన్నపేట; స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, శ్రీకాళహస్తి; స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, శ్రీశైలం డ్యామ్; కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్, తనకల్లు.
- **మొత్తం సీట్ల సంఖ్య:**780(ఇంటర్ ఎంపీసీ–300, ఇంటర్ బైపీసీ–300, ఎనిమిదో తరగతి–180).
- **అర్హత:** ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎనిమిదో తరగతి ప్రవేశ పరీక్షకు అర్హులు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రవేశ పరీక్షకు అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు.
- **పరీక్ష విధానం:** ఎనిమిదో తరగతికి ఏడో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు(10 మార్కులు), ఇంగ్లిష్(10 మార్కులు), హిందీ(10 మార్కులు), మ్యాథ్స్(20 మార్కులు), ఫిజికల్ సైన్స్(15 మార్కులు), బయో సైన్స్(15 మార్కులు), సోషల్ స్టడీస్(20 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇంటర్‌కు పదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇంగ్లిష్(20 మార్కులు),మ్యాథ్స్(40 మార్కులు), ఫిజికల్ సైన్స్(20 మార్కులు), బయో సైన్స్(20 మార్కులు) సబ్జెక్టు ప్రశ్నలు ఉంటాయి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2024.
- **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 30.03.2024
- **ప్రవేశ పరీక్ష తేది:** 07.04.2024.
- **వెబ్‌సైట్:** https://twreiscet.apcfss.in

జెడ్ఆర్‌వో చెన్నైలో సోల్జర్ టెక్నికల్ నర్సింగ్ అసిస్టెంట్ పోస్టులు

ఇండియన్ ఆర్మీ చెన్నైలోని జోన్ రిక్రూటింగ్ ఆఫీస్..అగ్నిపథ్ పథకం కింద 2024–25 సంవత్సరం నియామకాలకు సంబంధించి సోల్జర్ టెక్నికల్ నర్సింగ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ నియామకాలకు తమిళనాడు,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,పుదుచ్చేరి(కరైకాల్,యానాం,పుదుచ్చేరి), అండమాన్ అండ్ నికోబార్,కేంద్ర పాలిత ప్రాంతాల జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులు. ఇందులో అర్హత సాధించిన వారికి శారీరక సామర్థ్య,వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థుల వడపోత అనంతరం నాలుగేళ్ల కాలానికి అగ్నివీరులను ఎంపికచేస్తారు.

- **అర్హత:** 10+2/ఇంటర్మీడియట్ సైన్స్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బోటనీ, జువాలజీ, ఇంగ్లిష్)లో కనీసం 50% మార్కులు, ప్రతి సబ్జెక్టులో కనీసం 40% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **వయసు:**17 1/2 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష, రిక్రూట్‌మెంట్ ర్యాలీ(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్), వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 22.03.2024.
- **ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం:** 22.04.2024.
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

- టీఎస్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు
- ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ
- ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూప్‌లు

గురుకులాల్లో.. ఉచితంగా ఇంటర్

ఇంటర్మీడియెట్.. పదో తరగతి పూర్తి చేసుకున్న తర్వాత ఎక్కువ మంది విద్యార్థులు ఎంచుకునే కోర్సు! తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలలు.. ఉచిత విద్య, వసతి సదుపాయాలతోపాటు నీట్, జేఈఈ మెయిన్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణసైతం అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశాలకు ఏటా రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్ ఎంట్రన్స్ టెస్ట్ పేరుతో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. తాజాగా.. 2024-25 ప్రవేశాలకు సంబంధించి టీఎస్ఆర్‌జేసీ సెట్-2024కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. టీఎస్ఆర్‌జేసీ సెట్-2024 వివరాలు, కళాశాలలు- సీట్లు, ప్రవేశ పరీక్ష విధానం తదితర వివరాలు..



తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలల్లో బోధన, ఇతర ప్రమాణాలు ఉన్నతంగా ఉండేలా పర్యవేక్షించేందుకు.. తెలంగాణ గురుకుల విద్యాలయాల విభాగం (తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ) పేరుతో ప్రత్యేక విభాగాన్ని.. విద్యా శాఖ పరిధిలో ప్రారంభించారు. రాష్ట్రంలోని గురుకుల కళాశాలల్లో ప్రవేశాలతోపాటు అన్ని అంశాలను ఈ సొసైటీనే పర్యవేక్షిస్తుంది.

35 కళాశాలలు-2,996 సీట్లు

ప్రస్తుతం తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలో 35 గురుకుల కళాశాలల్లో 2,996 సీట్లు అందుబాటులో ఉన్నాయి. బాలికల కోసం ప్రత్యేకంగా 20 కళాశాలలు ఏర్పాటు చేశారు. 33 కళాశాలల్లో.. ప్రతి కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో 40 సీట్లు, బైపీసీ గ్రూప్‌లో 40 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులందరికీ అవకాశం ఉండే సర్వేల్ గురుకుల కళాశాలలో ఎంపీసీలో 88, బైపీసీలో 60; ఎంఈసీలో 30 సీట్లు చొప్పున ఉన్నాయి.

అదేవిధంగా హసన్‌పర్తిలోని మహిళల గురుకుల కళాశాలలోనూ ఎంపీసీలో 88, బైపీసీలో 60, ఎంఈసీలో 30 సీట్లు ఉన్నాయి. మిగిలిన 33 గురుకుల కళాశాలలకు సంబంధించి ప్రతి కళాశాలకు.. పోటీ పడేందుకు జిల్లా స్థానికతను నిర్దేశించారు. అన్ని కళాశాలల్లోనూ ఇంగ్లిష్ మీడియంలోనే బోధన ఉంటుంది.

అర్హతలు

2024 మార్చిలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మాత్రమే అర్హులు. వార్షిక పరీక్షల్లో ఓసీ అభ్యర్థులు 6 జీపీఏతో, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు 5 జీపీఏతో ఉత్తీర్ణత సాధించాలి. అన్ని కేటగిరీల విద్యార్థులు ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో తప్పకుండా 4 జీపీఏ సాధించాలి. పదో తరగతి వరకు తప్పనిసరిగా తెలంగాణలోనే చదివి ఉండాలి.

ఉమ్మడి కౌన్సెలింగ్

మొత్తం 35 కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి.. రాష్ట్ర స్థాయిలో తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ఆర్‌జేసీ సెట్)ను నిర్వహించి..అందులో పొందిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించే క్రమంలో ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఒక్కో సీటుకు అయిదుగురిని చొప్పున కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. ఎంపీసీ విద్యార్థులకైతే మ్యాథ్స్‌లో వచ్చిన మార్కులు, బైపీసీ విద్యార్థులకు బయాలజీలో వచ్చిన మార్కులు, ఎంఈసీ విద్యార్థులకు సోషల్ స్టడీస్‌లో వచ్చిన మార్కులను పరిగణలోకి తీసుకుని తుది జాబితా రూపొందించి ప్రవేశాలు ఖరారు చేస్తారు.

ఉచిత విద్య, వసతి

టీఎస్ఆర్‌జేసీ సెట్ ద్వారా ప్రవేశాలు ఖరారు చేసుకున్న విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా విద్యనందిస్తారు. ఎలాంటి ఫీజులు చెల్లించనక్కర్లేదు. అదే విధంగా వసతి సదుపాయం కూడా ఉచితంగానే ఉంటుంది. గురుకుల విద్యా విధానంలో బోధన సాగుతుంది. ఉదయం 5:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు అకడమిక్, ఫిజికల్ యాక్టివిటీస్, స్పోర్ట్స్, గేమ్స్, ఇతర కో–కరిక్యులర్ యాక్టివిటీస్‌ను నిర్వహిస్తారు. ఫలితంగా విద్యార్థులు అకడమిక్ నైపుణ్యాలతోపాటు సామాజిక అవగాహన పొందే అవకాశం కూడా లభిస్తుంది.

150 మార్కులకు పరీక్ష

టీఎస్ఆర్‌జేసీ సెట్‌ను మూడు విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న గ్రూప్ ఆధారంగా సంబంధిత విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఎంపీసీ గ్రూప్ విద్యార్థులకు ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అదేవిధంగా బైపీసీ గ్రూప్ విద్యార్థులకు ఇంగ్లిష్, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఎంఈసీ గ్రూప్ విద్యార్థులకు ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి గ్రూప్‌నకు సంబంధించి ప్రతి విభాగం నుంచి 50 ప్రశ్నలు చొప్పున 150 ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం రెండున్నర గంటలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ▪ దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న గ్రూప్‌ను ఎంచుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**2024, మార్చి 16
- **టీఎస్ ఆర్‌జేసీ సెట్ తేదీ:** 2024, ఏప్రిల్ 21 (10 గంటల నుంచి 12:30 వరకు)
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://tsrjdc.cgg.gov.in/TSRJDCWEB20/#!/home0103prsvdf.rps

మంచి మార్కులకు ఇలా

రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ఆర్‌జేసీ సెట్‌లో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు పదో తరగతి పాఠ్య పుస్తకాలను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి.

ఇంగ్లిష్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం.. యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. వీటితోపాటు.. పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్‌పై అవగాహన పెంచుకోవాలి. చదవడంతో పాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందేందుకు అవకాశం లభిస్తుంది. పంక్చుయేషన్స్, ప్రిపొజిషన్స్, ఆర్టికల్స్‌పై దృష్టి పెట్టాలి. అదే విధంగా.. రీడింగ్ కాంప్రహెన్షన్ పెంచుకునేలా ప్రిపరేషన్ సాగించాలి.

మ్యాథమెటిక్స్

ప్రతి చాప్టర్‌ను చదివి వాటికి సంబంధించిన ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగణితం, రేఖా గణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై పట్టు సాధించడం ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. టెక్స్ట్ బుక్‌లో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు; సంభావ్యత; సాంఖ్యక శాస్త్రం; త్రికోణమితి; క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలపై పట్టు సాధించాలి.

ఫిజికల్ సైన్స్

ఈ సబ్జెక్టుకు సంబంధించి.. ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు- ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా దృష్టిపెట్టాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై ఎక్కువ శ్రద్ధతో చదవాలి. అదే విధంగా.. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

బయలాజికల్ సైన్స్

ఈ సబ్జెక్ట్‌లో మార్కుల కోసం ఒక అంశాన్ని నేర్చుకున్న తర్వాత దాన్ని వాస్తవ పరిస్థితులతో అన్వయించే నేర్పు సొంతం చేసుకోవాలి. డయాగ్రమ్స్‌ను ప్రాక్టీస్ చేసి.. భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా పదో తరగతి చాప్టర్స్‌లోని ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం ఎంతో మేలు చేస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి.

సోషల్ స్టడీస్

సోషల్ స్టడీస్‌కు సంబంధించి సబ్జెక్ట్ అంశాలతో పాటు సమకాలీన అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. జాగ్రఫీ,ఎకనామిక్స్‌లో భారతదేశం–భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత,ఉత్పత్తి–ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధం సమయంలో ప్రపంచం;సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రపై ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగాల నుంచి స్వీకరించారు వంటి కోణాల్లో చదవాలి.

శ్రీశారదా పీఠంలో వైభవంగా రాజశ్యామల యాగం

పూర్ణాహుతిలో పాలుపంచుకున్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సంప్రదాయ వస్త్రధారణతో పీఠంలో రెండు గంటలు యాగం, పూజలు
30 నిమిషాలు అమ్మవారికి పూజలు..స్వహస్తాలతో హారతులు
వేదపండితులను సత్కరించిన సీఎం జగన్



రాజశ్యామల అమ్మవారి పూజల్లో పాల్గొన్న సీఎం జగన్.. అమ్మవారికి హారతి ఇస్తున్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి. చిత్రంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి

పెందుర్తి: విశాఖ శ్రీ శారదా పీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో రాజశ్యామల యాగం వైభవోపేతంగా జరిగింది. యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలుపంచుకున్నారు. అంతకుముందు శారదా పీఠానికి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌కు పీఠం ప్రతినిధులు పూర్ణకుంభంతో వేద మంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలను కలిసి సీఎం జగన్ ఆశీస్సులు తీసుకున్నారు. జగన్ సంప్రదాయ వస్త్రధారణతో స్వామీజీలతో కలిసి రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం స్వర్ణ మండపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దీక్ష పీఠం వద్ద విశేష పూజలు చేశారు. ప్రముఖ పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ స్వామీజీల సమక్షంలో దాదాపు 30 నిమిషాలు అమ్మవారికి జగన్ ప్రత్యేక పూజలు చేసి స్వహస్తాలతో హారతులిచ్చారు. పీఠంలోని స్వయంజ్యోతి మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి, దాసాంజనేయస్వామిలను దర్శించుకున్నారు. జమ్మి చెట్టుకు ప్రదక్షిణ చేసి పూజలు చేశారు. వేద పండితులను సీఎం జగన్ సత్కరించి జ్ఞాపికలు అందించారు. అనంతరం అత్యంత వైభవోపేతంగా నిర్వహించిన రాజశ్యామల యాగాన్ని దర్శించుకుని, పూర్ణాహుతిలో పాలుపంచుకున్నారు. యాగ భస్మాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ సీఎం నుదిటిన దిద్దారు. రెండు గంటలకు పైగా సీఎం వైఎస్ జగన్ యాగం, పూజా క్రతువుల్లో పాల్గొన్నారు. పీఠంలోని వేద విద్యార్థులతో ముచ్చటించారు.

రాజశ్యామల యాగాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించే ఏకైక పీఠం ఇదే: స్వామీజీ

దేశంలో రాజశ్యామల యాగాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించే ఏకైక పీఠం విశాఖ శ్రీ శారదా పీఠమని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల సీఎంలు సైతం ఇక్కడ రాజశ్యామల యాగంలో పాల్గొన్న వారే అని తెలిపారు. శ్రీ శారదా పీఠంలో కొలువుదీరిన రాజశ్యామల మాత అత్యంత శక్తివంతమైన దేవత అని స్వామీజీ తెలిపారు.



సముద్రం అడుగున జలచరాల శ్మశానంలా కనిపిస్తున్న ఈ చిత్రాన్ని అలెక్స్ డాసన్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు. ఓ డైవర్ టార్చి వెలుతురులో తిమింగలం అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న ఈ ఫొటో ఆయనకు అండర్ వాటర్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్-2024 పురస్కారాన్ని తెచ్చిపెట్టింది. మొత్తంగా 6500 ఎంట్రీలు రాగా.. ఇది మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది

ఎండలు పెరిగాయ్!

సగటున 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు చిటపటమంటున్నాయి. వేసవి సీజన్ రాకముందే ఎండల తీవ్రత వేగంగా పెరిగింది. ప్రస్తుతం నమోదు కావాల్సిన సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఏకంగా 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు కావడంగమనార్హం. పగటి ఉష్ణోగ్రతలకు తోడుగా రాత్రి పూట కూడా ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. బుధవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 36.4 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత దుండిగల్‌లో 18.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

ఖమ్మంలో 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా..

గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఖమ్మంలో సాధారణం కంటే 4 డిగ్రీల మేర అధికంగా నమోదు కాగా... హైదరాబాద్, నల్లగొండ, ఆదిలాబాద్ జిల్లాల్లో 3 డిగ్రీల మేర అధికంగా నమోదయ్యాయి. మిగతా కేంద్రాల్లో 2 డిగ్రీల్లోపు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణంలో తేమశాతం తగ్గడంతో పగటి పూట ఉక్కపోత పెరిగింది. దీని ప్రభావంతో ఉష్ణోగ్రత మరింత అధికంగా ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఇదే తరహాలో వాతావరణం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
భద్రాచలం	36.4	22.5	మహబూబ్‌నగర్	35.1	22.2
ఆదిలాబాద్	36.3	20.2	దుండిగల్	34.7	18.2
నిజామాబాద్	36.2	20.3	హైదరాబాద్	34.7	20.2
నల్లగొండ	36.0	20.2	రామగుండం	34.6	19.0
ఖమ్మం	35.4	22.0	హకీంపేట్	34.5	18.8
మెదక్	35.2	18.3	హనుమకొండ	34.5	20.5

'గ్యాలంట్రీ అవార్డులను పరిశీలించండి'

సాక్షి, హైదరాబాద్ : అటవీశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి కూడా ఇతర యూనిఫామ్ సర్వీస్ లాగే జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో గ్యాలంట్రీ అవార్డులు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. అటవీశాఖలో అత్యున్నత సేవలు అందించినందుకుగాను అర్హులైన వారికి గ్యాలంట్రీ అవార్డులకు ఎంపిక చేసే విష యంలో తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పీసీసీఎఫ్‌కు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అండర్ సెక్రటరీ బీఆర్ మీనా బుధవారం లేఖ రాశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇతర రాష్ట్రాలు శిక్షణ కోరడం మన పనితీరుకు నిదర్శనం

ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ విజేతలను సన్మానించిన డీజీపీ

సాక్షి, హైదరాబాద్: ఇతర రాష్ట్రాల వారు తెలంగాణ పోలీసులను శిక్షణ ఇవ్వమని కోరడం రాష్ట్ర పోలీస్ శాఖ పనితీరుకు నిదర్శనమని డీజీపీ రవి గుప్తా అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ చాంపియన్ షిప్ (చార్మినార్ ట్రోఫీ)ను కైవసం చేసుకున్న విజేతలను డీజీపీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రీడా విభాగపు ఐజీ స్టీఫెన్ రవీంద్ర, ఏఐజీ ఎం.రమణ కుమార్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, 12 ఏళ్ల తర్వాత తెలంగాణ పోలీస్ శాఖ చార్మినార్ ట్రోఫీని కైవసం చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు ప్రతిభను కనబరిచి 5 బంగారు పతకాలు, 7 వెండి పతకాలు, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీలో ఓవరాల్ విన్నర్స్ ట్రోఫీతో పాటు ప్రొఫెషనల్ వీడియోగ్రఫీలో ఓవరాల్ రన్నర్స్ ట్రోఫీని గెలుచుకుని పోలీస్‌శాఖ ప్రతిభను మరోసారి చాటి చెప్పారని కొనియాడారు. మన చార్మినార్ ట్రోఫీ మనం గెలుచుకున్నందున, దానిని కాపాడుకోవాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పతకాలు సాధించింది వీరే..

బంగారు పతకాలు సాధించిన వారు: జి.రామకృష్ణారెడ్డి, డి.విజయ్‌కుమార్, వి.కిరణ్‌కుమార్, పి.అనంతరెడ్డి, ఎం.దేవేందర్ ప్రసాద్

వెండి పతకాలు సాధించిన వారు: పి.పవన్, ఎన్.వెంకటరమణ, ఎం.హరిప్రసాద్, కె.శ్రీనివాస్, షేక్ ఖాదర్ షరీఫ్, సీహెచ్.సంతోష్, కె.సతీశ్

అజ్మతుల్లా హుస్సేనీ బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: ఇటీవల రాష్ట్ర వక్ఫ్ బోర్డు నూతన చైర్మన్‌గా నియమితులైన అజ్మతుల్లా హుస్సేనీ బుధవారం హైదరాబాద్ హజ్‌హౌస్‌లోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'రూట్' క్లియర్

కొలిక్కి వచ్చిన నిజామాబాద్-జగ్దల్‌పూర్ హైవే కథ

- పూర్తి యాక్సెస్ కంట్రోల్డ్ జాతీయ రహదారిగా నిర్మాణం
- ఆర్మూరు-మంచిర్యాల మధ్య 4 వరసలు
- 100 కి.మీ బైపాస్‌లు.. మొత్తం రూ.3,850 కోట్ల వ్యయం





లక్సెట్టిపేట మీదుగా జగిత్యాల నుంచి ఆర్మూర్ వెళ్లే రోడ్డు

ప్యాకేజీ1: ఆర్మూరు నుంచి మెట్‌పల్లి	ప్యాకేజీ2: మెట్‌పల్లి నుంచి జగిత్యాల	ప్యాకేజీ3: జగిత్యాల నుంచి రాయపట్నం	ప్యాకేజీ4: రాయపట్నం నుంచి మంచిర్యాల
35.9 కి.మీ	28.7 కి.మీ	31.9 కి.మీ	35.9 కి.మీ

సాక్షి, హైదరాబాద్: వివాదాలు.. ఉద్యమాలు.. వ్యతిరేకతలతో ఒక్క అడుగు కూడా ముందుకు పడకుండా పోయిన ఓ జాతీయ రహదారి కథ కొలిక్కి వచ్చింది. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఇది రాష్ట్రంలో మరో ఎక్స్‌ప్రెస్ వే తరహాలో పూర్తి యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా రూపుదిద్దుకోబోతోంది. 131.8 కి.మీ. మేర నిర్మించే నాలుగు వరసల రహదారిలో 46 వంతెనలతో పాటు ఆర్‌ఓబీలు, అండర్‌పాస్‌లు ఉండనున్నాయి. ఈ ప్రాజెక్టుకు రూ.3,850 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతుండటంతో..

నిజామాబాద్- ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ ఎన్‌హెచ్ 63పై ట్రక్కులు ఎక్కువగా తిరుగుతుంటాయి. రెండు లేన్లతో ఇరుగ్గా ఉన్న రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారటంతో 4 వరసలకు విస్తరించాలని కేంద్రం గతంలో నిర్ణయించింది. ఇందులో నిజామాబాద్ నుంచి ఆర్మూరు శివారులోని హైవే 44 వరకు, తిరిగి మంచిర్యాల దాటిన తర్వాత ఉండే హైవే 363 నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు చెన్నూరు వరకు.. రాష్ట్రప్రభుత్వ ఆధీనంలోని హైవేల విభాగం విస్తరిస్తుంది. ఆర్మూరు నుంచి మంచిర్యాల వరకు కీలక నిర్మాణం అయినందున దాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు అప్పగించారు. రాష్ట్ర విభాగం ఇప్పటికే ఆ రోడ్డును అవసరమైన ప్రాంతాల్లో 4 వరసలుగా మార్చడం, మిగతా చోట్ల మెరుగుపరచటం చేస్తోంది. అయితే ఎన్‌హెచ్ఏఐకి అప్పగించిన ఆర్మూరు-మంచిర్యాల రోడ్డు పట్టణాలు, గ్రామాల మీదుగా సాగుతున్నందున దాన్ని పూర్తి గ్రీన్‌ఫీల్డ్ హైవేగా మార్చాలని భావించారు. కానీ అందుకు భారీ మొత్తంలో సాగు భూములు సేకరించాల్సి రావటంతో రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో ఉన్న రోడ్డునే విస్తరించాలని భావించారు. కానీ, పట్టణాలు, గ్రామాల్లో భారీగా నిర్మాణాలను తొలగించాల్సి రావటంతో ఈసారి పట్టణ, గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. దీంతో ఈ ప్రతిపాదన ముందుకు వెళ్లలేదు. చివరకు పట్టణాలు, గ్రామాలున్న చోట బైపాస్‌లు నిర్మించి, మిగతా రోడ్డును విస్తరించాలని నిర్ణయించారు. గత నెల్లో టెండర్లు పిలవగా, ఇప్పుడు వాటిని ఓపెన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ రోడ్డు నిర్మాణంపై బుధవారం ఢిల్లీలో కీలక సమావేశాన్ని నిర్వహించారు. రోడ్డు డిజైన్, ఎలివేటెడ్ కారిడార్ నమూనాలు, రహదారులను క్రాస్ చేసేందుకు వీలుగు చేయాల్సిన ఏర్పాట్లు తదితరాలపై చర్చించారు. నిర్మాణ సంస్థతో ఒప్పందం చేసుకుని త్వరలో పనులు మొదలుపెట్టాలని నిర్ణయించారు.

నో డైరెక్ట్ క్రాసింగ్: ఆర్మూరు-మంచిర్యాల రోడ్డు మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, లక్సెట్టిపేటల మీదుగా సాగుతుంది. ఈ మార్గంలో 100 కి.మీ.ల మేర బైపాస్‌లే ఉండనున్నందున ఈ రోడ్డు దాదాపు కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే తరహాలోనే ఉండనుంది. ఆయా పట్టణాల వద్ద 6 కి.మీ. నుంచి 12 కి.మీ. మేర భారీ బైపాస్‌లు ఉంటాయి. ఇవి కాకుండా మరో 8 ప్రాంతాల్లో చిన్న బైపాస్‌లు నిర్మిస్తారు. ఇది పూర్తి యాక్సెస్ కంట్రోల్డ్ రహదారి (ఇతర రోడ్లు దీన్ని నేరుగా క్రాస్ చేయడానికి అవకాశం ఉండదు) కాబట్టి అలాంటి ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తారు. బైపాస్‌ల కోసం 500 హెక్టార్ల భూమిని సేకరించారు. దీనికే రూ.900 కోట్లుఖర్చవుతోంది. ఇక వంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్‌ఓబీలు దాదాపు 46 వరకు ఉంటాయి.

25నే ఏపీ గ్రూప్-2 ప్రిలిమ్స్

సాక్షి, అమరావతి: ఒకే రోజు గ్రూప్-2 ప్రిలిమ్స్, ఎస్‌బీఐ పరీక్షలు ఉన్నాయని.. ఈ రెండింటికి దరఖాస్తు చేసినవారు ఉన్నారని.. ఈ నేపథ్యంలో గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయించాలని కుయుక్తులు పన్నిన ఎల్లో బ్యాచ్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గ్రూప్-2 పరీక్ష జరిగే ఈ నెల 25న ఎస్‌బీఐ పరీక్ష కూడా రాస్తున్నవారు కేవలం 550 మందే ఉన్నారని తేలింది. ఈ 550 మందికి మార్చి 4న పరీక్ష నిర్వహిస్తామని ఎస్‌బీఐ తెలిపింది. దీంతో యథాథావిధిగా ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ).. గ్రూప్- 2 పరీక్షను ఈ నెల 25న నిర్వహించనుంది. గ్రూప్-2 ప్రిలిమ్స్ రోజే ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ పరీక్ష కూడా ఉందని.. ఇలాంటి వారు 10 వేల మంది ఉన్నారని, వీరికి నష్టం కలగకుండా గ్రూప్-2 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని ఎల్లో బ్యాచ్ డిమాండ్ చేసింది. కానీ లక్షల మంది గ్రూప్స్ అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు ఏపీపీఎస్సీ.. ఎస్‌బీఐ బ్యాంకు ఉన్నతాధికారులను సంప్రదించింది. ఈ నెల 25న పరీక్ష స్లాట్ కేటాయించిన ఎస్‌బీఐ అభ్యర్థులకు మరోరోజు అవకాశం ఇవ్వాలని విన్నవించింది. దీంతో ఎస్‌బీఐ అధికారులు గ్రూప్-2, ఎస్‌బీఐ రెండు పరీక్షలు రాసే అభ్యర్థుల వివరాలను తమకు పంపించాలని ఏపీపీఎస్సీని కోరారు. దీంతో ఏపీపీఎస్సీ ఈనెల 19 వరకు రెండు పరీక్షలు రాసే అభ్యర్థుల వివరాలను సేకరించగా మొత్తం 550 మంది ఉన్నట్టు తేలింది. దీంతో వీరికి మార్చి 4న పరీక్ష నిర్వహిస్తామని ఎస్‌బీఐ తెలిపింది.

ఈ అభ్యర్థులు 23వ తేదీ ఉదయం 9 గంటల్లోగా https://ibpsonline.ibps.in/sbijaoct23/లో పరీక్ష తేదీ మార్పుకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

ఏ క్షణమైనా సర్టిఫికెట్ల పరిశీలన

- ఉద్యోగాల భర్తీ వేగవంతం దిశగా టీఎస్‌పీఎస్సీ చర్యలు
- ఇప్పటికే పలు కేటగిరీల జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ విడుదల
- తాజాగా నిర్దేశిత సర్టిఫికెట్లతో రెడీగా ఉండాలంటూ సూచన



సాక్షి, హైదరాబాద్

ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చర్యలు మొదలుపెట్టింది. ఇప్పటికే పలు కేటగిరీల్లో ఉద్యోగాలకు సంబంధించి జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్ఎల్)ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (175), డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (18), హార్టికల్చర్ ఆఫీసర్ (22), ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలోని లైబ్రేరియన్ (77), అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (117), గ్రూప్-4 (8180) పోస్టులకు సంబంధించి వెబ్‌సైట్‌లో జీఆర్ఎల్ అందుబాటులో ఉంది. ఈ క్రమంలో కేటగిరీల వారీగా మెరిట్ సాధించిన అభ్యర్థుల ప్రాథమిక జాబితాలను కమిషన్ అతి త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే వేగంగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసి ఆ తర్వాత తుది జాబితాలు విడుదల చేసేలా కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ క్రమంలోనే ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కోసం అన్ని రకాల ఒరిజినల్ సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది.

ఈ సర్టిఫికెట్లు తప్పనిసరి

విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు అభ్యర్థులు అందుబాటులో ఉంచుకోవాలి. అదేవి ధంగా ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు, వివిధ కమ్యూనిటీలకు చెందిన అభ్యర్థులు కమిషన్ నిర్దేశించిన తేదీలతో కూడిన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవా లి. ఏ క్షణంలోనైనా సర్టిఫికెట్ల పరిశీలన తేదీలు ఖరారు కావచ్చునని టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

మున్సిపల్ శాఖలో వివిధ పోస్టులకు జీఆర్ఎల్ విడుదల

పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టును కమిషన్ విడుదల చేసింది. ఈ జాబితాను కమిన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.